నిజాల నిగ్గు తేల్చే
# చర్చ
తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

నిజాల నిగ్గు తేల్చే చర్చ తెలుగు దిన పత్రిక

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..?
సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 24 సంచిక : 15
గురువారం, అక్టోబర్ 09, 2025 , పేజీలు - 12 వెల: 2/-



బీసీ రిజర్వేషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు రేపు అంటే గురువారం (అక్టోబర్ 9) మధ్యాహ్నం 2:15గంటలకు వాయిదా వేసింది. తెలంగాణ ప్రభుత్వం తరపున మరికొన్ని వాదనలు వినిపిస్తామని అడ్వకేట్ జనరల్ న్యాయమూర్తులను కోరారు.

## బీసీ రిజర్వేషన్లపై ఎడతెగని

# ఉత్కంఠ..

### బీసీ రిజర్వేషన్లపై విచారణ వాయిదా..

### హైకోర్టు విచారణ గురువారం కి వాయిదా

### రోజంతా ఇరు వర్గాల హైవోల్టేజ్ వాదనలు




హైదరాబాద్,అక్టోబర్8:బీసీ రిజర్వేషన్ బిల్లుపై తెలంగాణ హైకోర్టు తీర్పును రేపటి (గురువారం)కి వాయిదా వేసింది. గురువారం మధ్యా హ్నం 2:15గంటలకు విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది. బీసీ రిజర్వేషన్లపై మొత్తం 28 ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలయ్యాయి. అన్ని పిటిషన్లను కలిపి హైకోర్టు.. బుధవారం మధ్యాహ్నం లంచ్ బ్రేక్ తర్వాత విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరపున అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు పలు ప్రశ్నలు వేసింది. గవర్నర్ దగ్గర బిల్లు ఎప్పటినుంచి పెండింగ్‌లో ఉంది?, ట్రిపుల్ టెస్టు విధానం అమలు చేశారా?, బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ ఎలా నిర్వహించారు?, కమిషన్ రిపోర్ట్ పబ్లికేషన్ చేశారా?, ప్రజల అభ్యంతరాలను స్వీకరించారా?.. అంటూ హైకోర్టు ప్రశ్నించింది. షెడ్యూల్ నోటిఫై అయ్యిందా? అని కూడా ఏజీని ప్రశ్నించింది. వాదనలు ఇంకా వినిపించాల్సి ఉన్నందున విచారణ మిగతా2లో...

## స్థానిక ఎన్నికలకు

# నేడు నోటిఫికేషన్

### హైకోర్టులో విచారణ ఉన్నప్పటికి ప్రక్రియ మొదలు

### అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డితో మంత్రుల మంతనాలు



హైదరాబాద్,అక్టోబర్8: తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి గురువారం యథావిధిగా నోటిఫికేషన్ విడుదల కానుంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉదయం 10.30 గంటలకు నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. హైకోర్టులో బీసీ రిజర్వేషన్లపై విచారణ నేటికి వాయిదా పడినప్పటికీ, ఎన్నికల నోటిఫికేషన్ పక్రియ మాత్రం ఆటంకం లేకుండా ముందుకు సాగనుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు ఈరోజు విచారించింది. విచారణ సందర్భంగా సుదీర్ఘ వాదనలు జరిగినప్పటికీ, తదుపరి విచారణను నేటి మధ్యాహ్నం 2.15 గంటలకు వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. దీంతోమరిన్ని మిగతా2లో...

## గ్రూప్-1 అభ్యర్థులకు

# అండగా ఉంటాం

### ఏ ఒక్కరికీ అన్యాయం జరగరాదు

### 2లక్షల ఉద్యోగాల హామీని నెరవేర్చండి

### గన్‌పార్క్ వద్ద విద్యార్థులకు మద్దతుగా కవిత దీక్ష



హైదరాబాద్,అక్టోబర్8: గ్రూప్-1 అభ్యర్థులకు అండగా ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. గన్ పార్కు అమరవీరుల స్తూపం వద్ద గ్రూప్-1 అభ్యర్థులు మిగతా2లో...


2లో

## బాణాసంచా తయారీ కేంద్రంలో

# పేలుడు

### - మంటల్లో ఆరుగురు దుర్మరణం

### పలువురికి గాయాలు..ఆస్పత్రికి తరలింపు

### ఘటనపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

### తక్షణ సహాయక చర్యలకు ఆదేశం

## జాతీయ భద్రతలో

# రాజీపడ్డ కాంగ్రెస్

### ముంబై దాడులకు ఎందుకు ప్రతీకారం తీర్చుకోలేదు

### ప్రతీకారం తీర్చుకోకుండా అడ్డుకున్నదెవరు..?

### తమకు జాతీయ భద్రతే ముఖ్యమన్న ప్రధాని మోడీ



ముంబై, అక్టోబర్ 08:2008 ముంబై ఉగ్రవాద దాడుల తర్వాత కాంగ్రెస్ పార్టీ తన 'బలహీనత'ను ప్రదర్శించిందని ప్రధాని మోడీ ఆరోపించారు. నవీ ముంబై అంతర్జాతీయ విమానా శ్రయం మొదటి దశను ఈ రోజు ప్రధాని నరేంద్రమోడీ బుధవారం ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ హయాంలోని యూపీఏ పాలనపై విమర్శలు గుప్పించారు. అప్పటి రాజకీయ నిర్ణయాలు మరో దేశం నుంచి వచ్చిన ఒత్తిడి ద్వారా ప్రభావితమయ్యాయని ఆరోపించారు. ముంబై దేశంలోని అత్యంత శక్తివంతమైన నగరాల్లో ఒకటి అని, అందుకే ఉగ్రవాదులు 26/11 దాడులకు తెగబడ్డారని అన్నారు.ఇటీవల, కాంగ్రెస్ మాజీ హోం మంత్రి పి. చిదంబరం ముంబై ఉగ్రదాడుల గురించి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల ఒత్తిడి వల్ల తాము పాకిస్తాన్‌పై దాడి చేయలేదని చెప్పారు. ముంబై దాడు ల తర్వాత మన భద్రతా దళాలు పాకిస్తాన్‌పై దాడి చేయడానికి సిద్ధమయ్యాయయని, కానీ వేరే దేశం ఒత్తిడి కారణంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా2లో...

## రెండు దగ్గు

# మందులపై నిషేధం

### ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం


2లో

## ఆర్టీసిని విధ్వంసం చేసిన

# వారి మొసలి కన్నీరు

2లో

## పిసిసి చీఫ్ నివాసంలో

# ఇరు మంత్రుల భేటీ

### - అడ్లూరికి క్షమాపణలు చెప్పిన మంత్రి పొన్నం

### - కలిసి పనిచేయాలని ఇద్దరికీ మహేశ్ గౌడ్ సూచన




హైదరాబాద్,అక్టోబర్8: తెలంగాణ కాంగ్రెస్‌లో ఇటీవల ఏర్పడిన అంతర్గత విభేదాలు సర్దుబాటు అయ్యాయి. తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మధ్య చెలరేగిన వివాదానికి తెరపడింది. టీపీసీసీ మాజీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చొరవ తీసుకుని ఇరు నేతలకు సర్దిచెప్పడం తో సమస్య పరిష్కారమైంది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ మిగతా2లో...


2లో

## 12న పల్స్ పోలియో

# స్పెషల్ డ్రైవ్

## 16న ప్రధాని మోడీ

# శ్రీశైలం పర్యటన


2లో

### మంత్రులు,అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష

### ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశం


2లో

## జూబ్లీహిల్స్ ఎన్నికలో

# కలసికట్టుగా కృషి

### - పార్టీ నేతలకు కెటిఆర్ దిశానిర్దేశం

# బీసీ రిజర్వేషన్లపై ఎడతెగని ఉత్కంఠ..

(మొదటి పేజీ తరువాయి)

రేపటికి వాయిదా వేయాలని ఏజీ కోరింది. ఇదిలా ఉండగా, నామినేషన్లు వేయకుండా స్టే ఇవ్వాలని పిటిషనర్లు కోరారు. అయితే స్టే ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది.ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం.. జీవో 9ని జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ జీవోను సవాల్ చేస్తూ సముద్రాల రమేశ్, బుట్టెంబారి మాధవరెడ్డి.. పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు జీవోను సమర్థిస్తూ తమను ప్రతివాదులుగా చేర్చాలంటూ.. సోమ, మంగళవారాల్లో పలువురు ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంపీ ఆర్.కృష్ణయ్య, కాంగ్రెస్ నేతలు చరణ్‌కౌశిక్ యాదవ్, ఇందిరా శోభన్ తదితరులు మంగళవారం ఈ పిటిషన్‌లు దాఖలు చేశారు.ఇదిలా ఉండగా, బీసీ రిజర్వేషన్ బిల్లుపై హైకోర్టు విచారణలో ట్రిపుల్ టెస్ట్ అంశం కీలకంగా మారింది. ట్రిపుల్ టెస్ట్‌ను పాటించకుండా రిజర్వేషన్లపై చట్టం చేయలేరంటూ పిటిషనర్ తరపు లాయర్ వాదించారు. 50 శాతం రిజర్వేషన్ల పరిధి దాటడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాజ్యాంగ బద్ధంగా ఉన్న రిజర్వేషన్ల ప్రకారం.. 2021 డిసెంబర్‌లో ట్రిపుల్ టెస్ట్‌పై మార్గదర్శకాలు ఉన్నాయంటూ గుర్తు చేశారు. బీసీ జనగణన కోసం డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల మేరకు.. రిజర్వేషన్ల శాతం తేల్చాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఉన్నట్లు పిటిషనర్ తరపు లాయర్ గుర్తు చేశారు.అలాగే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై శాస్త్రీయ ఆధారాలు చూపలేదని, బీసీ కులగణన చేశారు కానీ బహిర్గతం చేయలేదన్నారు. బీసీ కులగణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్లు అంటున్నారని.. ఎస్సీ, ఎస్టీలకు మాత్రం 2011 జానాభా ఆధారం అంటున్నారని, ఎస్టీ, ఎస్టీల జనాభా పెరిగిందా? తగ్గిందా? ఆ లెక్కలు లేవని, ఎస్టీ, ఎస్టీల జనాభా తేలకుండా బీసీ రిజర్వేషన్ల పెంపు ఎలా అంటూ ప్రశ్నించారు. 2018లో 34 శాతం బీసీ రిజర్వేషన్లను ఇదే కోర్టు కొట్టివేసిందంటూ పిటిషనర్ తరపు లాయర్ ప్రస్తావించారు.

# స్థానిక ఎన్నికలకు నేడు నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

వాదనలు వినిపిస్తామని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. అయితే, రేపటి నోటిఫికేషన్ ఇవ్వకుండా చూడాలంటూ పిటిషనర్ తరపు న్యాయవాదులు చేసిన వాదనలను హైకోర్టు పరిగణలోకి తీసుకోలేదు. హైకోర్టులో బీసీ రిజర్వేషన్లపై విచారణ రేపటికి వాయిదా పడిన వెంటనే, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డితో రాష్ట్ర మంత్రులతోపాటు మరికొందరు ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ సహా ఇతర ముఖ్య నేతలు ఈ భేటీలో పాల్గొన్నారు. హైకోర్టులో జరిగిన సుదీర్ఘ వాదనల తీరుపై చర్చించి, రేపు హైకోర్టులో అనుసరించాల్సిన అంశాలపై అడ్వకేట్ జనరల్‌తో మంత్రులు మంతనాలు జరిపారు. నేడు విడుదల కానున్న నోటిఫికేషన్ తెలంగాణలోని 31 జిల్లాల్లోని 565 మండలాలకు సంబంధించిన స్థానిక సంస్థల ఎన్నికలకు వర్తిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,749 ఎంపీటీసీలు, 565 జడ్పీటీసీలు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల కమిషన్ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. రేపు ఆయా జిల్లాల్లోని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. మొదటి విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీకు ఎన్నికలు జరగనున్నాయి. ఫస్ట్ ఫేస్?లో 2,963 ఎంపీటీసీ స్థానాలకు, 292 జడ్పీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ రిలీజ్ కానుంది. ఇందుకు గాను అక్టోబర్ 9వ తేదీ నుంచి నామినేషన్లు దాఖలు చేయొచ్చు. వీటికి అక్టోబర్ 11వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. మొదటి విడత జరిగే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు అక్టోబర్ 23వ తేదీన పోలింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు నవంబర్ 11న జరగనుంది.

# బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు

**కోనసీమ,అక్టోబర్ 08:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రాయవరంలోని గణపతి గ్రాండ్ బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. మంటల్లో చిక్కుకుని ఆరుగురు సజీవ దహనమయ్యారు. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని అనపర్తి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన వారిని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. పేలుడు సంభవించడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. మంటల్లో చిక్కుకుని ఆరుగురు సజీవ దహనమయ్యారు. మృతుల్లో నలుగురు మహిళలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బాణసంచా పరిశ్రమ యజమాని సత్తిబాబు కూడా ఉన్నట్లు సమాచారం. సమాచరం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో 40 మంది కార్మికులు అందులో పనిచేస్తున్నారు. భారీ పేలుడు ధాటికి బాణసంచా తయారీ కేంద్రం షెడ్డు గోడ కూలింది. శిథిలాల కింద మరికొందరు ఉండొచ్చని సమాచారం. ఘటనాస్థలిని రామచంద్రపురం ఆర్డీవో అఖిల పరిశీలించారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్ స్పందించారు. వారం క్రితమే బాణసంచా తయారీ కేంద్రాన్ని స్థానిక పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పరిశీలించి అన్ని రక్షణ చర్యలు ఉన్నట్లు నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. అగ్నిప్రమాద నివారణ పరికరాలను గోదాము యజమానులు సక్రమంగా వినియోగించారా? లేదా? అనే విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుంటు న్నామ న్నారు. బాణసంచా పేలుడు ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దీనిపై అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రమాదంలో పలువురు చనిపోవడంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలు, ప్రస్తుత పరిస్థితి, సహాయకచర్యలు, వైద్యసాయంపై వివరాలను అధికారుల నుంచి ఆయన తెలుసుకున్నారు. ఘటనాస్థలికి వెళ్లి సహాయకచర్యల్లో పాల్గొనాలని చంద్రబాబు ఆదేశించారు.ఈ ఘటనపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ, అగ్నిమాపక శాఖ అధికారులతో ఆమె మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి తెలిపారు.

# రెండు దగ్గు మందులపై నిషేధం

- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

**/హైదరాబాద్, అక్టోబర్ 08:** రెండు దగ్గు మందులను నిషేధిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రీలైఫ్, రెస్పీఫ్రెష్-టీఆర్‌ను విక్రయించొద్దంటూ అందులో పేర్కొంది. ఈ రెండు దగ్గు మందుల్లోనూ కల్తీ జరిగినట్లు గుర్తించారు. వీటిని గుజరాత్‌కు చెందిన ఫార్మా కంపెనీల ఔషధాలుగా పేర్కొన్నారు. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో 'కోల్డ్‌రిఫ్' అనే దగ్గు మందు వాడడం వల్ల పలువురు చిన్నారులు మృత్యువాత పడ్డట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటికే 'కోల్డ్ రిఫ్'ను పూర్తిగా నిషేధిస్తున్నట్టు ఔషధ నియంత్రణ విభాగం డీసీఏ ప్రకటించింది. చిన్నారులలో తీవ్రమైన రోగాల్ని, మరణాలను కలిగిస్తున్న ప్రమాదకర దగ్గు మందులను రాష్ట్ర ప్రభుత్వం నిషేధిస్తూ చర్య తీసుకుంది. రీలైఫ్, రెస్పీఫ్రెష్-టీఆర్ అనే రెండు సిరప్‌లను విక్రయించరాదు అని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం పిల్లల భద్రతను ముఖ్యంగా పరిగణిం చి తీసుకోవడం విశేషం. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో కోల్డ్‌రిఫ్ సిరప్ కారణంగా 16 చిన్నారుల మరణాలు చోటు చేసుకున్న ఘటనల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. డాక్టర్ల పర్యవేక్షణ లేకుండా ఎడపెడా పిల్లలకు

# జాతీయ భద్రతలో రాజీపడ్డ కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

భద్రతా బలగాలను ఆపిందని చిదంబరం అన్నారు. దీనిపై ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ఏ దేశం ఒత్తిడి తెచ్చిందో వెల్లడించాలని కాంగ్రెస్‌ను డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం కారణంగా భారత్ తీవ్రంగా నష్టపోయిందని ప్రధాని అన్నారు. కాంగ్రెస్ బలహీనత ఉగ్రవాదుల్ని బలపరిచిందని, ప్రాణాలను త్యాగం చేయడం ద్వారా దేశం పదే పదే ఉగ్రవాదానికి మూల్యం చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. ఉగ్రదాడి అనంతరం సైనిక చర్యను అడ్డుకుంటూ ఆనాడు నిర్ణయం తీసుకున్నదెవరో చెప్పాలని కాంగ్రెస్‌ను నిలదీశారు. దేశంలో అత్యంత శక్తివంతమైన నగరాల్లో ముంబై ఒకటి కావడంతోనే ఉగ్రవాదులు దానిపై దాడి చేశారన్నారు. నాటి నిర్ణయం ఎవరు తీసుకున్నారో కాంగ్రెస్ చెప్పాలని, దేశ ప్రజలకు ఈ విషయం తెలియాలని అన్నారు. కాంగ్రెస్ చూపించిన బలహీనతే ఉగ్రవాదులకు బలంగా మారిందన్నారు. జాతీయ భద్రత విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీపడిందని ఆక్షేపించారు. తమ ప్రభుత్వానికి దేశం, దేశ పౌరుల భద్రతే అత్యంత ముఖ్యమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఆపరేషన్ సిందూర్ పేరుతో మిలటరీ యాక్షన్ చేపట్టామని గుర్తు చేశారు. ఉగ్రవాదంపై తమ ప్రభుత్వం నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటుందనడానికి ఇదే ఉదాహరణ అని చెప్పారు.మన దేశ భద్రత, పౌరుల భద్రత కన్నా మరేది ముఖ్యం కాదని మోడీ అన్నారు. పహల్గామ్ దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ ప్రస్తావిస్తూ, నేటి భారతదేశం తన శత్రువులను వారి ఇళ్లలోకే వెళ్లి హతమారుస్తోందని ప్రధాని అన్నారు. నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ 'వికసిత్ భారత్'ను ప్రతిబింబించే ప్రాజెక్ట్ అని ప్రధాని అన్నారు. కొత్త విమానాశ్రయం ద్వారా మహారాష్ట్రలోని రైతుల ఉత్పత్తులు మిడిల్ ఈస్ట్, యూరప్ మార్కెట్లతో అనుసంధానించబడుతాయని చెప్పారు.

# గ్రూప్-1 అభ్యర్థులకు అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టిన ఆందోళనలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రిలిమ్స్ పరీక్షల నుంచే అవకతవకలు జరుగుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పేరు కోసం బోగస్ ఉద్యోగాలు ఇవ్వొద్దని చెప్పారు. అభ్యర్థులు ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం కష్టపడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగుల పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ అశోక్ నగర్‌కు వచ్చి ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. పారదర్శకంగా పరీక్షలు పెట్టండి. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక పాత ఉద్యోగాలే ఇచ్చారు. ఇవి తప్పుడు పరీక్షలు. కాంగ్రెస్ కోసం వారిని ఎంపిక చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడాలి. మిమ్మల్ని విద్యార్థులు నమ్మారు.. వారి పక్షాన నిలబడండి. మూల్యాంకనం సరిగా జరగాలి. కోర్టుల్లో జడ్జీలకు అర్థం అయ్యేదాకా పోరాటం చేస్తాం. గ్రూప్-1 నియామకాలను రద్దు చేసి.. మళ్లీ పరీక్ష నిర్వహించాలని కవిత డిమాండ్ చేశారు. గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత బుధవారం నిరసనకు దిగారు. నిరుద్యోగులకు మద్దతుగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. విద్యార్థుల గోస కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో కొంత మందికి ఉద్యోగాలు ఇవ్వడానికి గ్రూప్ 1 పెట్టారా అని ప్రశ్నించారు. తెలిసో తెలియకనో గత పదేళ్లలో గ్రూప్ 1 పెట్టలేదన్నారు. నిరుద్యోగులతో అధికారంలోకి వచ్చి వాళ్ళనే రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పరీక్ష రాసిన విద్యార్థులు.. ఉద్యోగాలు వచ్చిన విద్యార్థులు రాసిన పేపర్లు బయట పెట్టమని అడుగుతున్నారన్నారు. 50 వేల పాత ఉద్యోగాలు ఇచ్చి తాము ఇచ్చినం అని అంటున్నారని విమర్శించారు. ప్రొఫెసర్ హరగోపాల్‌ను స్వయంగా కలుస్తామని.... వ్యవస్థ ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులలో నిరుద్యోగులను మోసం చేస్తే కుర్చీలో నుంచి తీసి బయట పడేస్తారని హెచ్చరించారు. ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ మీటింగ్ ఉందన్నారు. ప్రజా ఆగ్రహానికి గురికావొద్దని ప్రభుత్వానికి సూచించారు. ఉద్యోగాలు వచ్చిన వారిపై తమకు కోపం లేదని.. అక్రమంగా తెచ్చుకున్న వారిపైనే కోపమని కవిత స్పష్టం చేశారు.

# పిసిసి చీఫ్ నివాసంలో ఇరు మంత్రుల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వ్యక్తిగతంగా క్షమాపణలు చెబుతున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నివాసం లో ఈ మంత్రులిద్దరూ భేటీ అయ్యారు. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ నివాసంలో ఇరువురు మంత్రుల మధ్య సయోధ్య కుదిరింది. బుధవారం ఉదయం పీసీసీ చీఫ్ నివాసంలో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో అడ్లూరికి పొన్నం క్షమాపణలు చెప్పారు. దీంతో ఇరువురి మధ్య వివాదం ముగిసింది. దీనిపై పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ చేశారన్న వ్యాఖ్యల పట్ల మరో మంత్రి లక్ష్మణ్ నొచ్చుకోవడంతో యావత్ సమాజం కొంత బాధపడిందన్నారు. మంత్రుల మధ్య జరిగిన సంఘటన కుటుంబ సమస్యగా వెల్లడించారు. జరిగిన సంఘటన పట్ల చింతిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పారన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కష్టపడి పైకొచ్చిన నేతలని తెలిపారు. ఈ సమస్య ఇంతటితో సమసిపోవాలని యావత్ మాదిగ సామాజిక వర్గానికి పీసీసీ చీఫ్ విజ్ఞప్తి చేశారు. ఎక్కడ మాట్లాడినా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సహచర మంత్రివర్గానికి కూడా విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల పార్టీ అని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఆశయాన్ని ఆకాంక్షలను కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళు ఒందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహాయంతో కుల సర్వే పారదర్శకంగా నిర్వహించామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మూడు చట్టాలు తీసుకొచ్చామని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. పొన్నం క్షమాపణ కోరడంతో ఈ సమస్య ఇంతటితో సమసిపోయిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. పొన్నం ప్రభాకర్‌ను గౌరవిస్తా.. కానీ ఆయన వాఖ్యల పట్ల మాదిగ జాతి బాధపడింద న్నారు. అట్టడుగు సామాజిక వర్గాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని తెలిపారు.

# 16న ప్రధాని మోడీ శ్రీశైలం పర్యటన

- మంత్రులు,అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష
- ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశం

**/అమరావతి, అక్టోబర్ 08:** ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని మంత్రులకు సిఎం చంద్రబాబు సూచించారు. విశాఖను మించిన స్థాయిలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ నెల 16న ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. మంత్రులు నారా లోకేశ్, బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేష్, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పాల్గొన్నారు. కర్నూలు పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ.. శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామి దర్శనం చేసుకోనున్నారు. అనంతరం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరులో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతారు. జీఎస్టీ సంస్కరణల ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని పాల్గొననున్న ఈ సభను విజయవంతం చేయాలని సీఎం దిశానిర్దేశర చేశారు. ప్రధాని పర్యటన సందర్భంగా వాతావరణ పరిస్థితులను చూసుకుని.. అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

# 12న పల్స్ పోలియో స్పెషల్ డ్రైవ్

**/హైదరాబాద్, అక్టోబర్ 08:** 12న రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో పల్స్ పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు. మన రాష్ట్రంలో పోలియో చివరి కేసు 2007లో నమోదు అయింది. మన దేశంలో 2011లో చివరి కేసు నమోదు అయింది. గత 3 సంవత్సరాలుగా బంగ్లాదేశ్, పాకిస్తాన్ తదితర దేశాల్లో పోలియో కేసులు నమోదు అవుతున్నాయని కేంద్ర వైద్యారోగ్య శాఖ పేర్కొంది.ఈ నేపథ్యంలో.. ఆయా దేశాల నుంచి రాకపోకలు జరుగుతున్న దేశంలోని పలు జిల్లాల్లో పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కేంద్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా 290 జిల్లాలను ఎంపిక చేయగా, అందులో మన రాష్ట్రం నుంచి 5 జిల్లాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హన్మకొండ ఉన్నాయి. ఈ ఐదు జిల్లాలతోపాటు వరంగల్ జిల్లా పరిధిలోని పట్టణ ప్రాంతంలోనూ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది.ఈ 5 జిల్లాల పరిధిలో 0-5 సంవత్సరాల వయసు పిల్లలు 17,56,789 మంది ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. వీరందరికీ ఈ నెల 12న స్పెషల్ డ్రైవ్‌లో పోలియో వ్యాక్సిన్ వేయనున్నారు. అప్పుడే పుట్టిన శిశువుల దగ్గర్నుంచి, 5 సంవత్సరాల వయసున్న పిల్లలందరికీ వ్యాక్సిన్లు వేయించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికలో కలసికట్టుగా కృషి

### - పార్టీ నేతలకు కెటిఆర్ దిశానిర్దేశం

**/హైదరాబాద్, అక్టోబర్ 08:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థి మాగంటి సునీత విజయానికి కృషి చేయాలని భారత రాష్ట్ర సమితి నేతలకు కేటీఆర్, హరీశ్‌రావు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, దాన్ని సమర్థంగా ఉపయోగించుకోవాలన్నారు. ఈమేరకు బుధవారం సమావేశం నిర్వహించారు. మాగంటి సునీత, దివంగత మాగంటి గోపీనాథ్ సోదరుడు వజ్రనాథ్ తదితర పార్టీ నేతలు హాజరయ్యారు. ఎన్నికల బాధ్యతలు అప్పగించిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌ఛార్జిలు సమన్వయంతో పనిచేయాలి. ఎవరికి వారు తమకు అప్పగించిన డివిజన్లలో పూర్తిస్థాయిలో బాధ్యతలు నిర్వర్తించాలి. బాకీ కార్డుల ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాదయాత్రలు నిర్వహించాలి. బూత్ కమిటీలు నిరంతరం ఓటర్లతో సంప్రదింపులు జరపాలి. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి గెలిస్తేనే రాష్ట్ర ప్రభుత్వానికి చెక్ పడుతుందని పేర్కొన్నారు. ప్రచారం

# ఆర్టీసిని విధ్వంసం చేసిన వారి మొసలి కన్నీరు

### ఛలో బస్ భవన్ పేరుతో రాజకీయ కుట్రలు

### బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి పొన్నం

**/హైదరాబాద్, అక్టోబర్ 08:**

బీఆర్ఎస్ పార్టీ చేపట్టబోతున్న ఛలో బస్ భవన్ కార్యక్రమంపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఛలో బస్ భవన్ చేపట్టేవారు ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. ఛలో బస్ భవన్‌తో అనవసరమైన రాజకీయ కుట్రకు తెరలేపుతున్నారని ఆరోపించారు. ఆర్టీసీ కార్మికులపై కేసులు పెట్టిన వాళ్లు ఈ రోజు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. గతంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే మాజీ సీఎం కేసీఆర్ కనీసం పట్టించుకోలేదని గుర్తు చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం గాంధీ భవన్‌లో మాట్లాడారు.. ఆర్టీసీపై బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఆర్టీసీలో అనేక సంస్కరణలు తీసుకువచ్చామని తెలిపారు. ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సంరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ బకాయిలను తాము కడుతున్నామని చెప్పుకొచ్చారు.కేసీఆర్ ప్రభుత్వం గుడిని, గుడి లింగాన్ని మింగినట్టు ఆర్టీసీని పూర్తిగా ధ్వంసం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఛార్జీలు పెంచలేదని స్పష్టం చేశారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం కొంత ఛార్జీలు పెంచామని పేర్కొన్నారు. ఆర్టీసీకి లాభాలు వచ్చే విధంగా కార్యాచరణ తీసుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం సిటీ బస్సుల్లో

# కార్పొరేటర్ జగన్ దృష్టికి ఆర్జీకే సమస్యలు



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 8(చర్చ): జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్ప సముదాయంలో నెలకొన్న సమస్యలను నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం అధ్యక్షులు అంజయ్య ధర్మారావు, ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి కాలనీ నాయకులతో కలిసి బుధవారం స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చాలకాలంగా కాలనీలో ప్రధానంగా నెలకొన్న నీటి సమస్య, డ్రైనేజీ, విద్యుత్, పార్కుల అభివృద్ధి మరియు మౌలిక సదుపాయాల గురించి జగన్ కి వివరించారు. ఈ భేటీలో కాలనీ అభివృద్ధికి సంబంధించిన పలు సలహాలు- సూచనలు, భవిష్యత్ కార్యచరణ,ప్రణాళికలపై చర్చించారు. ఈ సందర్భంగా జగన్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కార దిశగా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం సభ్యులు కాలనీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న తీరును చూసి కార్పొరేటర్ జగన్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి పట్ల కార్పొరేటర్ చూపిస్తున్న ఆసక్తి, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్న తీరుకు గాను కాలనీ సభ్యులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరశురాం, ఏడుకొండలు, బాన్సాడ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నృత్య శిక్షకురాలికి మొక్కను అందజేసిన నైనిక రజువా





చర్చ, భద్రాద్రి కొత్తగూడెం: శాస్త్రీయ నృత్య శిక్షకురాలు పర్వీన్ చంద్రకు ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా మొక్కను అందచేశారు. కొత్తగూడెం పట్టణ పరిధిలోని పాత కొత్తగూడెంలోగల శ్రీ భారతి నాట్యాలయంలో బుధవారం నటరాజ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్య శిక్షకురాలు పర్వీన్ చంద్రను కలిసిన చిన్నారి నైనిక రజువా, తైవాన్ జామ మొక్కను అందచేశారు. ఈ సందర్భంగా నైనిక రజువాను అభినందిస్తూ శిక్షకురాలు పర్వీన్ చంద్ర మాట్లాడారు. ప్రకృతి ప్రేమికురాలు నైనిక రజువా స్ఫూర్తిగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. శాస్త్రీయ నృత్యం ద్వారా మన సాంప్రదాయాన్ని కాపాడుకున్న విధంగా మొక్కలను కాపాడుకోవాలని కోరారు. అదేవిధంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు.

# అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్





చర్చ, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారుల హాజరు, పోషకాహార పంపిణీ, ఆరోగ్య పర్యవేక్షణ, విద్యా కార్యక్రమాల అమలు విధానాలను కలెక్టర్ సమీక్షించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి, పిల్లలకు సమయానికి ఆహారం, పాలు, గుడ్లు అందజేయాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులకు అందించే పోషకాహార పథకాలు సక్రమంగా అమలవుతున్నాయా అనే విషయంపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ భవనం పరిశుభ్రత, పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు, నేర్చుకునే సామగ్రి వాడకం తదితర అంశాలపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం బాలల సమగ్రాభివృద్ధికి కేంద్రబిందువుగా మారాలని, పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో అంగన్‌వాడీ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం!



చర్చ, సత్తుపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా సత్తుపల్లిమండలంలో పని చేయుచున్న ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు తేది 08.10.2025 బుధవారం ఉదయం 10గంటలకు యం.పి.టి.సి ./జెడ్.పి.టి.సి,2025 ఎన్నికల ట్రైనింగ్ కార్యక్రమము నిర్వహించడమైనది. ఈ శిక్షణ కార్యక్రమం లో 260 పి.ఓ లు మొదటి విడత శిక్షణ కార్యక్రమములో పాల్గొన్నారు ఈ శిక్షణ కార్యక్రమములో ఎంపీడీవో ,తాహసిల్దారు, ఎంపీ ఓ, పంచాయతీ సెక్రటరీలు మరియు డిఓటి మధుసూదన్ రావు పాల్గొన్నారు.



# నల్లగొండ పరిధిలోని మైనర్ బాలికపై జరిగిన అత్యాచారంతో నిందితులను అరెస్టు చేసిన 2 టౌన్ పోలీస్

- కె. శివరాం రెడ్డి, డి.ఎస్.పి, నల్లగొండ .

చర్చ ప్రతినిధి నల్లగొండ జిల్లా: నిందితుల వివరాలు: -1 గద్దం కృష్ణ తండ్రి శంకరయ్య, వయస్సు: 21 సం'లు, వృత్తి: ట్రాక్టర్ డ్రైవరు, నివాసం: అన్నారం గ్రామం, నల్లగొండ మండలం.-2 బచ్చలకూరి మధు తండ్రి లేట్ యాదయ్య , వయస్సు 19 సం'లు, వృత్తి: ఆటో డ్రైవరు, నివాసం: రసూల్ పురం గ్రామం, నల్లగొండ మండలం నేరస్తుల నుండి స్వాధీన పర్చుకున్న వస్తువుల వివరాలు 01. ఒక ఆటో (నెంబర్: -05-ఖఖ-4674)- 02. ఒక పల్సర్ మోటార్ సైకిల్ (నెంబర్: టీూ 05-ఖీచీ-2280)- 03. రెండు సెల్ ఫోన్లుకేసు వివరములు : నల్లగొండ పట్టణముకు సమీపములోని ఒక గ్రామానికి చెందిన మైనర్ బాలికను నేరస్తుడు -1: గద్దం కృష్ణ, గత 3 నెలల క్రితం మైనర్ బాలిక యొక్క గ్రామములో ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేయుటకు వెళ్ళి ఆమెతో పరిచయము పెంచుకొని మాయమాటలు చెప్పి, ప్రేమ పేరుతో దగ్గరై, ఇన్స్టాగ్రామ్ ద్వార చాట్ చేసేవాడు. తేది 07.10.2025 ఉదయం 8 గంటల సమయములో మైనర్ బాలిక తన గ్రామం నుండి కాలేజీకి అదే ఊరికి చెందిన రెగ్యులర్ గా వెళ్ళే ఆటో లో బయలుదేరి నల్లగొండ కు రాగా మైనర్ బాలికను టీూ-1 ఆఫీసు సమీపములో టీూ-1 గద్దం కృష్ణ బైక్ పై వచ్చి, తన బైక్ పై ఎక్కించుకొని వెళ్ళితే ఎవరైనా చూస్తారని తన స్నేహితుడైన -2 బచ్చలకూరి మధు సహకారముతో అమ్మాయి ని -2 మధు యొక్క ఆటో లో ఎక్కించి పంపు నగర్, రోడ్ నెంబర్-8 లో గల టీూ-2 కిరాయికి తీసుకున్న రూమ్ దగ్గరకు తీసుకొని వెళ్ళి టీూ-2 ను పంపించి, తాను బలహీనముగా ఉన్న మైనర్ బాలికను బలవంతముగా, శారీరకముగా కలిసినాడు. ఆ సమయములో బాలికకు తీవ్ర రక్త స్రావము అయి ఒక్కసారిగా అపస్మారక స్థితిలోకి వెళ్ళి చనిపోయినది. అది చూసి వెంటనే టీూ-1 రూమ్ కు తాళం వేసి పారిపోయి తనకు తెలిసిన వ్యక్తి కి సమాచారం ఇవ్వగా, అతను పోలీసులకు తెలియపరిచినాడు. తరువాత నిన్న సాయంత్రం నేరస్థుడు (టీూ-1) పోలీసు స్టేషన్ లో తాను చేసిన నేరం ఒప్పుకొని లొంగిపోయినాడు. తరువాత టీూ-2 ను కూడ అదుపులోకి తీసుకొని పూర్తి విచారణ చేసి వారి వాహనములు, సెల్ ఫోన్ లు స్వాధీన పర్చుకోనైనది. ఇట్టి కేసులో శవపరీక్ష ను టీమ్ ఆఫ్ డాక్టర్ లచే చేయించనైనది. సాంకేతిక పరిజ్ఞానం మరియు డాక్టర్ ల ఒపీనియన్ మేరకు పై ఇద్దరు నేరస్తులు టీూ-1 మరియు టీూ-2 లను అరెస్ట చేసి రిమాండ్ నిమిత్తము కోర్ట్ కు హాజరు పర్చనైనది. ఇట్టి కేసును త్వరితగతిన పరిశోధన పూర్తి చేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసి నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేయడం జరుగుతుంది.ఇట్టి కేసును నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి గారి పర్యవేక్షణలో వేగవంతముగా దర్యాప్తు చేసిన సిఐ-2 టౌన్ ఎస్. రాఘవ రావు, సిఐ-1 టౌన్ ఏ. రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ 2 టౌన్ వై. సైదులు మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీ శరత్ చంద్ర పవర్ ఐపిఎస్ గారు అభినందించినారు.




# ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

చర్చ ప్రతినిధి నల్లగొండ జిల్లా

బుధవారం ఆమె నల్లగొండ జిల్లా, తిప్పర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రైతులనుద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో లాగే ఈ సంవత్సరం ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రైతులు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు .తిప్పర్తి ధాన్యం కొనుగోలు కేంద్రానికి గత సంవత్సరం 75000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్న చరిత్ర ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులు నాణ్యతతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తేవాలని, ధాన్యంలో తేమ ఎక్కువగా లేకుండా , 17% మించకుండా తీసుకురావాలని, చెత్త,చెదారం, తాలు వంటి వాటితో తీసుకురావద్దని, ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురా వాలని, ధాన్యం అమ్మిన రైతులకు 72 గంటల్లో చెల్లింపులు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 2 డ్రయ్యర్లను ఏర్పాటు చేయగా, ఒకటి తిప్పర్తిలో మరొకటి మిర్యాలగూడలో ఏర్పాటు చేయడం జరిగిందని రైతులు అధికారుల సూచనలు, సలహాలు పాటించి మద్దతు ధర పొందేలా చూడాలని అన్నారు. డ్రయ్యర్ల పై రైతులకు అవగాహన కల్పించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆమె ఆదేశించారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ గడచిన వారం రోజుల నుండి జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వస్తున్నదని, దీనిని దృష్టిలో ఉంచుకొని బుధ,గురు వారం రెండు రోజుల్లో జిల్లాలో 100 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకున్నదని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన టార్పాలిన్లు, ధాన్యం తూర్పారబట్టే యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు అన్నిటిని ముందుగానే పంపించడం జరిగిందని, ప్రభుత్వం గ్రేడ్ -ఏ ధాన్యానికి 2389 /- రూపాయలు, కామన్ వెరైటీకి 2369 /- రూపాయల మద్దతు ధరను ప్రకటించిందని, సన్నధాన్యానికి 500 రూపాయల బోనస్ కూడా ఇవ్వనుందని, ఈ సదుపాయాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. మద్దతు ధర పొందేందుకు రైతులు ప్రభుత్వం ప్రకటించిన 17 పారామీటర్లను పాటించాలని, తేమ 17% మించకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని తేదీలవారీ గా ఒక షెడ్యూల్ ను రూపొందించి రిజిస్టర్లు నిర్వహించాలని, రైతులందరూ సహకరిస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయవచ్చని ఆయన తెలిపారు. జిల్లా సహకార అధికారి పత్యా నాయక్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను తెలియజేశారు. కాగా గత సంవత్సరం ఖరీఫ్ లో జిల్లాలో మొత్తం 325 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఈ సంవత్సరం అంతే మొత్తంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతున్నది. గత ఖరీఫ్లో 2.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయగా, మిల్లర్లు సైతం ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అయితే ఈ సంవత్సరం పూర్తిగా 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఆర్డీఓ వై .అశోక్ రెడ్డి ,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం, మార్కెటింగ్ ఏడి ఛాయాదేవి, తదితరులు ఉన్నారు






# పత్తి కొనుగోలులో రైతులు ఇబ్బందులు పడకుండా "కపాస్ కిసాన్ యాప్" పై అవగాహన

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

చర్చ ప్రతినిధి నల్లగొండ జిల్లా...పత్తి కొనుగోలుకై కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొత్తగా ఏర్పాటు చేసిన "కపాస్ కిసాన్ యాప్ పై రైతులకు అవగాహన కల్పించే నిమిత్తం బుధవారం నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులకు ఉదేశించి ఉదయాదిత్య భవన్ లో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత సంవత్సరం రైతులు పత్తి ని అమ్మేందుకు ఆన్ లైన్ లో తప్పు బుకింగ్ చేసుకోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఈ సంవత్సరం అలాంటి సమస్యలు రాకుండా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు.వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు "కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ లో రైతులకు సమస్యలు వస్తే సరైన విధంగా సూచించాలని, ఒకవేళ వారికి కూడా అవగాహన లేనట్లైతే తక్షణమే తోటి ఉద్యోగులు, లేదా పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరైన విధంగా స్లాట్ బుకింగ్ చేసుకునేలా చూడాలన్నారు. "కపాస్ కిసాన్ యాప్" ప్రకారం పత్తి రైతులు అందరు స్లాట్ బుక్ చేసుకోవాలని, అయితే కౌలు రైతులు మాత్రం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. రైతులందరూ ఒకేసారి జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకు రాకుండా నిర్దిష్ట షెడ్యూల్ ను రూపొందించాలని, ఇందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు సహకారం తీసుకో వాలన్నారు. అలాగే ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద హ్యాండ్ హెల్పింగ్ పర్సన్ ను ఏర్పాటు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పత్తి సేకరణకు, ఆన్లైన్ పత్తి సేకరణకు తేడాలు రాకుండా చూసుకోవాలని చెప్పారు. అన్ని విషయాలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసినట్లయితే రైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా పత్తి అమ్ముకునేందుకు అవకాశం ఉంటుందన్నారు . రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్,మద్దతు ధర,పత్తి నాణ్యత ప్రమాణాలు,తదితర వివరాలు తెలియజేసారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్ పత్తి కొనుగోలుకై కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన "కపాస్ కిసాన్ యాప్" గురించి వివరించారు. రైతులు నాణ్యత ప్రమాణాలతో కూడిన పత్తిని తీసుకురావాలని, జిల్లా వ్యవసాయ అధికారులు ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 71 శాతం పత్తి పంట బుకింగ్ పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. కాగా గత సంవత్సరం 2024- 25 లో 535766 ఎకరాలలో పత్తి జిల్లాలో పండించగా, 346359 మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చింది. ఇందులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 1,81,456 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు ద్వారా 12742 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేయడం జరిగింది. గత సంవత్సరం ప్రభుత్వం పత్తికి 7521/-రూపాయలు మద్దతు ధరను ప్రకటించింది. కాగా 2025 -26 సంవత్సరానికి గాను జిల్లాలో 5,68,778 ఎకరాలలో పత్తి పంట సాగు కాగా 572,395 మెట్రిక్ టన్నుల పత్తి మార్కెట్ కు రానుందని అంచన వేయడం జరిగింది. ప్రభుత్వం ఈ సంవత్సరం పత్తికి క్వింటాలుకు 8100 /- రూపాయల మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది. ఈ సంవత్సరం పత్తిని కొనుగోలు చేసేందుకు నల్గొండ జిల్లాలో 24 జిన్నింగ్ మిల్లులను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గుర్తించింది. 8 నుండి 12 శాతం తేమ మించకుండా రైతులు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలి. ముందుగా వ్యవసాయ శాఖ పత్తి పంటలను నమోదు చేస్తుంది. అనంతరం "కపాస్ కిసాన్ యాప్" ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. పత్తిని అమ్మిన మొత్తాన్ని పొందేందుకు రైతులు బ్యాంకు ,ఆధార్ కార్డుల జిరాక్స్ పత్రాలను, వివరాలను ఇవ్వాల్సి ఉంటుంది .మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఛాయాదేవి, డీవీఓ శ్రవణ్ కుమార్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల వ్యవసాయ , మార్కెటింగ్ శాఖ , సిబ్బంది, తదితరులు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.





# వడ్డెర సమాజం బలోపేతం కోసం కృషి చేస్తాం!

- కుత్బుల్లాపూర్ వడ్డెర సంఘం అధ్యక్షుడిగా దండుగుల స్వామి
- సోషల్ మీడియా ఇన్ ఛార్జ్ గా పీట్ల శివకుమార్ నియామకం



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 8(చర్చ):** కుత్బుల్లాపూర్ వడ్డెర సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమాజ ఐక్యతను కాపాడుతూ, అభివృద్ధి కార్యక్రమాలకు మరింత వేగం తీసుకురావాలనే ఉద్దేశంతో సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దండుగుల స్వామిని కుత్బుల్లాపూర్ వడ్డెర సంఘం అధ్యక్షుడిగా, పీట్ల శివకుమార్‌ను సోషల్ మీడియా ఇన్ ఛార్జ్ గా నియమిస్తూ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు పీట్ల శ్రీధర్ అధికారికంగా ప్రకటించారు.ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన దండుగుల స్వామి మాట్లాడుతూ %–% "వడ్డెర సమాజానికి గౌరవం, ఆత్మగౌరవం తీసుకురావడం నా మొదటి కర్తవ్యంగా భావిస్తున్నానని, సమాజ అభివృద్ధి కోసం ప్రతి సభ్యుడి సహకారంతో కృషి చేస్తానన్నారు. ఈ బాధ్యతను నాకు నమ్మకంతో అప్పగించిన జాతీయ అధ్యక్షులు పీట్ల శ్రీధర్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.సోషల్ మీడియా ఇంచార్జ్‌గా నియమితులైన పీట్ల శివకుమార్ మాట్లాడుతూ ం "వడ్డెర సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తేవడమే కాకుండా, సోషల్ మీడియా ద్వారా సమాజ ఐక్యతను పెంపొందించడమే తన లక్ష్యమని, వడ్డెర యువతలో అవగాహన, చైతన్యం పెంపొందించే దిశగా ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతామని తెలిపారు.జాతీయ అధ్యక్షులు పీట్ల శ్రీధర్ మాట్లాడుతూ "వడ్డెర సమాజం రాష్ట్ర రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం పొందాలంటే యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కుత్బుల్లాపూర్ పరిధిలో దండుగుల స్వామి, పీట్ల శివకుమార్ లాంటి చురుకైన నాయకులు బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. వీరి నాయకత్వంలో వడ్డెర సమాజం మరింత బలోపేతం అవుతుంది" అని విశ్వాసం వ్యక్తం చేశారు. సమాజ అభివృద్ధి, సామాజిక న్యాయం, రాజకీయ భాగస్వామ్యం కోసం వడ్డెర సంఘం కృషి చేస్తున్న తరుణంలో ఈ నియామకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయన్నారు. కుత్బుల్లాపూర్ పరిధిలో వడ్డెర సమాజం ఒకే గొంతుతో ముందుకు సాగుతూ, తమ ఉనికిని రాష్ట్ర రాజకీయ పటంలో బలంగా ముద్రించాలనే సంకల్పంతో ముందుకు సాగుతోందన్నారు. వడ్డెర సంఘం నాయకులు, యువత సంఘం సభ్యులు దండుగుల స్వామి, పీట్ల శివకుమార్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.

# డి హెచ్ పి ఎస్ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయ్ పై జరిగిన దాడిని ఖండిస్తూ ప్లకార్డులతో నిరసన

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిహెచ్పిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్.



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** డిహెచ్పిఎస్ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష? (బి.ఆర్) గవాయ్ పై జరిగిన దాడికి నిరసనగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం, కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి తోలుత పూలమాలవేసి ఘన నివాళులు అర్పించి అనంతరం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేసిన సిపిఐ అనుబంధ సంఘం దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకత్వం. ఈ కార్యక్రమానికి డిహెచ్పిఎస్ జిల్లా నాయకులు బరిగెల భూపేష్ కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు,డిహెచ్పిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయ్ రాకేష్ కిషోర్ వేసిన పిల్ పై ప్రసంగిస్తూ మధ్యప్రదేశ్ లోని ఖజురహోలో నీ ఆలయాల విషయం భారత పురావస్తు శాఖ(ఆర్కియాలోజికల్ సర్వే ఆఫ్ ఇండియా) పరిధిలో ఉంటుందని మీరు సుప్రీంకోర్టు గుమ్మం తట్టే బదులు అక్కడికి వెళ్తే బాగుంటుందని సూచించారు, అందుకు ఆగ్రహించిన మతోన్మాది న్యాయవాది రాకేష్ కిషోర్ సనాతన ధర్మం జోలికి వస్తే ఈ దేశం సహించబోదని నినాదాలు చేస్తూ తన బూటు తో సీజేఐ పై దాడి చేయడానికి ప్రయత్నించగా మార్షల్స్ అడ్డుకోవడం జరిగిందన్నారు. భారతదేశ న్యాయ చరిత్రలో చీకటి అధ్యాయనమని పేర్కొన్నారు. దళిత జాతికి చెందిన జస్టిస్ గవాయ్ పై దాడి చేసిన సీనియర్ న్యాయవాది, మతోన్మాది రాకేష్ కిషోర్ పై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుండి తక్షణమే బహిష్కరించి నాన్బెయిలబుల్ కేసు పెట్టాలని ఈ సందరేగా డిమాండ్ చేశారు. ఇది కేవలం జస్టిస్ గవాయ్ పై జరిగిన దాడి మాత్రమే కాదని భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా భావించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావ ృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిహెచ్పిఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు చెన్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కరిషా రత్నకుమారి, రాష్ట్ర సమితి సభ్యురాలు మామిడి ధనలక్ష్మి, డి హెచ్ పి ఎస్ జిల్లా నాయకులు రవి కిరణ్, కొచ్చర్ల రాకేష్ కాంత్, టి. నర్సింగరావు ,జంగం ప్రసాదరావు, మంద నిర్మల, పి.భాగ్య, మద్దెల విజయలక్ష్మి, మెరుగు అనసూయ, దార్ల లక్ష్మి, అన్నెం లక్ష్మీనారాయణ,పి.రోజా, ఉస్మాన్ ఖాన్, పి.నర్సిరెడ్డి, బి. సత్తెమ్మ,కే. భారతి, ఎండి ఆశబి, ఎండి యాకుబ్ పాషా, ఎస్.కె అహ్మద్ పాషా బట్టు సన్నీ పాల్గొన్నారు.

# అక్రమ టపాసుల నిల్వ స్థావరాలపై టాస్క్ ఫోర్స్, పోలీసుల సంయుక్త దాడులు







**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు దీపావళి టపాసుల అక్రమ నిల్వలపై బుధవారం జిల్లా టాస్క్ ఫోర్స్, భద్రాచలం పోలీసులు సంయుక్తంగా దాడులను నిర్వహించారు. భద్రాచలం పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీ, ఇండస్ట్రీయల్ ఏరియా, గ్యాస్ గోడౌన్ ఏరియాలలో జనావాస ప్రాంతాలలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా టపాసులు నిల్వ ఉంచిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. సుమారుగా రూ. 10 లక్షల విలువ గల దీపావళి టపాసులను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా, నియమ నిబంధనలను పాటించకుండా దీపావళి టపాసులను అక్రమంగా నిల్వ ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాచలం సీఐ నాగరాజు హెచ్చరించారు. నివాస ప్రాంతాలలో ఉంచిన నిల్వల వలన గతంలో చాలా చోట్ల అగ్ని ప్రమాదాలు సంభవించి అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు. ప్రజాహితార్థం ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా టపాసులను అక్రమంగా నిల్వ ఉంచినట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కు గానీ, స్థానిక పోలీసులకు గానీ సమాచారం అందించాలని టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, సీఐ నాగరాజు కోరారు. ఈ దాడులలో టాస్క్ ఫోర్స్ సీఐ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# బి.కె.ఆర్ నూతన పెట్రోల్ బంక్ ప్రారంభం

- వ్యాపార పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్ష





**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** కొత్తగూడెం%–%ఖమ్మం ప్రధాన రహదారి వెంబడి కొమ్ముగూడెం ప్రాంతంలో జూలూరుపాడు మాజీ ఎంపీపీ లాలూ నాయక్ ఏర్పాటు చేసిన బి.కె.ఆర్ ఫిల్లింగ్ స్టేషన్ ను వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ బుధవారం ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో టిపిసిసి జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన, "వాహన దారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందజేసి మన్ననలు పొందుతూ అనతి కాలంలోనే వ్యాపార పురోభివృద్ధి సాధించాలి" అని ఆకాంక్షించారు.కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, కొత్తగూడెం సొసైటీ అధ్యక్షులు మండే వీర హనుమంతరావు, అర్జునరావు, రాజశేఖర్, మంగీలాల్, మధు, సతీష్, కిషన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# సిపిఐ శత జయంతి ఉత్సవాల ముగింపు ఘనంగా నిర్వహించాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్




**చర్చ,వైరా:-** డిసెంబర్ 26న జరగబోయే భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ముగింపు ఉత్సవాలను ఖమ్మంలో ఘనంగా నిర్వహిస్తున్నామని ఈ ఉత్సవాలలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు తో పాటు సామాజిక వర్గాలు, పేద ప్రజలు మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం వైరా సిపిఐ కార్యాలయంలో యమాల గోపాలరావు అధ్యక్షతన జరిగిన వైరా నియోజకవర్గ స్థాయిలో జిల్లా కార్యవర్గ సభ్యులు కౌన్సిల్ సభ్యులు మండల కార్యదర్శులు సమావేశంలో ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి బండి సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ భారత దేశంలో 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఏకైక జాతీయ పార్టీ కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అని తెలిపారు.దేశవ్యాప్తంగా శత జయంతి ఉత్సవాలు ముగింపు సభ ఖమ్మంలో జరగటం మనందరికీ గర్వకారణం అని అన్నారు. అదేవిధంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అభ్యర్థులను అన్ని స్థానాలలో గెలిపించుకోవడానికి గ్రామాలలో ప్రణాళిక బద్ధంగా ఎన్నికలలో పాల్గొని విజయాలు సాధించాలని కోరారు. ఈ సమావేశంలో వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు జాగర్లమూడి రంజిత్, కొణిజర్ల జూలూరు మండల కార్యదర్శులు గుండె పిన్ని వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్ణ రమేష్, ఎస్కే నాగులు మీరా, సింగరేణి మండలం సీనియర్ నాయకులు భూక్యా దళ సింగ్ ,ఎల్లంకి మధు మిట్టపల్లి రాఘవరావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, నాసా రోశయ్య కంపసాటి వెంకన్న రేమల్ల నారాయణ కొండా రామకృష్ణ బాల రాంబాబు ముత్తయ్య బండారుపల్లి ముత్తయ్య మూటకొండ, గారపాట అశోక్, డేవిడ్ రాజ్ అరుసుమల్లి శివయ్యతదితరులు, పాల్గొన్నారు

# సింగరేణిలో స్వచ్ఛతహి సేవ కార్యక్రమం!







**చర్చ, సత్తుపల్లి:** బుధవారం రోజు స్వచ్ఛతహి సేవ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన 5.0 ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలెం రాజు ఆదేశానుసారం జేవిఆర్ ఓసి ప్రాజెక్టు ఆఫీసర్ ఎన్ వి ఆర్ ప్రహ్లాద్ జెవిఆర్ ఓసి ఉద్యోగస్తులతో కలసి నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన ఇంటితో పాటు పనిచేసే పని స్థలాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అంతేకాకుండా మైన్ లో కూడా రోడ్లు శుభ్రంగా ఉండేలా చూసుకోవలసిన బాధ్యత అందరి పైనా ఉన్నదని తెలిపారు. అప్పుడే మన ప్రభుత్వాలు తలపెట్టిన ఇటువంటి ఉన్నతమైన కార్యక్రమాలు విజయవంతం అవుతాయని అన్నారు. అనంతరం ఉద్యోగులతో కలసి పంప్స్ మరియు ఎలక్ట్రికల్ సెక్షన్ పరిసరాలను శుభ్రం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజనీర్ డి. శ్రీనివాసరావు, ఎస్.ఓఎం బి.రాజేశ్వర్ రావు, మేనేజర్ ఆపరేషన్స్ జి.కళ్యాణ్ రామ్, వెల్ఫేర్ ఆఫీసర్ కే.దేవదాస్, యూనియన్ ప్రతినిధులు జీ. నరసింహారావు ,నేలపాల రామారావు మరియు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ విధానానికి లోబడే పొత్తులు

- సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు




**చర్చ, మణుగూరు:** రాజకీయ విధానాలకి లోబడే స్థానిక సంస్థల ఎన్నికలలో పొత్తులు ఉంటాయని, బిజెపికి వ్యతిరేకంగా కలిసి వచ్చే ప్రజాతంత్ర లౌకిక పార్టీలతో స్థానిక ఎన్నికల అవగాహన కుదుర్చుకుంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య వెల్లడించారు. బుధవారం స్థానిక భవనంలో దామల్ల వెంకన్న అధ్యక్షతన జరిగిన మండల కమిటీ శాఖ కార్యదర్శిల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ కామ్రేడ్ కుంజ కృష్ణకుమారి ప్రజా ప్రతినిధిగా, నిస్వార్థంగా ప్రజలకు సేవలందించారని అన్నారు. ప్రజా సమస్యలపై తుది శ్వాస వరకు అలుపెరుగని పోరాటాలు నిర్వహించారని కొనియాడారు. మణుగూరు మండలంలో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలలో నిజమైన, స్వచ్ఛమైన ప్రజాపాలన అందించేందుకు సిపిఎం కలిసివచ్చే లౌకిక శక్తులను కలుపుకొని ముందుకెళుతుందని అన్నారు. ఎవరితో పొత్తు ఉన్నా లేకున్నా పార్టీ సంస్థాగతంగా బలంగా ఉన్న ప్రతిచోట అభ్యర్థులను నిలబెడుతుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో మతతత్వ పార్టీలకు చోటుఇవద్దని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, కొడిశాల రాములు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు మడి నరసింహారావు, పిట్టల నాగమణి, బొల్లం రాజు, తోట పద్మ,కుంజా రాజు, కుంజా నరసింహారావు, కుంజా శ్రావణ్ కుమార్, కోంద్రు గౌరీ, ములకల ఉత్తమ్, కారం భీమయ్య, ఎస్.కె ఖతిజా బేగం, సున్నం మల్లేష్, తాటి నరసింహారావు, దొడ్డి నిర్మల, ఆర్ శ్రీను, ఎం సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కండి

- టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె తినేని హరిచంద్ర




**చర్చ, సత్తుపల్లి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చెయ్యడానికి సన్నద్ధం కావాలని తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్ చంద్ర పిలుపునిచ్చారు. బుధవారం సత్తుపల్లి పట్టణంలోని డీడీపీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్ని జెడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పోటీకి సిద్ధం అని తెలియజేసారు. ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకి దూరం పాటించడం జరుగుతుందన్నారు. టీడీపీ తరపున పోటీకి ఉత్సాహం ఉన్నవాళ్లు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు కాకర్ల రంగారావు, జాస్తి శ్రీనివాస రావు, 5 మండలాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, సీనియర్ నాయకులు, సత్తుపల్లి పట్టణ పార్టీ అధ్యక్షులు వినుకొండ రమేష్, మహిళా నాయకురాలు పలగాని రమ్య, సీనియర్ నాయకుడు పోట్రూ వెంకట రామారావు, మల్లూరు మోహన్, తిమ్మిడి రాంబాబు, రాచర్ల చంద్రశేఖర్, మోహన్ రావు, కొంగల చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

# సీజేఐపై దాడికి సిపిఎం నిరసన




**చర్చ, సత్తుపల్లి:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని నిరసిస్తూ సిపిఎం సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గంగారం సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ గాంధీని చంపిన వారసులే మళ్లీ ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడి చేశారన్నారు. దేశంలో ఆర్ఎస్ఎస్ మతోన్మాదాన్ని రెచ్చగొడుతుందని, బిజెపి ప్రభుత్వ అండతో దాడులకి తెగబడుతుందని ఆరోపించారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఇలాంటి చర్యల్ని తీవ్రంగా ఖండించాలని కోరారు. దాడికి పాల్పడిన అతడిని వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బాల బుచ్చయ్య, మండల కమిటీ సభ్యులు అయినంపూడి సనందరావు, హసావత్ కృష్ణ, కొత్తపల్లి రఘు, కావూరి వెంకటేశ్వరరావు, పొలాసి భాగ్యమ్మ, దేవళ్ల రామారావు, బర్మావత్ అరుణ్ కుమార్, పొదిలి సత్యం, వెంకటలక్ష్మి, జయరాజు, నాగమణి, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈపీ ఆపరేటర్లకు ' ఏ ' గ్రేడ్ పదోన్నతులు కల్పించాలి



**చర్చ, సత్తుపల్లి:**కొత్తగూడెం రీజియన్ పరిధిలోని ఇల్లందు, కొత్తగూడెం, సత్తుపల్లి, మణుగూరు గనుల్లో చేస్తూ బి గ్రేడ్‌లో మూడు సంవత్సరాలు పూర్తి చేసిన అర్హత కలిగిన ఈపి ఆపరేటర్లకు ' ఏ ' గ్రేడ్ టెస్ట్ నిర్వహించాలని ఐఎన్‌టీయూసి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక సింగరేణి జే.వి.ఆర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ కార్యాలయంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహల్లాద్, ప్రాజెక్టు మేనేజర్ రాజేశ్వరరావులకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తున్నటువంటి వివిధ గ్రేడ్ లలో విధులు నిర్వహిస్తున్న ఈపీ ఆపరేటర్లకు టైం బాండ్ ప్రమోషన్ పాలసీ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గౌస్, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్స్ పోశం శ్రీనివాస్, కొమరయ్య, బ్రాంచ్ సెక్రటరీ క్రాంతికుమార్, జాయింట్ సెక్రటరీ నాగప్రకాష్, బ్రాంచ్ చీఫ్ ఆర్గనైజర్ సీతారామరాజు, అసిస్టెంట్ ఫీట్ సెక్రెటరీలు కోటేశ్వరరావు, సురేష్ నాయకులు సందీప్, శ్రీనివాస్,రాంబాబు, దాసరి శ్రీను, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల బరిలో సీపీఎం నిలుస్తుంది



**చర్చ, సత్తుపల్లి:**స్థానిక సంస్థల ఎన్నికలలో సీపీఎం బలపరిచిన అభ్యర్థులు పోటీ చేస్తారని ఆ పార్టీ మండల కమిటి సభ్యులు మల్లూరు చంద్రశేఖర్ స్పష్టం చేశారు. బుధవారం మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో జరిగిన గ్రామ శాఖ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకుల వైఫల్యాలను ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు జస్టిస్ట్ గవాయ్‌పై దాడి చేసిన మతోన్మాద న్యాయవాదిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఇది రాజ్యాంగంపై దాడిగా బావించి ప్రజలు నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శాఖా కార్యదర్శి డంకర శ్రీను, సాధు శరత్ బాబు, కావూరి భగత్ సింగ్, మల్లూరు వెంకటేశ్వరి, వంగూరి వెంకటేశ్వరరావు, బొందల యాకోబు పాల్గొన్నారు.

## దుర్గాదేవి ఆలయంలో మహా అన్నదానం



**చర్చ, సత్తుపల్లి:**పట్టణంలోని జే.వి.ఆర్ సి.హెచ్.పిలో డీ.జి.ఎం సోమశేఖర్ ఆధ్వర్యంలో దుర్గాదేవి దేవీ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రటరీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్, ఐఎన్టీయూసీ బృందం ప్రత్యేక పూజలు నిర్వహించి మహా అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్దలతో పూజలు చేయాలని కోరారు. అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ సింగరేణి ఉద్యోగులు, కుటుంబ సభ్యులపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, ఐఎన్టీయూసీ నాయకులు గౌస్, పోశం శ్రీనివాస్, క్రాంతి కుమార్ కొమురయ్య, నాగ ప్రకాష్ , సీతారామరాజు, పిట్ సెక్రటరీలు నాగేశ్వరరావు, రామారావు, బాలాజీ, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు కోటి, సురేష్ నాయకులు మురళి, రావుల చంద్రశేఖర్, శెట్టిపల్లి నవీన్, దొడ్డపల్లి రమేష్ , ఈర్ల నగేష్, బండి రామకృష్ణ , మురళి, రెడ్డి, బషీర్, చారి, మోహన్‌లాల కోరి, అజయ్, సందీప్, గుండె రమేష్, లక్ష్మణరావు, సుభాని ఇతర ముఖ్య నాయకులు, ఉద్యోగస్తులు పాల్గొన్నారు. ?

## రాఘవరావును గనంగా సత్కరించిన బీజేపీ నాయకులు



**చర్చ, సత్తుపల్లి:**భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సత్తుపల్లికి చెందిన నాయుడు రాఘవరావుని సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు బానోత్ విజయ్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచి స్వయంసేవక్‌గా పనిచేసి, ఒక రైతు కుటుంబం నుంచి వచ్చి, నీతినిజాయితీగా రాజకీయాల్లో తనదైన ముద్రని ఏర్పరుచుకున్న వ్యక్తి రాఘవరావు అని కొనియాడారు. సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల సమస్యలపై పూర్తి అవగాహనతో గత ప్రభుత్వాలపై తనదైన రాజకీయ చాతుర్యంతో పోరాటం చే చేశారన్నారు. ఉన్నత విద్యలను అభ్యసించి అధ్యాపకులుగా ఎంతో మందికి విలువైన విద్యను నేర్పించారన్నారు. రాజకీయాల్లో అంచలంచలుగా ఎదుగుతూ జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టిన నాయుడు రాఘవరావు నిష్పక్షపాతంగా అందరితో కలుపుగోలుగా ఉంటూ అజాతశత్రువుగా రాజకీయాల్లో కొనసాగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి, మంద శివ యాదవ్, కార్యదర్శి కార్తిక్ యాదవ్, బట్టి సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పాఠశాలల క్రీడలు















**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:**69వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణం ప్రకాశం స్టేడియంలో నిర్వహిస్తున్న క్రీడలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసంగిస్తూ గెలుపోటములు సహజమని, విజేతలైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి క్రీడాకారుడు క్రీడల ద్వారానే బంగారు భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని, క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఏ విధమైన సహాయానికైనా డివైఎస్ఓ ద్వారా తనను సంప్రదించాలని సూచించారు. మొదటి రోజు 17 సంవత్సరాల విభాగంలోని బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి, తరువాత ఉమ్మడి జిల్లా జట్టుతో కలిపి రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వాసిరెడ్డి నరేష్ కుమార్ తెలియజేశారు. ఈ పోటీలలో డీవైఎస్ఓ పరంధామ రెడ్డి, డీసీఈబీ సెక్రెటరీ నీరజ, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులైన ప్రేమ్ కుమార్, యనమదల వేణుగోపాల్, యుగంధర్, స్టెల్లా, కవిత, వీరన్న, కృష్ణ, పామర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన నిలబడే వారినే గెలిపించండి

**- సిపిఐ (ఎమ్ఎల్)మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి**

**- పలువురు అభ్యర్థుల ప్రకటన**





**చర్చ, సత్తుపల్లి:**ప్రజలతో అంటిపెట్టుకొని ఉండేవారినే స్థానిక ఎన్నికల్లో గెలిపించుకోవాలని సీపీఐ (ఎం.ఎల్) ప్రజా పంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర రావు పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు తాటి రాజు అధ్యక్షతన సత్తుపల్లి మండలం సత్యంపేటలో ఎన్నికల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గోకినేపల్లి మాట్లాడుతూ స్థానిక సంస్థలకు వచ్చే నిధులను దుర్వినియోగం చేయకుండా, అవినీతి లేకుండా వినియోగించినప్పుడే పల్లెలు కళకళలాడతాయని అన్నారు. నిస్వార్థంగా పనిచేసేవారినే ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని కోరారు. పెత్తందారులకు అవకాశం ఇవ్వొద్దన్నారు. ప్రజలకు స్థానిక పాలనలో భాగస్వాములను చేయడం బూర్జువా పాలకులకు ఇష్టం ఉండదన్నారు. ఈ సమావేశంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎ. వెంకన్న, జిల్లా నాయకులు గంటా శ్రీను, లాజరు, అమర్లపూడి శరత్, కొర్సా వెంకటేశ్వర రావు, ఒగ్గు నాగిరెడ్డి, దుంపా రాఘవులు, నాగ ప్రసాద్, తాటి దేవి తదితరులు పాల్గొన్నారు. పార్టీ బలపరిచే అభ్యర్థులు వీరే.సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ నుంచి సత్తుపల్లి జడ్పీటీసీగా తాటి దేవి, రుద్రాక్షపల్లి ఎంపీటీసీగా ఒగ్గు నాగి రెడ్డి, సర్పంచ్‌గా గంటా శ్రీను, కాకర్లపల్లి ఎంపీటీసీగా బొజ్జా విశ్వనాథం, సర్పంచగా నడికుదురు భాస్కరరావులను అభ్యర్థులుగా పోటీలో పెడుతున్నట్లు ఆ పార్టీ నాయకులు వెల్లడి చేశారు. మిగతా స్థానాల్లో అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

# కరీంనగర్, కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్‌లో








**చర్చ :- కరీంనగర్.** వినాయకనగర్ లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్: 105 వాహనాలు స్వాధీనంలికరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ఆదేశాల మేరకు కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్‌లో మరియు వినాయక నగర్ లో ఈరోజు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో పలు అంశాలపై తనిఖీలు కొనసాగినవన్నారు. పాత నేరస్థులు అద్దెకు ఇల్లు తీసుకుని నివసిస్తున్నారా అని ఆరాదీశారు. సరైన ధృవపత్రాలు లేని 105 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 77 బైకులు, 27 ఆటోలు, ఒక ట్రక్ ఉన్నాయి.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు స్థానిక ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.సైబర్ నేరాలపై అవగాహన:సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించి, సైబర్ నేరానికి గురైనట్లయితే వెంటనే స్పందించి, నేరం జరిగిన గంట లోపల 1930 నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా తస్కరించబడిన సొమ్మును ఫ్రీజ్ చేసి తిరిగి పొందవచ్చని తెలిపారు.మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై హెచ్చరిక:మాదక ద్రవ్యాలను దుర్వినియోగం చేయడం, వాటిని అక్రమంగా రవాణా చేయడం, అమ్మకం, వినియోగించడం చట్ట ప్రకారం నేరం అని పోలీసులు స్పష్టం చేశారు. అంతేకాకుండా, వాటి వలన కలిగే దుష్పరిణామాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు:చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని అడిషనల్ డీసీపీ హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వ్యక్తులపై సమాచారం అందించాలని ప్రజలను కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100 ద్వారా లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ , రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ , ఇన్స్పెక్టర్లు బిల్లా కోటేశ్వర్ , ప్రదీప్ , సంజీవ్ , సదన్ కుమార్ తో పాటు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పై మతోన్మాదుల దాడిని ఖండించండి

**- డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి తిరుపతి**





**చర్చ :- కరీంనగర్** హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై సుప్రీంకోర్టు హాలులో బరితెగించి దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించి న్యాయమూర్తికి రక్షణ కల్పించాలని తిరుపతి డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపల్లి మండలం శాంతినగర్ చౌరస్తా వద్ద కొత్తపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జిల్లా ఉపాధ్యక్షుడు లకు పతి నాయక్ అధ్వారంలో నిర్వహించారు ఇది ఒక వ్యక్తి పై జరిగిన దాడి కాదు అత్యున్నతమైనటువంటి భారత రాజ్యాంగం పైన జరిగిన దాడిగా పరిగణించాలి, దాడిని ఖండించాలని డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. మనువాద భావజాలం కలిగినటువంటి రాకేష్ కిషోర్ అనే న్యాయవాది కోర్టు ఆవరణలోనే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పైన దాడికి యత్నించడం సిగ్గుచేటు అని రాజ్యాంగ బద్ధంగా పరిపాలన చేయవలసినటువంటి ప్రజా ప్రభుత్వాలే ఇటువంటి మనువాదులకు అండగా ఉండటం కూడా ఇటువంటి చర్యలను ప్రోత్సహించినట్టు అవుతుంది అని అన్నారు. ద్వేషాలను విద్వేషాలను మనోభావాలను భావోద్వేగాలను రెచ్చగొడుతున్నటువంటి సంఘ పరివార్ భావజాలం వ్యాప్తి చెందడంతో ఈ దేశంలో ఇటువంటి చర్యలు క్రమంగా జరుగుతూ ఉన్నాయి. ఈ దేశాన్ని పరిపాలిస్తున్నటువంటి మనువాద వారసులు పూర్తిగా ఈ చర్యకు బాధ్యత వహించి ఈ పదవులకు రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు రాజకీయాలకు అతీతంగా రాజ్యాంగబద్ధమైనటువంటి వ్యవస్థ పై దాడి చేయడం అంటే భారత ప్రజాస్వామ్యం పైనే దాడి చేయడం అనేది ప్రతి ఒక్కరు గుర్తించాలి.. వామపక్షవాదులు ప్రజాస్వామ్యవాదులు మానవవాదులు హక్కుల కార్యకర్తలు పలు ప్రజా సంఘాలు ఈ నిరసన కార్యక్రమాలకు మద్దతు ఇచ్చి ఇటువంటి దాడులు మళ్లీ పునరావృతం కాకుండా గట్టిగా బుద్ధి చెప్పాలి అని ఆయన పిలుపు ఇచ్చారు.భారత ప్రధాన న్యాయమూర్తి పైన జరిగిన దాడిని ప్రతి ఒక్కరూ ఖండించినప్పుడే ప్రజాస్వామ్య మరియు న్యాయ వ్యవస్థకు పూర్తి రక్షణ కల్పించినట్టు అవుతుంది అప్పుడే న్యాయ వ్యవస్థను ప్రతి ఒక్కరు కూడా రక్షించుకోగలమని అన్నారు.జిల్లా నాయకుడు నగావత్ శ్రీనివాస్ నాయక్ నాయకులు అక్షయ భాస్కర్ శేఖర్ అక్షయ రెడ్డి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# నగర వ్యాప్తంగా పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా చేయాలని కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ అధికారులను ఆదేశం

చర్చ :- కరీంనగర్ కరీంనగర్ నగరపాలక సంస్థ పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజు కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ నగరంలోని 34 వ డివిజన్ గోదాంగడ్డలో పర్యటించారు. డివిజన్ లో పారిశుధ్య పనులను తనిఖీ చేసి పరిశీలించారు. అనంతరం డ్రైనేజీలను పరిశీలించి... డ్రైనేజీ కల్వర్ట్ నిర్మాణం, స్థానికంగా ఉన్న హనుమాన్ దేవాలయం పహారి గోడ నిర్మాణం పై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్బంగా కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ మాట్లాడుతూ... నగర వ్యాప్తంగా పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలన్నారు. జవాబలు, ఎఎస్సైలు ఎవరి డివిజన్లలో వారు పర్యటిస్తూ.... కార్మీకులతో పారిశుధ్య పనులను చేయించాలని ఎక్కడ పరిసర ప్రాంతాల్లో చెత్త కనబడకుండ చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఇంటికి స్వచ్ఛ్ ఆటోలు వెల్లేలా చూడాలని.... ప్రతి ఇంటి నుండి కార్మీకులు తడి పొడి వేరు వేరుగా చెత్తను సేకరించాలని ఆదేశించారు. పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చెత్త వేయకుండ



చూడాలని అన్నారు. ఎవరైన చెత్త వేస్తే వారికి జరిమానాలు వేయాలన్నారు. ప్రధానంగా గార్బేజ్ పాయింట్ల లో చెత్త పడకుండ జవానులు, ఎస్సైలు పర్యవేక్షణ చేయాలని అన్నారు. గోదాంగడ్డ హనుమాన్ దేవాలయం వద్ద గల గోడ శిథిలమైన నేపథ్యంలో దాన్ని నిర్మాణం చేసేందుకు చర్యలు తీసుకోవాలని



అన్నారు. డ్రైనేజీ కల్వర్ట్ ను కూడ నిర్మాణం చేయాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో ఎక్కడ లోటు పాట్లు జరగకుండా మెరుగ్గా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# సొసైటీ ఫర్ స్పీడ్ జస్టిస్ ఆధ్వర్యం లో సన్మానం.



చర్చ :- కరీంనగర్ స్థానిక జ్యోతి నగర్ లోని సీనియర్ న్యాయవాది కుసుంబ కృష్ణ రావు ఇంట్లో సొసైటీ ఫర్ స్పీడ్ జస్టిస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి లు కుసుంబ కృష్ణ రావు, తుమ్మెనపల్లి లక్ష్మణ్ రావు ఆధ్వర్యం లో ఇటీవల న్యాయ శాస్త్రం లో గోల్డ్ మెడల్ సాధించిన మనకొండూరు మండలము పచ్చునూరు గ్రామానికీ చెందిన కాసిరెడ్డి రోహన్ రెడ్డి కి, కరీంనగర్ కోర్టు లో లీగల్ రిపోర్టర్ గా జిల్లా అవోప వైస్ ప్రెసిడెంట్ గా, డిసిసి లీగల్ సెల్ మీడియా కన్వీనర్ గా పనిచేస్తున్న కొత్త ప్రకాశ్ కు, బార్ అసోసియేషన్ మాజీ ఈసి బెజ్జంకి శ్రీకాంత్ లకు శాలువ, బొకే లతో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అద్యక్షులు కుసుంబ కృష్ణ రావు మాట్లాడుతూ భవిష్యత్తు లో ఇంకా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తామని, అందుకు అందరి సహకారం, ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గంజి స్వరాజ్ బాబు, గడ్డం లక్ష్మణ్ , బార్ అసోసియేషన్ మాజీ అద్యక్షులు పీవీ రాజ్ కుమార్, పెంచాల ప్రభాకర్ రావు, ఎం సత్యనారాయణ, పెంచల లక్ష్మణ్ రావు,రాచకొండ ప్రభాకర్ , సిహెచ్ కిరణ్ కుమార్ , వేణు గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

# బుధవారం బోధన"కు ప్రాధాన్యత ఇవ్వాలి

**- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



చర్చ :- కరీంనగర్ ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం బోధన కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులకు కఠినమైన అంశాలు, పాఠాలు నేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. జడ్పీహెచ్ఎస్ లో "బుధవారం బోధన"లో భాగంగా పదవ తరగతి విద్యార్థులు నేర్చుకుంటున్న అంశాలను పరిశీలించారు. ఆంగ్ల పాఠం నేర్చుకుంటుండగా ప్రతి విద్యార్థితో ఆంగ్ల పాఠాన్ని చదివించారు. పాఠాలు చదవడంలో మెళకువలు నేర్పారు. అన్ని పాఠశాలల్లోని అన్ని తరగతుల్లో బుధవారం బోధన పకడ్బందీగా అమలు



చేయాలని విద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు కఠినమైన సబ్జెక్టులను నేర్చుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ముఖ్యంగా ఇంగ్లీష్ సమర్ధవంతంగా నేర్చుకోవడానికి చక్కటి వేదిక అని తెలిపారు. విద్యార్థులు కష్టతరమైన పాఠం పట్ల బుధవారం బోధనలో దృష్టి పెట్టాలని, శ్రద్ధ, అంకితభావంతో నేర్చుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలల్లోని తరగతి గదులు, వంటగది, విటమిన్ గార్డెన్ పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. భోజనం చేస్తున్న చిన్నారులతో మాట్లాడి భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.

**- అంగన్వాడీ కేంద్రం సందర్శన**

నగునూరు అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. అంగన్వాడీలో భోజనం చేస్తున్న చిన్నారులతో ముచ్చటించారు. పిల్లల హాజరు, నమోదు, గర్భిణీ, బాలింతల



సంఖ్య వంటి వివరాలు అంగన్వాడి టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు వడ్డించిన భోజనాన్ని పరిశీలించారు. అంగన్వాడి పిల్లల హాజరు పెంచాలని ఆదేశించారు.

**- పల్లె దవాఖాన సందర్శన**

నగునూర్ "పల్లె దవాఖాన"ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు, వైద్య పరీక్షల రిజిస్టర్ ను పరిశీలించారు. ఆరోగ్య మహిళ ఉచిత వైద్య సేవల పట్ల గ్రామస్తులందరికీ అవగాహన కల్పించి, నూరు శాతం మందికి ఆరోగ్య మహిళ పరీక్షలు చేయించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఆఫీసర్ సనా, తహసిల్దార్ రాజేష్, ఎంఈఓ రవీందర్ ఉన్నారు.

# సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కు సన్మానం



చర్చ,వైరా:- వైరా నియోజకవర్గ సర్వసభ్య సమావేశానికి బుధవారం స్థానిక పట్టణం నందు సిపిఐ కార్యాలయంలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా సిపిఐ పార్టీ కార్యదర్శి దండి సురేష్ ని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గారపాటి అశోక్ శాలువాతో సన్మానించినారు. ఈ కార్యక్రమంలో వైరా మండల సిపిఐ కార్యదర్శి యామాల గోపాలరావు మూటకొండ కొండా రామకృష్ణ చింతపల్లి గంగాధర్ బండారుపల్లి ముత్తయ్య ఆళ్ల రాంబాబు మొదలగు వారు పాల్గొని ఘనంగా సన్మానించినారు.

# 24 గంటల్లో 20 ఆపరేషన్లు



చర్చ :- కరీంనగర్. రాజన్న సిరిసిల్లవేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో శస్త్ర చికిత్సలువైద్యులకు సూపరింటెండెంట్ అభినందనవేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలోమరోసారి 24 గంటల్లో 20 వివిధ రకాల ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేశారు వైద్యులు. ఇందులో సాధారణ కాన్పులు 4, ఆపరేషన్ల ద్వారా 9, కంటి ఆపరేషన్లు 4, జనరల్ సర్జరీలు 2 , ఆర్థో ఆపరేషన్ ఒకటి ఉన్నాయి. ఆపరేషన్లు



చేసిన గైనకాలజిస్ట్ డాక్టర్లు సంధ్య, సోనీ, మాధవి ,పిల్లల వైద్యులు సుభాషిణి, చారి, రమణ, ఆర్థోపెడిక్ డాక్టర్ అనిల్,మత్తు వైద్యులు రాజశ్రీ, తిరుపతి, రవీందర్,కంటి వైద్యులు డాక్టర్ రత్నమాల, నర్సింగ్ ఆఫీసర్స్ ఝాన్సీ, జ్యోతి,అనసూయ, బ్లోసమ్ తో పాటు ఇందులో పాల్గొన్న ఇతర సిబ్బంది ని ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ పెంచలయ్య అభినందించారు. పేద ప్రజలకు రానున్న రోజుల్లో మరిన్ని సేవలు అంకిత భావంతో అందించాలని తెలియజేశారు.

# కాంగ్రెస్ పార్టీ నాకు సంస్కృతి నేర్పించింది: మంత్రి పొన్నం ప్రభాకర్!

**- ఆయన బాధ పడినందుకు నేను క్షమాపణ చెప్తున్నా!**

చర్చ:- కరీంనగర్ హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ సహచర మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్‌ను ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా దుమారం రేపిన విషయం పాఠకులకు తెలిసిందే. పొన్నం వ్యాఖ్యలపై దళిత సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. పొన్నం క్షమాపణలు చెప్పాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జరిగిన పొరపాటును ఒప్పుకొని క్షమాపణ చెబితే గౌరవం ఉంటుందని తెలిపారు. మాదిగలు అంటే అంత చిన్నచూపా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సహచర మంత్రిని ఆ మాట అంటే చూస్తూ ఉంటావా అంటూ ఆ సమయంలో అక్కడే ఉన్న మరో మంత్రి వివేక్ వెంకటస్వామిని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నిలదీశారు.అడ్లూరిపై పొన్నం వ్యాఖ్యలను దళిత సంఘాలు తీవ్రంగా ఖండిం చాయి. పొన్నం ప్రభాకర్ వెంటనే క్షమాపణ చెప్పాల ని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. లేదంటే పొన్నం ఇంటిని ముట్టడి స్తామని హెచ్చరించారు. ఈ క్రమంలో కరీంనగర్‌లో మంత్రి పొన్నం ఇంటి వద్ద పోలీసులు భద్రతను పెంచారు. ఆ ప్రాంతంలో బారికేడ్స్ ఏర్పాటు చేశారు.



వివాదం తీవ్రమవుతుండ టంతో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సయోధ్య కుదర్చేందుకు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో బుధవారం మహేష్ కుమార్ గౌడ్ నివాసంలో మంత్రులు పొన్నం పభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు భేటీ అయ్యారు. వీరితో సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కవ్వంపల్లి సత్యనారా యణ, శివసేన రెడ్డి, సంపత్ కుమార్, అనిల్, వినయ్ కుమార్ తదిత రులు పాల్గొన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ. చిరునామా కాంగ్రెస్ పార్టీలో పుట్టి పెరిగిన వ్యక్తిగా నేను, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు పార్టీ సంక్షేమం తప్ప ఎటువంటి దురుద్దేశం లేదు. నేను ఆ మాట అనక పోయినా పత్రికల్లో వచ్చిన దాని ప్రకారం ఆయన బాధపడిన దానికి నేను క్షమాపణలు కోరుతున్నా. నాకు అలాంటి ఆలోచన లేదు. నేను ఆ ఒరవడిలో పెరగలేదు, కాంగ్రెస్ పార్టీ నాకు ఆ సంస్కృతి నేర్పలేదని పొన్నం ప్రభాకర్ అన్నారు.కాంగ్రెస్ పార్టీ నేతలమంతా సామాజిక న్యాయం కోసం పనిచేస్తాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో రాహుల్ గాంధీ సూచన మేరకు 42శాతం రిజర్వేషన్లకు పోరాటం జరుగుతుందిమేమంతా ఐక్యంగా భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సామాజిక న్యాయం కోసం పనిచేస్తాం. నా సహచర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు వ్యక్తిగతంగా క్షమాపణలు చెబుతున్నా.. కరీంనగర్ లో మాదిగ సామాజిక వర్గం మేమంతా కలిసి పెరిగాం. నాపై అపోహఉండవద్దనివిజ్ఞప్తిచేస్తున్నాఅంటూపొన్నంప్రభాకర్ పేర్కొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటన

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నాకు సోదరులవంటివారు.**

చర్చ:- కరీంనగర్ కాంగ్రెస్ పార్టీలో మాకు 30 సంవత్సరాలుగా ఉన్న స్నేహబంధం రాజకీయాలకు మించినదే. మా ఇద్దరి మధ్య ఉన్న అనుబంధం, పరస్పర గౌరవం ఎప్పుడూ అలాగే కొనసాగింది. ఎవరు విడదీయరానిది.నేను ఆయనపై ఎటువంటి వ్యక్తిగత వ్యాఖ్యలు చేయలేదు. అట్టడుగు స్థాయి నుంచి వచ్చిన వ్యక్తిగా, బీసీ వర్గానికి చెందిన నాయకుడిగా, నాకు ఎవరిపైనా అలాంటి అభిప్రాయం ఉండదు. అయితే, రాజకీయ దురుద్దేశంతో కొంతమంది నా వ్యాఖ్యలను వక్రీకరించి, వాస్తవానికి భిన్నంగా ప్రచారం చేశారు. దాంతో ఏర్పడిన అపార్థాల వల్ల అన్నలాంటివారు అయిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారి మనసు నొచ్చుకుందని తెలిసి నాకు బాధ కలిగింది. నేను



రెండు రోజులు స్థానికంగా లేకపోవడం మూలంగా లక్ష్మణ్ కుమార్ గారికి ఫోన్ ద్వారా వాస్తవం తెలియచేయాలని ప్రయత్నించాను. కానీ, వారు అందుబాటులోకి రాలేదు.అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు మనసు నొచ్చుకొని ఉంటే నేను తీవ్రంగా విచారం వ్యక్తం చేస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ లో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చిన నా ఎదుగుదలను చూసి ఓర్వలేని వారు మంచి మిత్రులమైన మా మధ్య తగవు పెట్టి బిసి రిజర్వేషన్ల వ్యవహారాన్ని పక్క దారి పట్టించాలని ప్రయత్నించారు. కానీ, వారి ఎత్తుగడలు చిత్తు చేస్తూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేయడంలో, రాహుల్ గాంధీ గారి నాయకత్వంలో సామాజిక న్యాయం సాధనలో, ప్రజల అభ్యున్నతికై మేము ఇద్దరం కలిసికట్టుగా కృషి చేస్తామని తెలియ చేస్తున్నాను

# ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న రెవిన్యూ అధికారులు..!



చర్చ,వైరా:-వైరా మున్సిపాలిటీ పరిధిలోని 6 వార్డులో రేచర్ల వెంకటేశ్వర్లు తండ్రి(లేటు) లక్ష్మీనారాయణ అనే వ్యక్తి అక్రమంగా నిలవ ఉంచిన 3 క్వింటాల బియ్యాన్ని రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. అదేవిధంగా వైరాలో కూరగాయల మార్కెట్ రోడ్ లో టీవీఎస్ మీద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు పేదల కు అందవలసిన రేషన్ బియ్యాన్ని గత కొంతకాలంగా వీరు రేషన్ షాపులు వద్ద నేరుగా కొనుగోలు చేస్తూ అక్రమ బియ్యం వ్యాపారానికి పాల్పడుతున్నారని పలు ఆరోపిస్తున్నారు.

# మా ఓపికను పరీక్షించొద్దు హైకోర్టు హెచ్చరిక

హైదరాబాద్, అక్టోబర్ 08: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో విచా రణ వాయిదా పడింది. విచారణ ప్రారంభమైన కాసేపటికే వాయిదా వేస్తూ ధర్మాసనం ప్రకటించింది. తిరిగి ఇవాళ మధ్యా హ్నం 12.30 గంటలకు వాయిదా వేసింది హైకోర్టు. తొలుత విచారణ ప్రారంభమవగానే.. రిజర్వేషన్లపై ప్రస్తుత ఏంటని ప్రశ్నించింది హైకోర్టు. సుప్రీంకోర్టులో జరిగిన విచారణపైనా హైకోర్టు ధర్మాసనం ఆరా తీసింది. అన్ని పిటిషన్లను కలిపి ఒకేసారి విచారిస్తామని పేర్కొన్న ధర్మాసనం.. విచారణను మధ్యా హ్నానికి వాయిదా వేసింది. కాగా, బీసీ రిజర్వేషన్లపై 28 ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలయ్యాయి. అన్ని పిటిషన్లను కలిపి మధ్యాహ్నం హైకోర్టు విచారించనుంది. ప్రభుత్వం తరపున అభిషేక్ సింఘ్వీ కోర్టులో వాదనలు వినిపించనున్నారు.తెలంగాణ హైకోర్టు తీర్పుపై ఉత్కంఠ..కాగా, బీసీ రిజర్వేషన్లపై అంశంపై తెలంగాణ హైకోర్టు తీర్పు ఎలా ఉంటుందో అని తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ తీర్పు స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపనుంది. హైకోర్టు నిర్ణయంతో స్థానిక సంస్థల ఎన్నికల భవితవ్యం తేలనుంది. సుప్రీంకోర్టు గత తీర్పుల ప్రకారం.. రిజర్వేషన్లు 50 శాతం మించడానికి అవకాశం లేదు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం రిజర్వేషన్లు 67 శాతానికి పెరిగాయి. బీసీలకు 42 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించింది ప్రభుత్వం. హైకోర్టు ఒకవేళ ఈ జీవోను కొట్టివేస్తే స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ పడే అవకాశం ఉంది.పిటిషనర్లను ఉద్దేశించి తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇదే చివరి విచారణ కాదని.. అన్ని అంశాలనూ ప్రస్తావించొద్దని సూచించింది. తమ ఓపికను పరీక్షించకండంటూ పిటిషనర్లను ఉద్దేశించి సున్నితంగా హెచ్చరించింది. గంటలకొద్దీ ఒకే అంశం ప్రస్తావించి, తమ సమయాన్ని వృథా చేయొద్దని చెప్పింది.ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫు లాయర్ అభిషేక్ మను సింఘ్వీ తన వాదనలు వినిపించారు. బీసీ రిజర్వేషన్ల పై అన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించాయని చెప్పారు. జీఓ పై స్టే ఇవ్వాలని కోరడం సరైంది కాదని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం ప్రభుత్వానికి ఉందని చెప్పారు. పిటిషనర్ లాయర్లు ఇన్నిగంటలు వాదనలు వినిపిస్తే.. మాకు అవకాశం వస్తుందా.. అంటూ ప్రశ్నించారు. కులగణన లెక్కలు ఫోర్జరీ అనుకుంటున్నారా.. వాస్తవాలు తెలియకుండా పిటిషనర్లు ఎలా మాట్లాడుతారని అన్నారు.2018లో తెలంగాణ పంచాయితీరాజ్ చట్టం పాసైన సమయంలో ఈ కసరత్తు జరగలేదని, 2019లో 10% రిజర్వేషన్లు దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయని అభిషేక్ మను సింఘ్వీ గుర్తు చేశారు. ఫలితంగా మొత్తం రిజర్వేషన్లు 50% దాటి అదనంగా 10 %.. అంటే మొత్తం రిజర్వేషన్ల శాతం 60 శాతానికి

# నామినేషన్ల స్వీకరణకు పటిష్ట ఏర్పాట్లు

**- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రా ణి కుముదిని**
**- మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ సజావుగా జారీ చేయాలి**
**- స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఎన్నికల సంఘం కమిషనర్**
**- హాజరైన కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



చర్చ :- కరీంనగర్
స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు పటిష్ట ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని ఆదేశించారు.స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అన్ని జిల్లాల కలెక్టర్ లతో బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ నేడు (గురువారం ఈ నెల 9వ తేదీన) ఉదయం 10.30 గంటల వరకు విడుదల చేయాలని సూచించారు. నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు ఎంపీటీసీ జడ్పిటిసి పరిధిలోని ఓటరు జాబితా వివరాలను ప్రచురించాలని అన్నారు . ఈ నెల 9 నుంచి 11 వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించాలని అన్నారు.ఒపీటీసీ, జడ్పిటిసి స్థానాలకు సంబంధిత రిటర్నింగ్ అధికారులు వద్ద నామినేషన్ దాఖలు చేసేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద పూర్తి స్థాయి బందోబస్తు కల్పించాలని అన్నారు. నామినేషన్ల పరిశీలన నవంబర్ 12 న సాయంత్రం 5 గంటల వరకు పూర్తి చేసి చెల్లుబాటైనా నామినేటెడ్ అభ్యర్థుల జాబితాను ప్రకటించాలని అన్నారు.నామినేషన్ల స్వీకరణ, పరిశీలన,అప్పీళ్ళ పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటి చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా అవసరమైన మార్గదర్శకాల జిల్లా ఎన్నికల అధికారులు జారీ చేయాలని అన్నారు. జిల్లాలో మొదటి ఫేజ్ లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఏరాట్లుజిల్లా కలెక్టర్ పమేలా సత్పతిస్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు.జిల్లాలో మొదటి ఫేజ్ లో 6 జడ్పీటీసీలు, 70 ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ ఇస్తామని వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే ఆర్ఓ, ఏఆర్ఓలకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని, నోడల్ ఆఫీసర్లను నియమించామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జెడ్పీ సిఈఓ శ్రీనివాస్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.%ఱఅటశీ %కరీంనగర్ జిల్లా: మొత్తం జడ్పిటిసి స్థానాలు - 15 మొత్తం ఎంపీటీసీ స్థానాలు -170మొదటి దఫా ఎన్నికలు : హుజురాబాద్ రెవిన్యూ డివిజన్ పరిధిలోని ఆరు మండలాలు ( శంకరపట్నం, వీణవంక, ఇల్లందకుంట, జమ్మికుంట, హుజురాబాద్, వి-సైదాపూర్) మొదటి దఫాలో ఈ 6 మండలాల జడ్పిటిసి స్థానాలకు, ఈ ఆరు మండలాల పరిధిలోని 70 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి.ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు- తొలివిడతనామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 9స్వీకరణకు చివరి తేదీ అక్టోబర్ 11పరిశీలన: అక్టోబర్ 12నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 15ఎన్నికల తేదీ- అక్టోబర్ 23ఓట్ల లెక్కింపు- నవంబర్ 11

# మాదిగలకు 18 శాతం రిజర్వేషన్స్ అనూహ్యంగా తెరపైకి


హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్ల డిమాండ్లు అనూహ్యంగా ఎవరూ ఊహించని విధంగా తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా మాదిగ సామాజికవర్గానికి 18 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆ వర్గం నాయకులు అధికార కాంగ్రెస్ పార్టీని కోరారు. ఈ మేరకు మాదిగ నేతలు, టీపీసీసీ చీఫ్, శాసన మండలి సభ్యులు మహేశ్ కుమార్ గౌడ్ తో పాటు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ను కలిసి తమ విన్నపాన్ని అందజేశారు.రిజర్వేషన్లపై మాదిగ నేతల విజ్ఞప్తి.మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సహా పలువురు ప్రముఖ మాదిగ నాయకులు కలిసి మహేశ్ కుమార్ గౌడ్ నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. తెలంగాణలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు సామాజిక న్యాయం చేయాలని మాదిగ సామాజికవర్గ నేతలు కాంగ్రెస్ పార్టీని కోరారు. ముఖ్యంగా.. 18 శాతం రిజర్వేషన్లు అమలు చేసి, అందుకు అనుగుణంగా సీట్ల కేటాయింపు చేయాలని వారు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ , మంత్రి అడ్లూరి లక్ష్మణ్ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ సహా పలువురు నాయకులు ఈ భేటీలో పాల్గొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో మాదిగ సామాజిక వర్గానికి జనాభా దామాషా ప్రకారం 18 శాతం మేర రిజర్వేషన్లు అమలు చేసి, ఆ సంఖ్యకు అనుగుణంగా సీట్ల కేటాయింపు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.తెలంగాణ రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలలో (ఎస్సీ) మాదిగ వర్గం గణనీయమైన జనాభా కలిగి ఉంది. రాష్ట్ర రాజకీయాల్లో, ముఖ్యంగా ఎన్నికల ఫలితాలపై ఈ వర్గం ఓట్ల ప్రభావం చాలా ఎక్కువ. అందుకే.. అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు మాదిగలను తమవైపు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తుంటాయి. ఈ విజ్ఞప్తికి స్పందించిన కాంగ్రెస్ నాయకులు, ఈ అంశాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి.. న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం. మాదిగలకు సామాజిక న్యాయం జరిగేందుకు, రాజకీయ భాగస్వామ్యం పెరిగేందు కు ఈ రిజర్వేషన్ల పెంపు అవసరం అని వారు అభిప్రాయ పడ్డారు.తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ డిమాండ్ చాలా కాలంగా పెండింగ్లో ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల ముందు రిజర్వేషన్ల పెంపు అనేది కేవలం రాజకీయ లాభాపేక్ష కోసమే కాకుండా.. ఈ వర్గానికి చట్టబద్ధమైన ప్రాతినిధ్యాన్ని పెంచడానికి ఉపయోగపడుతుంది. ఈ రిజర్వేషన్ల పెంపుపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయం రాబోయే స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి మాదిగల మద్దతును బలోపేతం చేస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# తెలంగాణలో మరో రెండు కఫ్ సిరప్‌లపై నిషేధం



హైదరాబాద్: మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందు సేవించిన కారణంగా 11 మంది చిన్నారులు మరణించిన విషాదకర ఘటనల నేపథ్యంలో.. తెలంగాణ రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అప్రమత్తమైంది. ఈ ఘటనల వెనుక కిడ్నీ వైఫల్యానికి కారణమయ్యే డైథిలిన్ గ్లైకాల్ అనే ప్రమాదకర కలుషితం ఉన్నట్లు గుర్తించారు. డీసీఏ అధికారులు వెంటనే చర్యలు చేపట్టి..రాష్ట్రంలో కోల్డ్‌రిఫ్ సిరప్‌కు చెందిన %టా=%-13 బ్యాచ్‌ను ఉపయోగించవద్దని ప్రజలకు, వైద్యులకు అడ్వైజరీ జారీ చేశారు. ఈ బ్యాచ్ సిరప్‌లలో కలుషితం ఉన్నట్లు అనుమా నిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని మెడికల్ స్టోర్‌లు, ఆసుపత్రులలో -13 బ్యాచ్ సిరప్‌లను తక్షణమే సీజ్ చేయాలని నాలుగు రోజుల క్రితం డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ పరిస్థితుల నేపథ్యంలో.. డీసీఏ నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ మరో కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా, తెలంగాణ ప్రభుత్వం మరో రెండు కఫ్ సిరప్‌లపై కూడా నిషేధం విధిస్తూ ఆదేశాలు జార చేసింది. బ్యాన్‌కు గురైన ఆ రెండు కాఫ్ సిరప్‌లలో రీలైఫ్, రెస్పిఫ్రెష్-ఉన్నాయి. స్టేట్ డ్రగ్ కంట్రోల్ అథారిటీ ఈ రెండు దగ్గు మందులను మెడికల్ స్టోర్‌లలో ఎవరూ విక్రయించకూడదని ఆదేశాలు జారీ చేసింది. ఈ నిషేధం కేవలం ఆయా బ్యాచ్‌లకు మాత్రమే వర్తిస్తుందా? లేక ఆ సిరప్‌ల తయారీ, విక్రయాలన్నింటిపైనా ఉందా? అనే పూర్తి వివరాలను అధికారులు ఇంకా వెల్లడించాల్సి ఉంది.ప్రమాదకరమైన కలుషితం కేవలం కోల్డ్‌రిఫ్ సిరప్‌లోనే కాకుండా. గతంలో కొన్ని ఇతర ఫార్ములేషన్లలో కూడా బయట పడింది. కాబట్టి, డీసీఏ అధికారులు ముందు జాగ్రత్తగా ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజలు దగ్గు మందులు కొను గోలు చేసేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ప్రభుత్వ ఆదేశాలు, వైద్యుల ప్రిస్క్రిప్షన్లను మాత్రమే అనుసరించాలని అధికారులు సూచిస్తున్నారు. అంతుచిక్కని అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం ఉత్తమమని చెబుతు న్నారు. చిన్న పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ల సలహాలు లేకుండా ఎలాంటి దగ్గు మందులు వాడొద్దని చెబుతున్నారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ 'బిహార్ ఫార్ములా'





హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నిక షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించి ంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు రెండు దశల్లో జరగనుండగా. అదే సమయంలో జూబ్లీహిల్స్ బైపోల్ కూడా జరగనుంది. నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా. నవంబర్ 14న కౌంటి ంగ్ ప్రక్రియ నిర్వహించి, విజేతను నిర్ణయిస్తారు. కాంగ్రెస్, బీఆర్ ఎస్, బీజేపీ రంగంలోకి దిగడం ఖాయం కావడంతో.. జూబ్లీ హిల్స్ ఉపఎన్నిక బరిలో త్రిముఖ పోరు ఉండే అవకాశం ఉంది. కానీ ప్రధాన పోటీ మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉండ నుంది. బీఆర్ఎస్ ఇప్పటికే తమ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతను ప్రకటించింది. అనారోగ్యంతో మరణించిన మాగంటి గోపీనాథ్ భార్యకే టికెట్ ఇవ్వడంతో సానుభూతి తమ కు కలిసి వస్తుందని బీఆర్ఎస్ అంచనా వేస్తోంది. బస్తీల్లో మాగ ంటికి ఉన్న పట్టు తమకు కలిసొస్తుందని భావిస్తోంది.మరోవైపు అధికార కాంగ్రెస్ మాత్రం తమ అభ్యర్థిని ప్రకటించలేదు. కానీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్‌గా ఉన్న నవీన్ యాదవ్‌కు ఆ పార్టీ టికెట్ దాదాపుగా ఖాయమైందనే ప్రచారం జరుగుతోంది. తాను పోటీలో లేనని బొంతు రామ్మోహన్ చెప్ప డంతో. నవీన్ యాదవ్‌కు లైన్ క్లియర్ అయ్యిందనే భావన వ్యక్తమవుతోంది. మరోవైపు మజ్లిస్ పార్టీ సైతం జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పోటీ చేయకుండా.. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తుందని సమాచారం. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో ముస్లింలు పెద్ద సంఖ్యలో ఉన్నారు కాబట్టి.. మజ్లిస్ మద్దతు నివ్వడం కాంగ్రెస్ పార్టీకి కలిసొచ్చే అవకాశం ఉంది. సాధారణంగా ఎవరైనా ఎమ్మెల్యే లేదా ఎంపీ మరణిస్తే.. ఆ కుటు ంబానికి చెందిన వ్యక్తి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అనే సంప్ర దాయం గతంలో ఉండేది. కానీ కేసీఆర్ హయాంలో పరిస్థితి మారింది. అధికార పార్టీ ఉపఎన్నికల్లో గెలవడం అనే కొత్త ట్రెండ్ మొదలైంది. గతంలో జరిగిన పాలేరు ఉపఎన్నికలో గులాబీ పార్టీ గెలవగా.. ఇటీవల జరిగిన సికింద్రాబాద్ కంటో న్మెంట్ ఉపఎన్నికలో కాంగ్రెస్ గెలిచింది.ఈ సెంటిమెంట్‌తోపాటు మరో ఫ్యాక్టర్ కూడా కాంగ్రెస్‌కు కలిసొచ్చే అవకాశం ఉంది. బిహార్‌లో ఆర్జేడీకి బలమైన ఓటు బ్యాంక్ ఉంది. లాలుప్రసాద్ యాదవ్ సొంత సామాజికవర్గమైన యాదవులతోపాటు ముస్లింలు కూడా గంపగుత్తగా ఆర్జేడీకి ఓటేస్తుంటారు. ఈ ఓటు బ్యాంకు కారణంగా చాలా కాలంపాటు లాలు ఫ్యామిలీ బిహార్ రాజకీయాల్లో చక్రం తిప్పింది. అయితే మరోవైపు ఇతర ఓటు బ్యాంక్ కన్సాలిడేట్ కావడం, ముఖ్యంగా హిందూ ఓటు బ్యాంక్ ఎన్డీయే కూటమి వైపు మళ్లడంతో బిహార్లో ఆర్జేడీ-కాంగ్రెస్ కూటమికి గెలుపు కష్టంగా మారుతోంది. కానీ 30 శాతానికిపైగా బలమైన ఓటు బ్యాంకు మాత్రం ఇప్పటికీ ఆర్జేడీకి వైపు బలంగా ఉంటోంది.నవీన్ యాదవ్‌కు టికెట్ దక్కితే.. ఇదే స్ట్రాటజీని జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తుందని చెప్పొచ్చు. నవీన్ యాదవ్ 2014లో మజ్లిస్ తరఫున పోటీ చేసి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రెండో స్థానంలో నిలిచారు. ఆ ఎన్నికల్లో 42 వేల ఓట్లు సాధించిన ఆయన కాంగ్రెస్ అభ్యర్థిని మూడో స్థానానికి నెట్టారు. ముస్లింలు, యాదవుల ఓట్లు కన్సాలిడేట్ అవ్వడంతో ఆయన మాగంటికి గట్టి పోటీని ఇవ్వగలిగారు. 2018లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ఆయనకు 18 వేలకుపైగా ఓట్లు పడ్డాయి. ఈ ప్రాంతంలో నవీన్ యాదవ్‌కు ఉన్న పట్టు ఏంటో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కులనే మింగేసిన గ్యాంగ్



సూర్యాపేట జిల్లా :అనారోగ్యంతో ఆస్పత్రిపాలై అప్పులు చేసి బిల్లులు కట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే పెద్ద మనసుతో రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన నిధులను అర్హులకు అందకుండా మధ్యవర్తులే కాజేశారు. బ్యాంకు లొసుగులను ఆసరాగా చేసుకుని ఏకంగా లబ్ధిదారుల చెక్కుల్లోని సొమ్మునే వేరే బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల కుంభకోణానికి పాల్పడిన 8 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.సీఎం సహాయనిధిని ఎవరో విత్ డ్రా చేశారు : సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం రామాపురానికి చెందిన మద్ద వెంకటేశ్వర్లు అనే వ్యక్తి పక్షవాత బాధితుడు. 2023 సంవత్సరంలో సీఎం సహాయనిధి కోసం వెంకటేశ్వర్లు దరఖాస్తు చేసుకున్నాడు. ఆయన పేరుతో సీఎం సహాయనిధి కింద రూ.2 లక్షల 50 వేలు మంజూరు అయ్యాయి. బాధితుడైన వెంకటేశ్వర్లుకు ఈ విషయం తెలియదు. ఈ క్రమంలో తన పేరుతో వచ్చిన సీఎం సహాయనిధిని ఎవరో విత్? డ్రా చేశారని బ్యాంకు ద్వారా వెంకటేశ్వర్లు తెలుసుకున్నారు. ఈ మోసంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు బాధితుడు.సీఎంఆర్‌ఎఫ్ చెక్కులనే మింగేసిన గ్యాంగ్ - బ్యాంక్‌లొసుగులే ఆసరా %మరొకరి బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు వేసి వాటిని డ్రా చేశారు

## ఉద్యోగుల తండ్లాట పట్టించుకునే బాధ్యత లేదా



హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. ఎస్సీ గురుకులాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు జీతాలు రాక పడుతున్న ఇబ్బందులపై ఆర్ఎస్పీ ఎక్స్ వేదికగా స్పందించారు.సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, బీసి శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రోడ్ల మీదికొచ్చి కొట్లాడుకుంటున్నరు బాగానే ఉంది కానీ.. తెలంగాణ ఎస్సీ గురుకులాల్లో పని చేస్తున్న సుమారు 5 వేల మంది ఉద్యోగులకు గత నాలుగు నెలల నుండి జీతాలు రాక హాహాకారాలు చేస్తున్నారు తెలుసా? వాళ్ల కుటుంబాలు ఆకలి చావుల అంచుల్లో ఉన్నాయి!! ఆకలితో ఉన్న ఉద్యోగులు పేద ఎస్సీ పిల్లలకు చదువెట్లా చెప్తరు..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిలదీశారు.ముందు వెళ్లి డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దగ్గర కూర్చుని వారి జీతాలు పడేటట్టు చూడండి. మీ మంత్రులకు జీతాలు వచ్చినపుడు ఈ చిరుద్యోగులకు కూడా రావాలె కదా? మీ మంత్రులకు తన్నుకునే సమయం ఉన్నది కానీ ఉద్యోగుల తండ్లాట పట్టించుకునే బాధ్యత లేదా రేవంత్ రెడ్డి గారు అని ఆర్ఎస్పీ ప్రశ్నించారు.

## నాదర్‌గుల్‌లో హైడ్రా కూల్చివేతలు బాధితులకు న్యాయం




హైదరాబాద్, అక్టోబరు8: రంగారెడ్డి జిల్లా లోని మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల నాదర్‌గుల్‌లో హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాలను (వెంచర్) (బుధవారం) కూల్చివేశారు. ఇక్కడ 1986లో టెలికాం కో - ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఒక వెంచర్‌గా దాదాపు 100 ఎకరాల భూమిలో ప్లాట్లను ఏర్పాటు చేసి, సొసైటీ సభ్యులకు పంపిణీ చేసింది.అయితే, 2016లో ధరణి ద్వారా అక్రమ పాస్‌బుక్కులు సృష్టించి, సొసైటీకి చెందిన భూమిలో మరో నూతన వెంచర్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో దాదాపు 23 ఇంటి నిర్మాణ అనుమతులని అక్రమంగా పొందారు. ఈ అక్రమాలను గమనించిన అసలైన ప్లాట్ యజమానులు కలెక్టర్, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బాధితులు హైడ్రా ఆశ్రయం తీసుకున్నారు.ఈ విషయంపై హైడ్రా అధికారులు సమగ్ర విచారణ జరిపి, అక్రమంగా మంజూరైన పర్మిషన్లను రద్దు చేశారు. అనంతరం అసలైన యజమానులకు వారి ప్లాట్లను తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇతర అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. వారికి న్యాయం జరగడంపై బాధితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు హైడ్రా అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు.

## విద్యార్థుల గోస పట్టడం లేదు



హైదరాబాద్, అక్టోబర్ 8: గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత (బుధవారం) నిరసనకు దిగారు. నిరుద్యోగులకు మద్దతుగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. విద్యార్థుల గోస కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో కొంత మందికి ఉద్యోగాలు ఇవ్వడానికి గ్రూప్ 1 పెట్టారా అని ప్రశ్నించారు. తెలిసో తెలియకనో గత పదేళ్లలో గ్రూప్ 1 పెట్టలేదన్నారు. నిరుద్యోగులతో అధికారంలోకి వచ్చి వాళ్ళనే రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని మండిపడ్డారు.పరీక్ష రాసిన విద్యార్థులు.. ఉద్యోగాలు వచ్చిన విద్యార్థులు రాసిన పేపర్లు బయట పెట్టమని అడుగుతున్నారన్నారు. 50 వేల పాత ఉద్యోగాలు ఇచ్చి తాము ఇచ్చినం అని అంటున్నారని విమర్శించారు. ప్రొఫెసర్ హరగోపాల్‌ను స్వయంగా కలుస్తామని.... వ్యవస్థ ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులలో నిరుద్యోగులను మోసం చేస్తే కుర్చీలో నుంచి తీసి బయట పడేస్తారని హెచ్చరించారు. రేపు ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ మీటింగ్ ఉందన్నారు. ప్రజా ఆగ్రహానికి గురికావొద్దని ప్రభుత్వానికి సూచించారు. ఉద్యోగాలు వచ్చిన వారిపై తమకు కోపం లేదని.. అక్రమంగా తెచ్చుకున్న వారిపైనే కోపమని కవిత స్పష్టం చేశారు.

## కాంగ్రెస్‌ను భూస్థాపితం చేసే పనిలో రేవంత్ రెడ్డి




కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 08 : కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేసే పనిలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నాడని, టీడీపీలో డబ్బు సంచులతో దొరికి ఆ పార్టీని బొందపెట్టాడని, ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీని రాష్ట్రంలో నామరూపాలు లేకుండా చేసేలా పాలన సాగిస్తున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి అన్నారు. బుధవారం కొత్తగూడెం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గతంలో తీసుకువచ్చిన 108, ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు మంగళం పాడుతూ ఆ పార్టీని నాశనం చేసే విధంగా రేవంత్ నిర్ణయాలు తీసుకుంటున్నాడని, దీనిపై అసలు కాంగ్రెస్ నాయకులు నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. పేదవాడి ఆరోగ్యం కోసం తీసుకువచ్చిన ఆరోగ్య శ్రీ పథకానికి నిధులు కేటాయించకుండా, ఆస్పత్రులకు బిల్లులు చెల్లించడం లేదని, 108 అంబులెన్స్ లకు డీజిల్ లేక మూలకు పడ్డట్లు తెలిపారు. పేద విద్యార్థులు గొప్ప గొప్ప చదువులు చదువుకోవాలని ఆనాటి సీఎం వైఎస్ఆర్ తెచ్చిన ఫీ రీయింబర్స్‌మెంట్ పథకంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఫలితంగా కళాశాల యాజమాన్యాలు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందని విమర్శించారు. గత మార్చిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని, మార్చి తర్వాత ప్రతీ నెలా చెల్లిస్తామని కళాశాలల యాజమాన్యాలకు హామీ ఇచ్చిన ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని, ఫలితంగా వారు ఆందోళన చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

## నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి




ఖమ్మం రూరల్, అక్టోబర్ 08 : స్థానిక సంస్థలు (ఎంపీటీసీ, జడ్పిటిసి) ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు ఖమ్మం రూరల్ మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన పత్రాలను సిద్ధం చేసి అందుకు అనుగుణంగా ఆయా కౌంటర్లకు రిటర్నింగ్ అధికారులు, ఇతర సిబ్బందిని కేటాయించారు. మండలంలో మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలకు గాను ఒక జడ్పిటిసి ఎన్నికకు సంబంధించి ఈ నెల 9న ఉదయం 10:30 గంటల నుండి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అధికారులు నామినేషన్లను స్వీకరించనున్నారు. నామినేషన్ల పరిశీలన 12వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పూర్తిచేసి తుది జాబితా ప్రకటించనున్నారు.

# జగన్ పర్యటనకు నిబంధనలు



**విశాఖపట్నం, అక్టోబర్ 8:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనకు సంబంధించిన పోలీసులు ఇచ్చిన కొత్త రూట్‌ను తాము అంగీకరిస్తున్నామని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ పర్యటనకు అనుమతి ఇస్తూనే 18 కండిషన్లు పెట్టారన్నారు. పోలీసులు ఇన్ని నిబంధనలు పెట్టడం సమంజసం కాదని... పునఃసమీక్షించుకోవాలని కోరుతున్నామని మాజీ మంత్రి తెలిపారు (గురువారం) జగన్ పర్యటన ఎయిర్ పోర్టు నుంచి ఎన్ఏడి కొత్త రోడ్డు, గోపాలపట్నం, వేపగుంట, అనకాపల్లి మీదగా ప్రయాణిస్తారని... నర్సీపట్నం మెడికల్ కళాశాలకు వెళ్తారని వెల్లడించారు. స్టీల్ ప్లాంట్ కార్మికులు తమ బాధను చెప్పుకోవడానికి ఎయిర్ పోర్టుకు కానీ మార్గం మధ్యలో ఎక్కడికైనా రావాల్సిందిగా కోరుతున్నామన్నారు. పోలీసుల రూట్ మార్చినంత మాత్రాన వైసీపీ తన మాటను మార్చదని స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వైసీపీ ఎప్పుడూ వ్యతిరేకమే అని.. తమ స్టాండ్ మారలేదని గుడివాడ అమర్‌నాథ్ తేల్చిచెప్పారు. ప్రజా ఉద్యమంలో భాగంగానే: రజనీప్రజా ఉద్యమంలో భాగంగానే రేపు నర్సీపట్నం మెడికల్ కళాశాలకు జగన్ వస్తున్నారని మాజీ మంత్రి విడదల రజనీ తెలిపారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ఉండాలన్నది జగన్ ఆలోచన అని అందుకే 17 కళాశాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఇందులో 5 కళాశాలలను ఆల్రెడీ ప్రారంభించామన్నారు. నర్సీపట్నం మెడికల్ కాలేజీకి సంబంధించి 2023 సంవత్సంలో జీఓ నెంబర్ 39 ఇచ్చామని గుర్తుచేశారు. ఈ మెడికల్ కాలేజీని 500 కోట్లతో నిర్మించనున్నామని జీవో ఇచ్చాం.. ఈ జోవోను చూసి అయినా కూటమి నేతలు మాట్లాడాలి కదా అని ప్రశ్నించారు. నర్సీపట్నంలో ల్యాండ్ లేదని, కాలేజీ లేదని, పర్మిషన్లు లేవని అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. ఇలా మాట్లాడిన నేతలు అంతా జగన్ కార్యక్రమానికి రావాలని ఆహ్వానిస్తున్నామన్నారు. వస్తే వివరాలు అందిస్తామని.. కాలేజీ నిర్మాణం ఎంత వరకు వచ్చిందో కూడా చూపిస్తామని మాజీ మంత్రి విడదల రజనీ పేర్కొన్నారు.

# హద్దు మీరితే తోక కట్ చేస్తాం వైసీపీకి గంటా వార్నింగ్



**విశాఖపట్నం, అక్టోబర్ 8:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖ పర్యటనపై మాజీ మంత్రి గంటా శ్రీనివాస రావుస్పందించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ. (గురువారం) జగన్ విశాఖకు వచ్చి నర్సీపట్నం మెడికల్ కాలేజ్‌కు వెళ్తామని అంటున్నారని.. ఎయిర్ పోర్ట్ నుంచి నర్సీపట్నం వరకు 63 కిలో మీటర్లు రోడ్ షో వేయాలని వైసీపీ ప్లాన్ చేసిందన్నారు. చాలా దూరం కాబట్టి హెలికాప్టర్‌లో వెళ్ళమని పోలీసులు చెప్పారని తెలిపారు. వైసీపీ హయాంలో పాలన ఎలా జరిగిందో అందరికీ తెలిసిందే అని చెప్పుకొచ్చారు. ఎయిర్ పోర్ట్‌లో ఆనాడు చంద్రబాబును అడ్డుకున్నారని.. పవన్ కళ్యాణ్‌ను అడ్డుకున్నట్లు తాము చేయగలమన్నారు. కానీ అలా చేయమని. జగన్ పర్యటనకు అనుమతులు ఇచ్చామన్నారు. గతంలో కూడా ఏపీలో చాలా చోట్ల జగన్ పర్యటనకు అనుమతి ఇచ్చామని.. ఎలాంటి సంఘటనలు జరిగాయో అందరికీ తెలుసని మాజీ మంత్రి అన్నారు. జగన్ తన పర్యటనలో లా అండ్ ఆర్డర్‌కు ఇబ్బందులు కలిగించారని విమర్శించారు. విశాఖలో మహిళల క్రికెట్ మ్యాచ్ ఉందని... ఇటువంటి సమయంలో జగన్ వస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కాలేజీలు కట్టాలని అనుకున్నారని తెలిపారు. నర్సీపట్నం మెడికల్ కాలేజ్ పునాది స్థాయిలో ఉంటే.. వైసీపీ కార్యాలయాలు మాత్రం మహారాజ ప్యాలెస్‌లా కట్టుకున్నారని ఎద్దేవా చేశారు. రుషికొండలో ప్రజా ధనంతో ప్యాలెస్ కట్టారని మండిపడ్డారు. జగన్ కల్తీ మద్యం కోసం మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని దుయ్యబట్టారు. తమిళనాడులో విజయ్ కార్యక్రమంలో 40 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని తెలిపారు. గుడివాడ అమర్నాథ్ అవగాహన రాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎవరు అడ్డుకుంటారో చూస్తామంటే.. మక్కెలు ఇరగ కొడతామని మాజీ మంత్రి హెచ్చరించారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని.. నిబంధన ఉల్లంఘిస్తే చట్టం తన పని చేసుకుపోతుం దన్నారు. జగన్ వి వీకెండ్ రాజకీయాలని విమర్శించారు. దేని కోసం కోటి మందితో సంతకాలు చేస్తామని అంటున్నారని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం చేతకాని ప్రభుత్వం కాదన్నారు. జగన్‌కు అక్కడికి వెళ్లడానికి సిగ్గు ఉండాలని విమర్శించారు. హద్దు మీరితే... తోక ఎలా కట్ చేయాలో చంద్రబాబుకు తెలుసన్నారు. ఇటీవల పెద్దిపాలెంలో ఉత్తరాంధ్ర వైసీపీ నేతలు అత్యంత రహస్యంగా మీటింగ్ పెట్టారని.. అంత రహస్యంగా సమావేశాన్ని ఎందుకు పెట్టాల్సి వచ్చిందో చెప్పాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ పై. 'స్టీల్ ప్లాంట్ కోసం నేను రాజీనామా చేశాం. మేము స్టీల్ ప్లాంట్ కోసం 11 వేల కోట్ల రూపాయల ప్యాకేజీని తెచ్చాం. వైసీపీ హయాంలో ఒక్క రూపాయి ప్యాకేజీ రాలేదు' అని గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# ఏపీ ప్రజలకు అలర్ట్ మరోసారి భారీ వర్షాలు



**అమరావతి:** బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావం వల్ల రాష్ట్రంలో మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ వాతావరణ శాఖ హెచ్చరించింది. దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి మన్నార్ గల్ఫ్ వరకు.. తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు ప్రాంతాల మీదుగా సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్లు ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడారు. ద్రోణి ప్రభావంతో ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో రెండు రోజులపాటు పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. ప్రజలు చెట్ల క్రింద నిలబడరాదని, అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అలాగే ఇవాళ పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసినట్లు తెలిపారు. తిరుపతి జిల్లా దక్కిలిలో 77.2మిమీ, అల్లూరి జిల్లా అరకులో 61మిమీ, నెల్లూరు జిల్లా దగదర్తిలో 57.7మిమీ, బాపట్ల జిల్లా రామకూరులో 56.5మిమీ, అనకాపల్లి జిల్లా పాములవాకలో 48.5మిమీ, కడప జిల్లా పులివెందులలో 45.5మిమీ వర్షపాతం నమోదైందని ఆయన పేర్కొన్నారు. రేపు(గురువారం) కూడా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దూర ప్రయాణాలు రద్దు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే అధికారులకు సమచారం ఇవ్వాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు.

# జగన్ కోట్ల రూపాయలు దోచుకున్నారు



**పశ్చిమ గోదావరి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిలో దూసుకెళ్తుందని జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్‌పై విమర్శలు గుప్పించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను బ్యాంకులో జగన్ తాకట్టు పెట్టారని ఆరోపించారు. లబ్ధిదారుల నెత్తిన జగన్ అప్పుల భారం మోపారని విమర్శించారు. టిడ్కో గృహాలలో మిగిలిన పనులు పూర్తి చేసి త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని ఆయన వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మున్సిపాలిటీల నిధులను సైతం దారి మళ్లించారని మంత్రి రామానాయుడు ఆరోపించారు. పట్టణాలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. జగన్ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి.. కల్తీ లిక్కర్, ఇసుక, గనులు, విలువైన భూముల ద్వారా కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా జగన్ సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకే వైసీపీ కుట్ర రాజకీయాలు చేస్తోందని మంత్రి రామానాయుడు ధ్వజమెత్తారు.

# అమృత ఆరోగ్య పథకం



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అనాథలు, నిరాశ్రయులు, వృద్ధుల కోసం అమలు చేసే "అమృత ఆరోగ్య పథకం" విస్తరించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 2,812 మందికి అమృత ఆరోగ్య పథకం వర్తింపజేస్తోంది. అదనంగా 1,113 మంది అనాథలు, నిరాశ్రయులు, వృద్ధులకు అమృత ఆరోగ్య పథకం వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య కార్యదర్శి సారభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవోకు సూచించారు. ప్రస్తుతం ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 2,812 మంది ఉన్నారు గుర్తించిన వారందరికీ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందనున్నాయి. అమృత ఆరోగ్య పథకం కింద 1,044 థెరపీలు , సర్జరీలు సహా ఏడాదికి రూ. 2.50 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో అనాథలు, వారికి, వృద్ధులకు "అమృత ఆరోగ్య పథకం" ద్వారా మరిన్ని వైద్య సేవలు దక్కనున్నాయి.

# రూ.1.14లక్షల కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్




**అమరావతి, అక్టోబర్ 8:** 11వ ఎస్ఐపీబీ సమావేశంలో రూ. 1.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోద ముద్ర పడింది. (బుధవారం) ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పాల్గొన్నారు. మూడు 3 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఎస్ఐపీబీ సమావేశంలో ప్రాజెక్టుల వారీగా లోతైన చర్చ జరిగింది. భారీ ప్రాజెక్టులకు ప్రత్యేక అధికారుల నియామకానికి ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కంపెనీలు త్వరగా గ్రౌండ్ అయ్యేలా ప్రత్యేక అధికారులు బాధ్యత తీసుకోనున్నారు. అలాగే ఐటీ, ఇంధనం, టూరిజం, ఎరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో 30కిపైగా ప్రాజెక్టులకు ఈ సమావేశంలో ఆమోదం లభించింది. వీటి ద్వారా 67 వేల ఉద్యోగాలు వస్తాయని అంచనా. దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి 11వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. రూ.87,520 కోట్లు పెట్టుబడి పెట్టనున్న రేడియన్ ఇన్ఫో టెక్ డేటా సెంటర్‌కు (కు ఈ సమావేశంలో ఆమోదం లభించింది. గతంలో ఎప్పుడూ ఈ స్థాయిలో ఎఫ్‌డీఐ రాలేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. రేడియన్ ఇన్ఫో టెక్ డేటా సెంటర్ ఏర్పాటు కొత్త చరిత్రను లిఖిస్తుందని ఎస్ఐపీబీ సమావేశం పేర్కొంది. ఇక.. అతిపెద్ద ఫారిన్ ఇన్వెస్టిమెంట్ సాధించడంపై ఐటీ మంత్రి నారా లోకేష్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు అభినందనలు తెలియజే శారు. 15 నెలల కాలంలో పెట్టుబడుల ప్రయత్నాలు సత్ఫలితా లు ఇస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇప్పటి వరకు జరిగిన 11 ఎస్ఐపీబీల ద్వారా రూ. 7.07 లక్షల కోట్ల పెట్టుబ డులకు ఆమోదం లభించింది. దీని ద్వారా 6.20 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది.

# మాజీ సీఎం జగన్‌పై కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఫైర్



అమరావతి: మాజీ సీఎం జగన్‌కు గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా.. సిగ్గు లేకుండా పీపీపీపై అబద్ధాలు చెబుతున్నారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగనే 16 మెడికల్ హబ్‌లకు పీపీపీ టెండర్లు పిలిచారని గుర్తుచేశారు. ఇప్పుడు తానే వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. జె ట్యాక్స్‌కు భయపడి టెండర్లకు ఎవరూ రాలేదని విమర్శించారు. ఇప్పుడు పీ-4 పథకం విజయవంతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు సీఎం చంద్రబాబు మీద నమ్మకం ఉంచారని అన్నారు. ఆరోగ్య శ్రీ ప్రారంభించినప్పుడు జగన్ తండ్రి రాజశేఖర్ రెడ్డి కూడా పీపీపీ చేశారని పట్టాభిరామ్ తెలిపారు. ఆయన చేసింది కూడా తప్పు అని చెబుతావా.. జగన్ అంటూ ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యానికి ఒక్క పైసా ఖర్చు చేయని జగన్.. రిషికొండ ప్యాలెస్‌కి మాత్రం రూ. 500 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. జగన్ చేసిన పాపాల వల్లనే ఈ పరిస్థితికి చేరుకున్నారని ఆరోపించారు. అది తెలుసుకుంటే మంచిదని పట్టాభిరామ్ హితవు పలికారు. గత ప్రభుత్వంలో నర్సీపట్నం మెడికల్ కాలేజీకి రూ.500 కోట్ల అంచనా వేశారని పట్టాభిరామ్ గుర్తు చేశారు. కానీ ఖర్చు రూ.11.7 కోట్లు మాత్రమే అని విమర్శించారు. అలాగే ఉత్తరాంధ్ర నాలుగు మెడికల్ కాలేజీల అంచనా వ్యయం రూ.2100 కోట్లు.. అయితే ఖర్చు చేసింది కేవలం రూ.212 కోట్లు మాత్రమే అని ఆరోపించారు. జగన్ రేపు(గురువారం) నర్సీపట్నం వెళ్తారట.. మెడికల్ కాలేజీలను చూస్తారట.. అని చెప్పుకొచ్చారు. అక్కడున్నది ముళ్ల కంచలే కదా.. అక్కడకెళ్లి గంతులేస్తావా జగన్..అని పట్టాభి ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి రాకుండా కుర్చీ కావాలని చిన్న పిల్లాడు లాలీపాప్ కోసం మారాం చేస్తున్నట్లు తన ప్యాలెస్‌లో కూర్చుని జగన్ డ్రామా ఆడుతున్నారని ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు.

# బాధిత కుటుంబాలను ఆదుకుంటాం అగ్నిప్రమాదంపై సీఎం



**అమరావతి, అక్టోబర్ 8:** అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాద ఘటన కలచి వేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీఎం స్పందిస్తూ.. ఈ ఘోర ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. ప్రమాద కారణాలు, ప్రస్తుత పరిస్థితి, సహాయక చర్యలు, వైద్య సాయంపై అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. స్వయంగా సంఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొనాలని ఉన్నతాధికారులను ఆదేశించామన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సాయం అందించాలని సూచించామని.. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇస్తూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. ఈ విషాద ఘటనపై సీఎం చంద్రబాబుతో పాటు రాష్ట్ర మంత్రులు స్పందిస్తూ.. విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కోనసీమ జిల్లాలో అగ్నిప్రమాదంపై హోం మంత్రి అనిత స్పందించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మంటలు అదుపులోకి వచ్చాయన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను హోం మంత్రి అనిత ఆదేశించారు. మంత్రి అచ్చెన్న దిగ్భ్రాంతిఅంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాద ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటన గురించి జిల్లా అధికారులతో మాట్లాడారు మంత్రి. ప్రమాదంలో పలువురు చనిపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మృతులు, గాయపడిన వారిపై అధికారులు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రమాదానికి గురైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గాయపడిన బాధితులకు మెరుగైన వైద్యం అందచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు మృతుల కుటుంబాలకు సంతాపం: మంత్రి సుభాష్కోనసీమ అగ్నిప్రమాదంపై మంత్రి వాసం శెట్టి సుభాష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాయవరంలోని బాణసంచా ప్రమాద ంలో మృతి చెందిన వారి కుటుంబాలకు సంతా పం తెలియజేశారు. గాయపడిన వారికి అత్యు త్తమ వైద్యం అందించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులతో ఫోన్లో మాట్లాడిన మంత్రి.. సహాయ చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రమాద కారణాలపై పూర్తి స్థాయి వివరాలు ఇవ్వాలని మంత్రి సుభాష్ ఆదేశించారు. భద్రతా నిబంధ నల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు.

# క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి: మంత్రి లోకేష్



**అమరావతి , అక్టోబర్ 8:** కోనసీమ జిల్లాలో బాణసంచా తయారీ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంపై మంత్రి లోకేష్ స్పందించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలోని ఓ బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనలో ఆరుగురు వ్యక్తులు దుర్మరణం పాలవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. మంటల్లో చిక్కుకుని కార్మికులు సజీవ దహనం కావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై ప్రభుత్వం ఇప్పటికే ఆరా తీసిందని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు మంత్రి లోకేష్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కోనసీమ జిల్లాలో బాణసంచా పేలుడు ఘటనపై మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనలో పలువురు చనిపోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక అధికారులతో మాట్లాడి బాధితులకు అందిస్తున్న సహాయ చర్యలను అడిగి తెలుసుకున్నారు మంత్రి. ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. బాణసంచా తయారీ సమయంలో భద్రతా నిబంధనల అమలుపై దృష్టి పెట్టాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించారు. ట్రిపుల్ ఐటీల్లో మెస్ నిర్వహణ బాధ్యతను అక్షయపాత్రకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అప్పగించారు. లోకేష్ తన మాటనిలబెట్టుకు న్నారని ధన్యవాదాలు తెలిపారు విద్యార్థులు. ఇటీవల నూజివీడు భోజనం సరిగా పెట్టడం లేదని విద్యార్థులు ఆందోళన చేశారు. అయితే, అక్షయపాత్ర ద్వారా నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని లోకేష్ నిర్ణయం తీసుకు న్నారు. అక్షయపాత్ర ద్వారా నాణ్యమైన భోజనం అందుతోం డటంతో సంతోషం వ్యక్తం చేశారు విద్యార్థులు. తమ సమస్య పరిష్కారానికి మంత్రి నారా లోకేష్ కృషి చేశారని ట్రిపుల్ ఐటీ విద్యార్థులు అభినందనలు తెలిపారు. అక్షయపాత్ర ద్వారా అందిస్తున్న పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన భోజనాలతో ఇప్పుడు నిజమైన మార్పు కనిపిస్తోందని విద్యార్థులు పేర్కొన్నారు.

# బిహార్‌లో సీట్ల సర్దుబాట్లు: బీజేపీకి చిరాగ్ పాశ్వాన్ సూక్తి ముక్తావళి



**పాట్నా, అక్టోబర్ 8 :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్‌డీఏకూటమిలో సీట్ల సర్దుబాటు పెద్ద టాస్క్ లా మారుతోంది. సీట్ల పంపకాలపై ఆయా పార్టీల మధ్య ఉద్విగ్నభరిత చర్చలు జరుగుతున్న నేపథ్యంలో, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ తాజాగా ఒక కీలక వ్యాఖ్య చేశారు. తన తండ్రి, లోక్‌జనశక్తి పార్టీ (రామ్ విలాస్) స్థాపకుడు రామ్ విలాస్ పాశ్వాన్ వర్ధంతి(అక్టోబర్ 8) రోజున తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన ఈ వ్యాఖ్య ఎన్‌డీఏలోని భాగస్వాముల మధ్య కొత్త చర్చకు దారితీస్తోంది. చిరాగ్ పాశ్వాన్ సదరు పోస్ట్‌లో.. తన తండ్రి రామ్ విలాస్ పాశ్వాన్ మాటల్ని ఉటంకించారు. 'పాపా ఎల్లప్పుడూ చెప్పేవారు, పాపం చేయకు, పాపం భరించకు. జీవించాల నుకుంటే, మరణించడం నేర్చుకో, ప్రతి అడుగులో పోరాటం చేయడం నేర్చుకో' అని రాశారు. దీనిపై బిహార్ లో రాజకీయ నేతలు తమ ఇష్టానికి నిర్వచిస్తున్నారు. కాగా, ఇటీవల పాట్నా ఎయిర్‌పోర్ట్‌లో చిరాగ్ ఎన్డీయే కూటమి సీట్ల పంపకాలపై నేరుగా మాట్లాడారు, 'సీట్ల షేరింగ్ చర్చలు ఇంకా ప్రారంభ దశలో ఉన్నాయి. సమయం వచ్చినప్పుడు సమాచారం తెలయజేస్తాం' అని చెప్పారు. ఇలా ఉండగా, బిహార్ ఎన్‌డీఏ కూటమిలో బీజేపీ, జేడీయూ, ఎల్‌జేపీ–ఆర్‌వీ, హిందుస్తానీ అవామ్ మోర్చా వంటి మిత్ర పక్షాలు సభ్యులు గా ఉన్నాయి. వీటి మధ్య బిహార్ అసెంబ్లీ ఎన్నికల సీట్ల పంపిణీపై ఇంకా ఒప్పందం కుదుర్చుకోలేదు. ఇలాఉంటే, బీజేపీ, జేడీయూ రెండు పార్టీలు 103 సీట్లకు డిమాండ్ చేస్తున్నాయి. హామ్ పార్టీ 15–18 సీట్లు కోరుతోంది.. కానీ బీజేపీ 7 నుంచి 8 మాత్రమే ఇవ్వాలనుకుంటోంది. చిరాగ్ పార్టీ 40–50 సీట్లు డిమాండ్ చేస్తోంది. కానీ బీజేపీ 20 సీట్లు మాత్రమే ప్రతిపాదించింది. ముఖ్యంగా, 2024 లోక్‌సభ ఎన్నిక ల్లో గెలిచిన 5 లోక్‌సభ స్థానాల్లో ప్రతి ఒక్కటికి రెండు అసెంబ్లీ సీట్లను చిరాగ్ కోరుతున్నట్టు తెలుస్తోంది. సీట్ల పంపకాలకి సంబంధించి ఈ రోజు సాయంత్రం పాట్నాలో ఎన్‌డీఏ టాప్ నాయకుల మీటింగ్ జరగనుంది. కాగా, బిజేపీ బిహార్ ఎన్నికల ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం చిరాగ్‌తో చర్చలు జరిపారు.

# 15 సీట్లు ఇస్తే సరి లేకుండా పోటీ చేయం బీజేపీ పార్టనర్ హుకుం



**పాట్నా:** ఒకవైపు వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలకు బిహార్ సన్నద్ధమవుతుంటే మరోవైపు నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ లో రాజకీయ ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి. చాలాకాలంగా తమను చిన్నబుచ్చుతున్నారని, తమను పట్టించుకోవడం లేదని మాజీ ముఖ్యమంత్రి, ఎన్డీయే భాగస్వామ్య పక్షమైన హిందుస్థాని అవామ్ మోర్చా (సెక్యులర్) చీఫ్ జీతన్ రామ్ మాంఝీ ఆక్రోశం వ్యక్తం చేశారు. ఈసారి కనీసం 15 సీట్లు అయినా ఇవ్వకుంటే తమ పార్టీ ఎన్నికల్లో పోటీ చేసేది లేదన్నారు. అయితే ఎన్డీయేలోనే కొనసాగుతామని తెలిపారు. మాకు 15 సీట్లు ఇవ్వకుంటే ఎన్నికల్లో పోటీ చేసే ప్రసక్తే లేదు. మమ్మల్ని అమానించినట్టు, మా వాళ్లను నిర్లక్ష్యం చేసినట్టు భావిస్తున్నాను. మేము ప్రతిసారి ఎన్డీయేకు మద్దతిస్తూనే ఉన్నాం. మమ్మల్ని గౌరవించాల్సిన బాధ్యత వారికి ఉంది. 15 సీట్లు ఇస్తే 8–9 సీట్లు గెలుచుకుంటాం. ఇవ్వకుంటే 60 నుంచి 70 నియోజకవర్గాల్లో మా పార్టీ పరపతిని పెంచుకోవడం మినహా మాకు మరో మార్గం లేదు. చిరాగ్ (పాశ్వాన్)కు సీట్లపై మాకెలాంటి అభ్యంతరం లేదు. కానీ దయచేసి మా గౌరవాన్ని కాపాడండి' అని జీతన్ రామ్ మాంఝీ అన్నారు. జీతన్ రామ్ మాంఝీతో పాటు మరో దళిత నేత, కేంద్ర మంత్రి, లోక్‌జన్‌శక్తి పార్టీ (రామ్ విలాస్) చీఫ్ చిరాగ్ పాశ్వాన్ సైతం తమ పార్టీకి 40 నుంచి 50 సీట్లు ఇవ్వాల్సిందేనని పట్టుదలతో ఉన్నారు. బీజేపీ 20 సీట్లు ఇచ్చేందుకు ప్రతిపాదిస్తోంది. ఈ నేపథ్యంలో పాశ్వాన్ తన తండ్రి వర్ధంతి (అక్టోబర్) సందర్భంగా తన 'ఎక్స్' ఖాతాలో చేసిన పోస్ట్ ఆసక్తికరంగా మారింది. 'మా తండ్రి ఎప్పుడూ చెప్పేవారు. పాపం చేయకు, పాపం భరించకు, జీవించాలనుకుంటే మరణించడం నేర్చుకో, ప్రతి అడుగులో పోరాటం చేయడం నేర్చుకో' అని ఆ పోస్టులో చిరాగ్ రాశారు. జీతన్ రామ్ మాంఝీ సైతం బుధవారం ఒక ట్వీట్‌లో భారతంలోని ఓ ఘట్టాన్ని ప్రస్తావించారు. మహాభారతంలో పాండవులు కేవలం ఐదు ఊళ్లు అడిగిన విషయాన్ని గుర్తుచేస్తూ... మాకు కేవలం 15 ఊళ్లు (సీట్లు) ఇస్తే చాలునంటూ ట్వీట్ చేశారు.

# ఇండో- భూటాన్ నదీ కమిషన్‌లో బంగాల్‌కు ప్రాతినిధ్యం ఉండాలి



**ఇండో:** ఇండో– భూటాన్ నదీ కమిషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను బంగాల్ సీఎం మమతా బెనర్జీ పునరుద్ఘాటించారు. ఆ కమిష న్‌లో బంగాల్‌ను ప్రాతినిధ్యం ఉండాలని డిమాండ్ చేశారు. మంగళవారం వరదలు ముంచెత్తిన, కొండచరియలు విరిగిపడిన దూధియా ప్రాంతాన్ని సందర్శించడానికి వెళ్లినప్పుడు ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.'బంగాల్ భూభాగం పడవ లాంటి ఆకారంలో ఉంటుంది. అందుకే నేపాల్, భూటాన్, సిక్కిం ప్రాంతాల నుంచి వచ్చే నది జలాలు మన రాష్ట్రంలోకి ప్రవేశిసు న్నాయి. దీంతో వరదలు, కొండచరియలు విరిగిపడ తున్నాయి. భూటాన్‌లో 56 నదులు ఉన్నాయి. అయినప్పటికీ మా విజ్ఞప్తిని పట్టించుకోకుండా నాలుగు ఆనకట్టలను మూసివేశారు. సిక్కిం నుంచి వచ్చే మొత్తం నీరు మన రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్నాయి. మేం సిక్కింకు వ్యతిరేకం కాదు. అయితే తీస్తా నదిపై 14 ఆనకట్టలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం మరో మూడు లేదా నాలుగు ఆనకట్టలు నిర్మించడానికి అనుమతి ఇచ్చింది. ఎందుకు ఇచ్చింది మేం ఆ నదిపై రెండు ఆనకట్టలు నిర్మించాలనుకున్నాం. కానీ మాకు అనుమతి ఇవ్వలేదు. ఇదే పరిస్థితి హాల్దియా పోర్ట్ సహా ఇతర జలాశయాల విషయంలోనూ ఉంది. అందుకే ఇండో–భూటాన్ రివర్ కమిషన్‌లో మన రాష్ట్రానికి ప్రతినిధి ఉండాలి అని మేం డిమాండ్ చేస్తున్నాం' అని మమతా బెనర్జీ తెలిపారు. కేంద్రం నివేదికలకే పరిమితం : మమతా బెనర్జీఅలాగే మోదీ సర్కార్?పై సీఎం మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. ఏదైనా ఘటన జరిగే కేంద్రానికి ఒకటే పని ఉంటుంది. అది కూడా 24 గంటల్లో నివేదిక ఇవ్వాలని అడుగుతుంది. మేం మాంత్రికులం కాదు. ఆ విధంగా నివేదిక ఇవ్వడం సాధ్యం కాదు. కనీసం 15 రోజులు పడుతుంది. నివేదిక ఇచ్చిన తర్వాత కూడా వారు డబ్బు ఇవ్వరు. ఆ నివేదికతో ఏమి చేస్తారు బంగాల్ ప్రజలు తమతోనే ఉన్నారు. మేం హక్కులు కోరుకుంటున్నాం. వరద సహాయం కోసం ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. అయినప్పటికీ మేం పోరాడుతున్నాం. భూటాన్ నాలుగు ఆనకట్టలు తెరిచింది కానీ నీరు రాలేదు. చాలా సార్లు సంఖ్యలు కూడా చూపించరు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మీడియాను నియంత్రిస్తుంది. ఇతర రాష్ట్రాల్లో కూడా మరణాలు సంభవించాయి. వీటిపై మేం రాజకీయాలు చేయం.' అని మమతా బెనర్జీ అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మమతా బెనర్జీ 16 బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రతి కుటుంబం నుంచి ఒకరికి స్పెషల్ హోమ్ గార్డ్ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ నియామక పత్రాలను తదుపరి 15 రోజుల్లో అందించమని అధికారులకు ఆదేశించారు. అలాగే, దూధియా ప్రాంతంలోని బాలసన్ నదిపై 15 రోజుల్లో తాత్కాలిక వంతెన నిర్మించమని ప్రజా నిర్మాణ శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వ్యవసాయ భూములు నాశనం అయ్యాయని ఆందోళన పడొద్దని, వాటన్నింటినీ బీమా పరిధిలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# భారత్‌కు 135 మందితో వచ్చిన బ్రిటిష్ ప్రధాని స్టార్మర్




**ముంబై :** బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్ భారతదేశానికి వచ్చారు. ఇది భారత దేశంలో ఆయన మొదటి అధికారిక పర్యటన. ఈ ఉదయం (అక్టోబర్ 8)న ముంబై చత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కీర్ బృందం దిగింది. వారిని మహారాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవ్‌వ్రత్, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలు ఏకనాథ్ షిండే, అజిత్ పవార్ సాదరంగా ఆహ్వానించారు. యూకే నుంచి 125 మంది సభ్యులతో గరిష్ట స్థాయి వాణిజ్య డెలిగేషన్‌తో వచ్చిన స్టార్మర్, అనంతరం ముంబైలో వ్యాపారవేత్తలతో సమావేశమయ్యారు. తాజ్‌మహల్ ప్యాలెస్‌లో వ్యాపారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డిస్పోజబుల్ కెమెరాతో సెల్ఫీ తీసుకున్న ఆయన ఆటోగ్రాఫ్ మూమెంట్ వైరల్ అయింది. యూకే ప్రధాని కీర్ స్టార్మర్, భారత పర్యటన గురించి మన ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ లో ఒక పోస్ట్ చేశారు. 'భారత్‌కు మొదటి చారిత్రక సందర్శనకు వచ్చిన యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌ను స్వాగతిస్తున్నా.. యూకే నుంచి వచ్చిన అతి పెద్ద వాణిజ్య డెలిగేషన్‌తో సమావేశం కోసం ఎదురుచూస్తున్నా.. రేపటి మా సమావేశంలో.. ఇరుదేశాలు బలమైన, పరస్పర లాభదాయక భవిష్యత్తు సాధించే దిశగా ముందుకు వెళ్లడానికి ఆత్రంగా ఎదురు చూస్తున్నాను' అని మోదీ పేర్కొన్నారు. ఇలా ఉండగా, బ్రిటన్ ప్రధాని భారత పర్యటన భారత్–యూకే భాగస్వామ్యానికి కొత్త అధ్యాయాన్ని రాస్తుందని విదేశాంగ మంత్రిత్వ శాఖపేర్కొంది. రేపు, అక్టోబర్ 9, 2025న ముంబైలో పీఎం మోదీ, స్టార్మర్ మధ్య చర్చలు జరగనున్నాయని తెలిపింది.'విజన్ 2035' రోడ్‌మ్యాప్ ప్రకారం, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, రక్షణ, భద్రత, వాతావరణం, ఆరోగ్యం, విద్య, ప్రజల మధ్య సంబంధాల్లో పురోగతిని సాధించడమే లక్ష్యంగా ఇరు దేశాలు సమావేశాల్లో చర్చించే అవకాశం ఉంది. భారత్–యూకే కాంప్రెహెన్సివ్ ఎకనామిక్ అండ్ ట్రేడ్ అగ్రిమెంట్ ఇందులో కీలక భూమిక పోషించే అవకాశం ఉంది.

# రసవత్తరంగా బీహార్ ఎన్నికలు పొత్తులు జిత్తులతో నిలిచేదెవరు గెలిచేదెవరు



**బీహార్ :** ఈ సంవత్సరం జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు గత ఎన్నికల కంటే భిన్నంగా ఉండబోతున్నాయి. కొత్త పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. చిరాగ్ పాస్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) తిరిగి ఎన్డీఏ శిబిరంలోకి చేరడం, ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని జాన్ సురాజ్ ఎన్నికల అరంగేట్రం చేయడం, అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ప్రభావం మొత్తం ఎన్నికల ఫలితాన్ని ప్రభావితం చేసే అవకాశంతో మరో అనిశ్చితి కనిపిస్తుంది. ఇక, ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తర్వాత జరుగుతున్న మొదటి ఎన్నిక ఇది..! బీహార్‌లో సీట్ల పొత్తుపై అటు ఎన్డీఏ కూటమి , ఇటు ఇండి కూటమి కసరత్తును వేగవంతం చేశాయి. చెరి సగం సీట్లలో పోటీ చేయాలన్న ఆలోచనలో భారతీయ జనతా పార్టీ, జేడీయూ పార్టీలు ఉన్నాయి. కాంగ్రెస్‌కు ఆర్జేడీ 55 సీట్లను ఆఫర్ చేసిందిబీహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయ్యింది. సీట్ల పొత్తుపై ఎన్డీఏ, ఇండి కూటమి నేతలు చర్చలు ప్రారంభించారు. చెరి సగం సీట్లలో పోటీ చేయాలన్న ఆలోచనతో జేడీయూ, బీజేపీ ఉన్నట్టు తెలుస్తోంది. 205 సీట్లలో రెండు పార్టీలు పోటీ చేయాలని నిర్ణయించాయి. మిత్రపక్షాలకు 38 సీట్లు ఇచ్చేందుకు సిద్ధమయ్యాయి. చిరాగ్ పాశ్వాన్ నేతృత్వం లోని %హాజీ% తమకు 40 సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. అయితే బీజేపీ నేతలు మాత్రం 25 సీట్లు ఆఫర్ చేశారు. అయితే 40 సీట్లు ఇవ్వకుంటే ప్రశాంత్ కిశోర్‌తో పొత్తుకు చిరాగ్‌పాశ్వాన్ రెడీ అవుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. చిరాగ్ పాశ్వాన్‌కు నచ్చచెప్పడానికి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆయనతో సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో ఐదు సీట్లలో పోటీ చేస్తే తాము అన్ని సీట్లలో గెలిచామని, దీని ఆధారంగా తమకు సీట్లు కేటాయించాలని చిరాగ పాశ్వాన్ పట్టుబడుతున్నారు. మాకు ఎలాంటి అసంతృప్తి లేదు. లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏతో కలిసి పోటీ చేస్తామని పార్టీ అధ్యక్షులు చిరాగ్ పాశ్వాన్ ఇప్పటికే ప్రకటించారు. సీట్ల పొత్తుపై సీనియర్ నేతలు చర్చలు జరుపుతున్నారు. చర్చల్లో చిరాగ్ పాశ్వాన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. 100 శాతం స్ట్రయిక్ రేటు ఉందని, యువ నాయకత్వం ఉంది. మహిళలకు ప్రాతినిధ్యం ఉంది. గౌరవప్రదమైన సంఖ్యలో సీట్లు కేటాయించాలని %హాజీ% ఎంపీ శాంభవి చౌదరి అన్నారు. ఎన్డీఏ కూటమిలో జేడీయూ, బీజేపీ, హిందుస్థానీ అవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీలు ఉన్నాయి. హెచ్‌ఏఎంకు ఏడు, ఆర్‌ఎల్‌ఎంకు ఆరు సీట్లు ఇచ్చేందుకు బీజేపీ రెడీగా ఉంది. ఇండి కూటమిలో కూడా సీట్ల పొత్తుపై చర్చలు కొనసాగుతున్నాయి. 150 సీట్లు కావాలని ఆర్జేడీ నేతలు పట్టుబడుతున్నారు. కాంగ్రెస్‌కు 55 సీట్లు ఇస్తామని ఆఫర్ చేస్తున్నారు. మిగతా సీట్లను మిత్రపక్షాలకు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. బుధవారం కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమవుతుంది. ఈ సమావేశం తరువాత పార్టీ అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది.

# కోల్డ్ సిరఫ్ కేసు మరో ముగ్గురు చిన్నారుల మృతి




**మధ్యప్రదేశ్:** మధ్యప్రదేశ్ లో దగ్గు సిరప్ మరణాలు కొనసాగుతూనే ఉన్నాయి. 24 గంటల్లో మరో ముగ్గురు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటి వరకు మధ్యప్రదేశ్‌లో కాఫ్ సిరప్ మరణాలు 20కి చేరాయి. చింద్వారాలో 17 మంది, పంధుర్నాలో ఒకరు, బేతుల్‌లో ఇద్దరు చనిపోయారు. మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో ఐదుగురు పిల్లలు ఇప్పటికీ ప్రాణాప్రాయస్థితిలో కొట్టుమిట్టాడుతు న్నారు. ఈ కేసులో దగ్గుమందు సిరప్ కంపెనీ యజమానిని అరెస్టు చేయనున్నారు. ఆయనను పట్టుకునేందు కు రెండు బృందాలు చెన్నై, కాంచిపురం చేరుకున్నాయి. దురదృష్టకర ఘటనలో 20 మంది పిల్లల ప్రాణాలు కోల్పోయారని మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, ఆరోగ్య మంత్రి రాజేంద్ర శుక్లా పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న ఉన్న పిల్లలకు దగ్గు సిరప్ ఇవ్వకుండా భారత ప్రభుత్వం, ఐసీఎంఆర్‌సీ అడ్వైజరీని పాటించాలని శుక్లా కోరారు. శుక్లా నిన్న నాగ్‌పూర్‌ను సందర్శించారు. ఐదుగురు పిల్లలు ఆసుపత్రిలో ఉన్నారని.. వారి కుటుంబాలను కలుసుకున్నట్లు చెప్పారు. పిల్లలను కాపాడేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ ప్రవీణ్ సోనితో సహా కొంతమంది ప్రైవేట్ వైద్యులు పిల్లలకు కోల్డ్రిఫ్ సిరప్ సిఫారసు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సిరప్ ఇచ్చిన కొద్ది గంటల్లోనే పిల్లల్లో కిడ్నీలు దెబ్బతినడం ప్రారంభించాయి. వారి పరిస్థితి క్షీణించి చనిపోయారు. సిరప్‌లో విషపూరిత రసాయనాలు ఉన్నాయని, అవి శరీరంలోకి ప్రవేశించిన తర్వాత కిడ్నీలను దెబ్బతీస్తున్నాయని వైద్య పరీక్షల్లో తేలింది. అందుకే చాలా మంది పిల్లలు కిడ్నీ వైఫల్యంతో మరణించారని.. మరణాల సంఖ్య పెరగడంతో చింద్వారా జిల్లా యంత్రాంగం చర్యలను ముమ్మరం చేసింది. అదనపు కలెక్టర్ ధీరేంద్ర సింగ్ ఇప్పటివరకు 16 మంది చనిపోయారన్నారు. తీవ్రమైన ఆరోగ్య అత్యవసర పరిస్థితి అని, దీన్ని నివారించేందుకు అన్ని స్థాయిల్లో ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఐదు మెడికల్ స్టోర్లను మూసివేసి, అనుమానిత సిరప్ నమూనాలను ల్యాబ్ పరీక్ష కోసం అధికారులు పంపారు. పిల్లలకు ఎలాంటి దగ్గు సిరప్ ఇవ్వకుండా చూడాలంటూ అవగాహన కల్పిస్తున్నారు. ఇదిలా ఉండగా.. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించింది. దర్యాప్తు పూర్తి పారదర్శకతతో జరుగుతోందని, దోషులను వదిలిపెట్టబోమని బీజేపీ పేర్కొంది.

# ఒకటి ఆర్జేడీ కంచుకోట, మరొకటి జేడీయూ అడ్డా



**బీహార్:** ఎన్నికల వ్యూహకర్త, రాజకీయ నాయకుడిగా మారిన ప్రశాంత్ కిషోర్ తాను కొత్తగా స్థాపించిన జాన్ సురాజ్ రాబోయే బీహార్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. పార్టీ అభ్యర్థుల జాబితాను అక్టోబర్ 9న ప్రకటిస్తామని కిషోర్ సోమవారం తెలిపారు. రాబోయే బీహార్ ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని ప్రశాంత్ కిషోర్ ప్రకటించారు. అయితే, తాను పోటీ చేసే నియోజకవర్గం పేరును ఆయన వెల్లడించలేదు. లేదా బ్లాక్‌కు ఓటు వేయని 28 శాతం ఓటర్ల జన్ సురాజ్ పార్టీకి వస్తాయని కిషోర్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఇ 2020 నాటి విజయాన్ని పునరావృతం చేయాలనే లక్ష్యంతో, రాబోయే బీహార్ ఎన్నికలకు సీమాంచల్ నుండి తన పార్టీ ప్రచారాన్ని ఆల్ ఇండియా మజ్లిస్–ఎ–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ప్రారంభించారు. కిషన్‌గంజ్, కతిహార్, అరారియా, పూర్ణియా అనే నాలుగు జిల్లాలను కలిగి ఉన్న సీమాంచల్ ప్రాంతంలో అడుగుపెడుతోంది. 2020 బీహార్ ఎన్నికల్లో, నాలుగు సీమాంచల్ జిల్లాల్లోని 24 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టి, వాటిలో ఐదు స్థానాల్లో విజయం సాధించింది. అయితే, 2022లో, చెందిన నలుగురు ఎమ్మెల్యేలు ఫిరాయించారు. నవంబరు 6, 11 తేదీల్లో రెండు విడతలుగా బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. నవం బర్ 14వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. షెడ్యూలును ప్రకటించడంతో ఎన్నికల కోడ్ సోమ వారం నుంచే అమల్లోకి వచ్చింది. బీహార్ ప్రస్తుత అసెంబ్లీ గడువు నవంబరు 22వ తేదీతో ముగియ నుంది. కులగణన, నిరుద్యోగం, వలసలు ప్రధానాం శాలుగా ఎన్నికలు జరగబోతున్నాయి. 243 మంది సభ్యులున్న బీహార్ అసెంబ్లీలో 121 స్థానాలకు నవంబర్ 6న ఎన్నికలు జరుగుతాయి. మిగిలిన 122 నియోజకవర్గాలకు నవంబర్ 11న ఎన్నికలు జరుగుతాయి. ప్రస్తుత అసెంబ్లీలో అధికార ఎన్డీఏకు 138 మంది సభ్యులు ఉండగా, ప్రతిపక్ష కూటమికి 103 మంది సభ్యులు ఉన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పదే పదే ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ తర్వాత జరుగుతున్న మొదటి ఎన్నిక ఇది.

# మిలటరీ ఆపరేషన్‌లో 19 మంది టెర్రరిస్టులు హతం, 11 మంది సైనికులు కూడా



**ఇస్లామాబాద్:** తెహ్రీక్–ఇ–తాలిబాన్ పాకిస్థాన్ మిలిటెంట్లు మరోసారి ఖైబర్ ఫఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని మారుమూల ప్రాంత మైన ఒరాక్జాయ్ జిల్లాలో రెచ్చిపోయారు. సాయుధ బలగాలు ప్రయాణించే వాహనమే లక్ష్యంగా మిలిటెంట్లు జరిపిన దాడిలో ఒక లెఫ్టినెంట్ కల్నల్, మరో మేజర్ సహా 11 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. 19 ఉగ్రవాదులను సైతం సైన్యం మట్టుబెట్టింది. ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లో ఈ ఒరాక్జాయ్ జిల్లా ఉంది. ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా మంగళవారం రాత్రి మిలటరీ ఆపరేషన్ చేపట్టారు. దాడికి సంబంధించి పాక్ ప్రభుత్వం ఇంతవరకూ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అయితే ఈ దాడికే తమదే బాధ్యతని టీటీపీ ప్రకటించినట్టు కథనాలు వెలువడుతున్నాయి. దాడికి పాల్పడిన ఉగ్రవాదుల కోసం భద్రతా దళాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నా యి. ఖైబర్ ఫఖ్తుంఖ్వాలోని కరక్‌లో గత నెలలో పాక్ బలగాలు మిలిటెంట్ల శిబిరంపై విరుచుకుపడ్డాయి. 17 మంది టీటీపీ టెర్రరిస్టులను బలగాలు మట్టుబెట్టాయి. కాల్పుల్లో ముగురు పోలీ సు అధికారులు గాయపడ్డారు. 2021లో ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబ న్లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీటీపీ గ్రూప్ పాక్ దళాల పై దాడులు ముమ్మరం చేసింది. ఆ గ్రూప్ నేతలు, ఫైటర్లు చాల మంది ఆఫ్ఘనిస్థాన్‌లో శరణార్థులుగా ఉంటున్నారు. గత నెలలో తీరాహ్ ప్రాంతంలోని ఒక గ్రామంపై పాక్ మిలటరీ ఆపరేషన్ చేపట్టింది. టీటీపీ మిలిటెంట్ల రహస్య స్థావరాలుగా అనుమా నిస్తూ జరిపిన ఈ దాడుల్లో 30 మంది పౌరులు మృతి చెందారు. దీంతో పాక్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది.

# పాక్ నయవంచక విధానాలు !

ఆపరేషన్ సిందూర్ ద్వారా చావుదెబ్బతిన్న పాకిస్థాన్...కాల్పుల విరమణ ఒప్పందాన్ని తెరపైకి తెచ్చి, మరింత నష్టం జరక్కుండా చూసుకుంది. లేకుంటే భారత్ చేతిలో చావుదెబ్బ తినివుండేది. కానీ ఇప్పుడా విషయం మరచిపోయింది. మళ్లీ యుద్ధ ప్రేలాపనలు పేలుతోంది. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దెబ్బను రుచి చూసినా.. పాకిస్థాన్ ప్రగల్భాలు మాత్రం ఆపట్లేదు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాటలే ఇందుకు నిదర్శనం. భారత్‌తో మళ్లీ యుద్ధం జరిగే అవకాశాలను తోసిపుచ్చలేమన్నారు. అయితే, ఈసారి యుద్ధం వస్తే తాము అనుకూల ఫలితాలు సాధిస్తామంటూ బీరాలు పలికారు. నేను ఉద్రిక్తతలను కోరుకోవట్లేదు. కానీ, ముప్పు పొంచి ఉన్నమాట వాస్తవం. భారత్‌తో యుద్ధం అవకాశాలను కొట్టిపారేయ లేం. కానీ, ఈసారి యుద్ధం జరిగితే.. గతంలో కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తాం అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాక్‌కు ఇటీవల భారత్ ఆర్మీ చీఫ్ గట్టి వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దానికి బదులిస్తూనే ఖవాజా ఈ విధంగా కవ్వింపులకు పాల్పడ్డారు. ఇటీవల భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ.. భారత్ పూర్తి సన్నద్ధంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ 1.0లో మాదిరిగా ఈసారి సహనం ప్రదర్శించబోం. పాక్ ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపి తీరాల్సిందే. లేదంటే ఆ దేశాన్ని చరిత్ర నుంచి తుడిచిపెట్టాల్సి వస్తుంది జాగ్రత్త అని జనరల్ ద్వివేది గట్టిగా హెచ్చరించారు. అయితే వీటిని ఓ హెచ్చరికగా తీసుకుని జాగ్రత్తగా ఉండాల్సిన పాక్ నేతలు తరచూ మాటలు పేలుతూనే ఉన్నారు. ఇదంతా కేవలం అమెరికా అండచూసుకునే అని వేరుగా చెప్పనక్కరలేదు. అమెరికా కూడా గతాన్ని మరచి పాక్‌కు పాలుపోసి పెంచుతోంది. ఎందుకంటే ద్రోహం, వంచనకు మారుపేరు పాకిస్తాన్. ఇన్నాళ్లు కష్టకాలంలో ఆర్థికంగా, సైనికంగా రక్షిస్తూ వస్తున్న డ్రాగన్ కంట్రీ చైనాకు పాకిస్తాన్ నమ్మకద్రోహం చేస్తోంది. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌లు అమెరికా పంచన చేరి, చైనా ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నారు. రెండుదేశాల మధ్య పాకిస్తాన్ డేంజరస్ గేమ్ ఆడుతోంది. ఇటీవల, పాకిస్తాన్ ట్రంప్‌తో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతోంది. ముఖ్యంగా, ఇరు దేశాల మధ్య ఖనిజ ఒప్పందం కుదిరింది. దీంతో బలూచిస్తాన్ ప్రాంతంలోని రేర్ ఎర్త్ మినరల్స్,రాగి వంటి లోహాలను అమెరికా కొల్లగొట్టడానికి చూస్తోంది. దీనికి పాకిస్తాన్ ప్రభుత్వం ప్రత్యక్షంగా సహకరిస్తోంది. నిజానికి ఇంతకాలం చైనాతో చెట్టాపట్టాలేసుకుని తిరిగింది. ఆపరేషన్ సిందూర్ లో కూడా చైనా సాయం తీసుకుంది. అమెరికా దగ్గరకు పిలిచి ముద్దు చేయడంతో ఇప్పుడు చైనాకు చెక్ పెట్టి అమెరికా పంచన చేరింది. అమెరికా, పాకిస్తాన్ స్నేహం భారత్‌కు ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది. ఇప్పటికే అమెరికా మద్దతుతో పాక్ బలుపు మాటలు మాట్లాడుతోంది. ఇక



పస్నీ ద్వారా భారత వ్యూహాత్మక ఓడరేవు చాబహార్‌ని కౌంటర్ చేయవచ్చు. అమెరికా స్నేహం పాకిస్తాన్‌కు మిలిటరీ, ఇంటెలిజెన్స్ వంటి వ్యూహాత్మక సహకారాన్ని అందించవచ్చు. ఈ చర్యల ద్వారా పాకిస్తాన్తన రక్షణ ఒప్పందాలను మెరుగు పరుచుకోవచ్చు. పాకిస్తాన్ భౌగోళిక రాజకీయ విశ్వాసాన్ని పెంచుతుంది. భారత్‌తో పోలిస్తే తన స్థానాన్ని బలోపేతం చేస్తుంది. ఈ చర్యలు ఇరాన్‌కు కూడా ప్రమాదకరమే. ఇరాన్ షిప్పింగ్ లైన్లపై అమెరికా నిఘా పెరుగుతుంది. అమెరికా, పాక్ బంధంపై భారత్ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ట్రంప్ ఇప్పుడు భారత్‌ను ఇబ్బంది పెట్టే ఏ చర్యను కూడా వదలడం లేదు. నిజానికి పాకిస్తాన్ ద్వారా అరేబియా సముద్రానికి మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని 60 బిలియన్ డాలర్లతో చైనా చైనా-పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్‌ను ప్రారంభించింది. బలూచిస్తాన్‌లో గ్వాదర్ పోర్టును నిర్మించింది. అయితే, ఇప్పుడు ఈ గ్వాదర్ పోర్టుకు కేవలం 70 మైళ్ల దూరంలో అమెరికాతో కలిసి పస్నీ ఓడరేవును నిర్మించేందుకు పాకిస్తాన్ సిద్ధమైంది. ఇది భారత్ ఇరాన్‌లో నిర్మిస్తున్న చాబహార్ పోర్టుకు కేవలం 178 మైళ్ల దూరంలోనే ఉంది. చైనా, భారత్, ఇరాన్, ఇరాన్, సౌదీ అరేబియా వంటి దేశాలకు కీలమైన ఈ వ్యూహాత్మక స్థానాన్ని పాకిస్తాన్ అమెరికాకు స్థానం కల్పిస్తోంది. ఈ ఓడరేవు అరేబియా, హిందూ మహాసముద్రంలోని సముద్ర భద్రతకు కూడా చిక్కులు కల్పిస్తుంది. ఈ పస్నీ ఓడరేవు ద్వారా బలూచిస్తాన్‌లోని ఖనిజ సంపదను అమెరికాకు తరలించవచ్చని పాకిస్తాన్ భావిస్తోంది. అయితే, ఇప్పటి వరకు దీనిపై రెండు దేశాలు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఒక వేళ కార్యరూపం దాల్చితే, చైనాతో పాటు భారత్ ప్రయోజనాలకు కూడా తీవ్ర భంగం కలిగించవచ్చు. దీని నిర్మాణానికి 1.2 బిలియన్ డాలర్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ ఓడరేవు బ్యాటరీ టెక్నాలజీ, క్షిపణుల తయారీ, అధునాతన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల్లో ఉపయోగించే రాగి, యాంటిమోనీ, నియోడైమియం వంటి ఖనిజాల ఎగుమతులకు గేట్‌వేగా మారుతుంది. సెప్టెంబర్ 8న పాకిస్తాన్ మిలిటరీ ఇంజనీరింగ్ కార్ప్స్‌తో 500 మిలియన్ల అవగా హన ఒప్పందంపై సంతకాలు చేశాయి. పాకిస్తాన్ ఈ ఖనిజాల షిప్‌మెంట్‌ను మిస్సోరీకి చెందిన జా స్ట్రాటజిక్ మెటల్స్‌కి ఎగుమతి చేసింది. అమెరికాను మచ్చిక చేసుకుని భారత్‌పై పగతీర్చు కోవ దానికి పాక్ వెనకాడకపోవచ్చు.

# అమెరికా వెళ్లేందుకు జంకు




## ట్రంప్ చర్యలతో చాలామంది వెనకడుగు

## తగ్గిన విద్యార్థి వీసాలా జారీ

**వాషింగ్టన్,అక్టోబర్8:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విద్యార్థి వీసాలపై విధించిన కఠిన ఆంక్షలతో.. వీసాల తగ్గుదలలో భారతీయ విద్యార్థులే అగ్రస్థానంలో ఉన్నట్లు నివేదిక తెలిపింది. బెదిరింపు విధానాలు, ఆంక్షల మధ్య అమెరికా వెళ్లేందుకు భారతీయ విద్యార్థులు వెనకడుగు వేస్తున్నారు. దీంతో ఈయేడు అమెరికా వెళ్లాలనుకున్న వారు తగ్గారు. ఆగస్టులో అమెరికా సుమారు ఐదోవంతు తక్కువ విద్యార్థి వీసాలు జారీ చేసిందని, దీంతో భారతీయ విద్యార్థుల సంఖ్య పడిపోయిందని ఇంటర్నేషనల్ ట్రేడ్ అడ్మినిస్ట్రేన్ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. అమెరికా యూనివర్శిటీల్లో విద్యాసంవత్సర ప్రారంభ నెల అయిన ఆగస్టులో 3,13,138 విద్యార్థి వీసాలను జారీ చేసింది. ఇది 2024 ఆగస్టుతో పోలిస్తే 19.1శాతం తగ్గినట్లు వెల్లడించింది. గతేడాది అమెరికాకు వెళ్లిన విద్యార్థుల్లో భారతీయ విద్యార్థులు అగ్రస్థానంలో ఉన్న సంగతి తెలిసిందే. గతేడాది కన్నా 44.5శాతం తక్కువ విద్యార్థి వీసాలు జారీ అయ్యాయి. అదే సమయంలో చైనా విద్యార్థులకు 84,647 వీసాలను జారీ చేసింది. ఇది భారతీయ విద్యార్థులకు జారీ చేసిన వీసా సంఖ్య కన్నా రెట్టింపు కంటే ఎక్కుగా ఉన్నట్లు నివేదిక తెలిపింది. అయితే ఈనివేదిక అమెరికాలో విధ్యనభ్యసిస్తున్న మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యను ప్రతిబింబించదు. వీరిలో చాలా మది గతంలో జారీ చేసిన వీసాలపైనే నివసిస్తున్నారు. తాజా గణాంకాలు అనేక ముస్లిం దేశాల నుండి విద్యార్థి వీసాలలో గణనీయ మైన తగ్గుదల నమోదైనట్లు నివేదిక తెలిపింది. ఇరాన్ నుండి ప్రవేశాలు 86శాతం తగ్గాయి. అమెరికా అధ్యక్షునిగా రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ట్రంప్ శరణార్థులు, వీసాల జారీపై ఆంక్షలు విధించారు. జూన్‌లో విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో విద్యార్థి వీసాల ప్రాసెసింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించాలని రాయబార కార్యాలయాలకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఐటి నిపుణుల కోసం జారీ చేసే హెచ్1బి వీసాల రుసుమును కూడా ట్రంప్ భారీగా పెంచారు. ఈ క్రమంలో అమెఇరాకా అంత సులువు కాదన్న భావనలో భారతీయ విద్యార్థులు ఉన్నారు.

# భారత్ నిర్ణయాలను శాసించలేం

## ఎవరితో సంబంధాలు కొనసాగించాలన్నది వారి ఇష్టం

## రష్యా చమురు కొనుగోళ్లే భారత్ ఆర్థికి వృద్ధికి కారణం కాదు

## ట్రంప్ సలహాదారు జెమీసన్ గ్రీర్ వెల్లడి



**న్యూయార్క్,అక్టోబర్8:** అమెరికా అధ్యక్షుడికి మెల్లగా సొంత వర్గం నుంచే వ్యతిరేకత వస్తోంది. ఆయన చర్యలు కొందరు జీర్ణించుకోలేక పోతున్నారు. దీంతో యాదార్థాలన ముక్కుసూటిగా చెప్పేస్తున్నారు. ప్రధానంగా రష్యా నుంచి భారత్ ఆయిల్ కొనుగోలుపై ట్రంప్ తీరును తప్పుపడుతున్నారు. భారత్ సార్వభౌమత్వ దేశమని ట్రంప్ సలహాదారు జెమీసన్ గ్రీర్ అన్నారు. ఆ దేశం సొంత నిర్ణయాలు తీసుకోగలదని తెలిపారు. ఇతర దేశాలు ఎవరితో సంబంధాలు కొనసాగించాలి.. ఎవరితో కొనసాగించ కూడదు అనేది మేం చెప్పాలనుకోవడం లేదు. ఈ విషయంలో మేం ఎవర్నీ శాసించడం లేదు అని గ్రీర్ తెలిపారు. రష్యా నుంచి కొనుగోలు చేసే చమురే భారత ఆర్థిక వ్యవస్థకు ఆధారం కాదని అమెరికా వాణిజ్య ప్రతినిధి, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహాదారు జెమీసన్ గ్రీర్ అన్నారు. అయినా ఇప్పటికే భారత్ తన చమురు కొనుగోళ్లను మాస్కో నుంచి మళ్లిస్తోందని తెలిపారు. న్యూయార్క్‌లో జరిగిన ది ఎకనామిక్ క్లబ్‌లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాతో భారత్‌కు బలమైన సంబంధాలు ఉన్నాయి. కానీ, గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో మాస్కో నుంచి చమురును కొనుగోలు చేయలేదు. డిస్కౌంట్ ధరల కారణంగా గత రెండు, మూడేళ్ల నుంచి రష్యా చమురును ఎక్కువగా కొంటోంది. ఇది కేవలం వినియోగం కోసం మాత్రమే కాదు.. ఆ చమురును శుద్ధి చేసి రీసేల్ చేస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే భారత ఆర్థిక వ్యవస్థకు రష్యా చమురు కొనుగోళ్లు ఒక్కటే బలమైన ఆధారం కాదని అర్థమవుతోంది. అందుకే వారు ఇతర దేశాల నుంచి కొనుగోలు చేయాలని సూచిస్తున్నాం. దీన్ని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాం. ఇప్పటికే వారు ఈ విషయంలో వైవిధ్యభరిత చర్యలు ప్రారంభించడం మేం చూస్తున్నాం అని గ్రీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాల గురించి కూడా ఆయన ప్రస్తావించారు. అమెరికాతో వాణిజ్యం కారణంగా భారత్‌కు 40 బిలియన్ డాలర్లకు పైగా మిగులు ఉంటోంది. మేం వారికి విక్రయించే దానికంటే.. భారత్ మాకు అమ్మేవే ఎక్కువ. అయితే, రష్యా చమురును కొనుగోలు చేయడంతో ఉక్రెయిన్‌పై యుద్ధానికి పుతిన్‌కు న్యూఢిల్లీ వనరులను అందించినట్లవుతోంది. మాస్కోపై ఒత్తిడి తెచ్చేందుకే భారత్‌పై ఈ స్థాయిలో సుంకాలు విధించాల్సి వచ్చింది. అయితే, టారిఫ్‌ల విషయంలో అమెరికాతో ఆ దేశం గొప్ప డీల్ చేసుకుంటోందని గ్రీర్ వెల్లడించారు.

# భారత్‌తో యుద్ధ ప్రమాదం తొలగిపోలేదు




## అలాంటిది వస్తే ఈసారి మాదే పైచేయి

## పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్

**లాహోర్,అక్టోబర్8:** ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దెబ్బను రుచి చూసినా.. పాకిస్థాన్ ప్రగల్భాలు మాత్రం ఆపట్లేదు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. భారత్‌తో మళ్లీ యుద్ధం జరిగే అవకాశాలను తోసిపుచ్చలేమన్నారు. అయితే, ఈసారి యుద్ధం వస్తే తాము అనుకూల ఫలితాలు సాధిస్తామంటూ బీరాలు పలికారు.పాక్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. నేను ఉద్రిక్తతలను కోరుకోవట్లేదు. కానీ, ముప్పు పొంచి ఉన్నమాట వాస్తవం. భారత్‌తో యుద్ధం అవకాశాలను కొట్టిపారేయలేం. కానీ, ఈసారి యుద్ధం జరిగితే.. గతంలో కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తాం అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాక్‌కు ఇటీవల భారత్ ఆర్మీ చీఫ్ గట్టి వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దానికి బదులిస్తూనే ఖవాజా ఈ విధంగా కవ్వింపులకు పాల్పడ్డారు.ఇటీవల భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ.. 'భారత్ పూర్తి సన్నద్ధంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ 1.0లో మాదిరిగా ఈసారి సహనం ప్రదర్శించబోం. పాక్ ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపి తీరాల్సిందే. లేదంటే ఆ దేశాన్ని చరిత్ర నుంచి తుడిచిపెట్టాల్సి వస్తుంది జాగ్రత్త అని జనరల్ ద్వివేది గట్టిగా హెచ్చరించారు. అంతేగాక, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని సైనికులను ఆదేశించారు. పూర్తి సన్నద్ధంగా ఉండండి.

# కాలిఫోర్నియాలో దీపావళి సెలవు



## ● ప్రకటన చేసిన గవర్నర్

**శానిఫ్రాన్సిస్కో,అక్టోబర్8:** భారత్‌లో జరిగే అతిముఖ్యమైన పండగల్లో దీపావళికి ప్రత్యేకత ఉంది. దీపావళి మన దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా ప్రాచుర్యం పొందింది. అగ్రరాజ్యం అమెరికాలోనూ దీన్ని ఘనంగా నిర్వహిస్తారు. తాజాగా కాలిఫోర్నియా ఈ పండగను అధికారిక సెలవు రోజుగా ప్రకటించింది. కాలిఫోర్నియా గవర్నర్ న్యూసమ్ ఈ మేరకు ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి పండగను అమెరికాలో సెలవు రోజుగా ప్రకటించాలని ప్రతిపాదిస్తూ గతంలో ఆ దేశ కాంగ్రెస్‌లో ఓ బిల్లు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దాన్ని కాలిఫోర్నియా స్టేట్ అసెంబ్లీ ఆమోదించింది. అసెంబ్లీ సభ్యుడు ఆష్ కల్రా ప్రవేశపెట్టిన బిల్లుపై తాను సంతకం చేశానని న్యూసమ్ పేర్కొన్నారు. ఈ బిల్లుపై గతంలో కల్రా మాట్లాడుతూ.. 'కాలిఫోర్నియాలో అత్యధికంగా భారతీయ అమెరికన్లు ఉన్నారు. ఈ పండుగ రోజును అధికారికంగా సెలవుగా ప్రకటిస్తే అది లక్షలాది మంది కాలిఫోర్నియా ప్రజల్లో సంతోషాలు నింపుతుంది. సద్భావన, శాంతి, ఉమ్మడి భావన అనే సందేశాలతో సమాజాన్ని ఈ పండగ ఒకచోట చేర్చుతు ంది' అని ఆయన పేర్కొన్నారు. కాగా.. పెన్సిల్వేనియా, న్యూయా ర్క్‌లు ఇప్పటికే దీపావళికి అధికారికంగా ఇలాంటి గుర్తింపును ఇచ్చాయి. తాజాగా భారతీయ పర్వదినానికి ఈ రకమైన గుర్తింపు ఇచ్చిన మూడో రాష్ట్రంగా కాలిఫోర్నియా నిలిచింది.

# రోహిత్‌కు పరమ చెత్త సందేశం పంపిన బీసీసీఐ



భారత క్రికెట్‌లో విజయవంతమైన కెప్టెన్‌గా పేరుగాంచిన రోహిత్ శర్మనువన్డే కెప్టెన్సీ నుంచి తప్పించడం ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. రాబోయే ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌కు రోహిత్ స్థానంలో యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌కు పగ్గాలు అప్పగిస్తూ బీసీసీఐ తీసుకున్న ఈ నిర్ణయంపై అభిమానులు, మాజీ క్రికెటర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సక్సెస్ ఫుల్ కెప్టెన్‌ను ఇలా తొలగించడం, అతడికి 'అగౌరవ సందేశాన్ని' పంపించిన చాలా మంది అభిప్రాయపడుతున్నారు .కెప్టెన్సీ తొలగింపు వెనుక కారణం?రోహిత్ శర్మ కెప్టెన్సీలో టీమిండియా 2024లో టీ20 ప్రపంచకప్‌ను, 2025లో ఛాంపియన్స్ ట్రోఫీని గెలిచింది. వన్డేల్లో అతడి విజయాల శాతం (75%) కూడా అద్భుతంగా ఉంది. అలాంటి సారథిని అకస్మాత్తుగా తప్పించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ ఈ నిర్ణయాన్ని 'భవిష్యత్తు ప్రణాళిక' లో భాగంగా తీసుకున్నామని వివరించారు.భవిష్యత్తు దృష్ట్యా: 2027 వన్డే ప్రపంచకప్ నాటికి రోహిత్ వయస్సు 40కి చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో, అప్పటికి జట్టును నడిపించడానికి శుభ్‌మన్ గిల్‌ను ముందుగానే కెప్టెన్‌గా సిద్ధం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని సెలక్టర్లు తెలిపారు.ఫ్యాన్స్, మాజీల ఆగ్రహం..!బీసీసీఐ నిర్ణయంపై సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఇది రోహిత్‌కు చేసిన 'అన్యాయం' అని, ఒక లెజెండ్‌కు ఇచ్చిన 'ద్రోహం'అని ఫ్యాన్స్ మండిప డుతున్నారు.'అన్యాయం' అంటున్న మాజీ క్రికెటర్ మొహమ్మద్ కైఫ్: "రోహిత్ శర్మ భారత క్రికెట్‌కు 16 ఏళ్లు సేవ చేస్తే, మనం అతనికి ఒక్క ఏదాని కూడా ఇవ్వలేకపోయాం" అని మాజీ క్రికెటర్ మొహమ్మద్ కైఫ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐసీసీ టోర్నీల్లో రోహిత్ అందించిన విజయాలను బీసీసీఐ గుర్తించలేకపోయిందని ఆయన అన్నారు.గెలిచినా గౌరవం దక్కలేదా? వరుసగా రెండు ఐసీసీ ట్రోఫీలు అందించిన కెప్టెన్‌ను ఇలా ఒక సిరీస్‌కు ముందు తొలగించడం ద్వారా, అతడి సేవలను బీసీసీఐ పట్టించుకోలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది రోహిత్‌కు మాత్రమే కాదు, జట్టుకు సేవ చేసిన సీనియర్ ఆటగాళ్లకు కూడా బోర్డు ఇచ్చే 'అగౌరవ సందేశం'గా ఫ్యాన్స్ భావిస్తున్నారు.రోహిత్ తొలి స్పందన.ఈ కెప్టెన్సీ మార్పుపై రోహిత్ శర్మ ఎలాంటి అసంతృప్తిని చూపకుండా, రాబోయే ఆస్ట్రేలియా సిరీస్‌పై దృష్టి పెట్టాడు. తన తొలి స్పందనలో, "ఆస్ట్రేలియాకు వెళ్లడం, ఆ జట్టుకు వ్యతిరేకంగా ఆడటం నాకు చాలా ఇష్టం" అని మాత్రమే చెప్పి, కెప్టెన్సీ గురించి మాట్లాడటానికి నిరాకరించాడు. ఒక సీనియర్ బ్యాట్స్‌మెన్‌గా తన పాత్రను విజయవంతంగా కొనసాగించడానికి సిద్ధంగా ఉన్నట్లు హిట్‌మ్యాన్ సంకేతాలు ఇచ్చాడు.ఏదేమైనా, 2027 ప్రపంచకప్ లక్ష్యంగా తీసుకున్న ఈ కెప్టెన్సీ మార్పు, భారత క్రికెట్‌లో ఒక కొత్త శకానికి నాంది పలికింది. అయితే, ఆ క్రమంలో ఒక విజయవంతమైన సారథికి సరైన గౌరవం దక్కలేదన్న అభిప్రాయం మాత్రం బలంగా వినిపిస్తోంది.

# సిక్సర్లు, 133 పరుగులతో సూర్యవంశీ బీభత్సం



భారత అండర్-19 జట్టు ఆస్ట్రేలియాతో జరిగిన రెండు మ్యాచ్‌ల అండర్-19 టెస్ట్ సిరీస్‌ను గెలుచుకుంది. రెండో మల్టీ-డే మ్యాచ్‌లో ఆస్ట్రేలియా భారత్‌కు 81 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. దీనిని భారత్ కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి సాధించింది. మొత్తం భారత అండర్-19 జట్టు ఆస్ట్రేలియాపై సిరీస్ విజయం సాధించింది. 14 ఏళ్ల స్టార్ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ కూడా ఈ సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. 133 పరుగులు చేశాడు.9 సిక్సర్లతో 133 పరుగులు.ఆస్ట్రేలియా అండర్-19తో జరిగిన రెండు మ్యాచ్‌ల మల్టీ-డే సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ 9 సిక్సర్లు, 11 ఫోర్లతో సహ 133 పరుగులు చేశాడు. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లోని మూడు ఇన్నింగ్స్‌లలో అతను ఈ పరుగులు చేశాడు. మొదటి మల్టీ-డే మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో, వైభవ్ సూర్యవంశీ 86 బంతులు ఎదుర్కొని 8 సిక్సర్లు, 9 ఫోర్లతో సహ 113 పరుగులు చేశాడు. రెడ్-బాల్ క్రికెట్‌లో ఇది అతని అత్యధిక స్కోరు.రెండవ మల్టీ-డే మ్యాచ్‌లో, వైభవ్ సూర్యవంశీ రెండు ఇన్నింగ్స్‌లలో ఒక సిక్స్, రెండు ఫోర్లతో సహ కేవలం 20 పరుగులు మాత్రమే చేశాడు. ఈ విధంగా, ఆస్ట్రేలియా అండర్-19తో జరిగిన మొత్తం సిరీస్‌లో, అతను తొమ్మిది సిక్సర్లతో 133 పరుగులు చేశాడు.'హరిస్ రవూఫ్ భారత్ కోసం పనిచేసే ఓ రా ఏజెంట్': బాబర్ ఆస్ట్రేలియాపై భారత్ క్లీన్ స్వీప్.ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన తొలి మల్టీ-డే మ్యాచ్‌లో భారత అండర్-19 జట్టు ఇన్నింగ్స్ 58 పరుగుల తేడాతో విజయం సాధించింది. రెండవ మల్టీ-డే మ్యాచ్‌లో, భారత అండర్-19 జట్టు ఆస్ట్రేలియాను 7 వికెట్ల తేడాతో ఓడించి, రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. ఆయుష్ మాత్రే నాయకత్వంలో రెడ్-బాల్ క్రికెట్‌లో భారత జట్టు సాధించిన తొలి సిరీస్ విజయం ఇది. గతంలో, ఇంగ్లాండ్‌లో జరిగిన టెస్ట్ సిరీస్ డ్రాగా ముగిసింది.సిరీస్‌లోని చివరి మ్యాచ్ స్థితి.రెండవ మల్టీ-డే మ్యాచ్‌లో, ఆస్ట్రేలియా అండర్-19 జట్టు మొదట బ్యాటింగ్ చేసి 135 పరుగులు చేసింది. ప్రతిస్పందనగా, భారత అండర్-19 జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 171 పరుగులు చేసి 36 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. ఆస్ట్రేలియా అండర్-19 జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో 116 పరుగులకే ఆలౌట్ అయింది. భారత జట్టు ముందు 81 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఈ టార్గెట్‌ను భారత్ సులభంగా ఛేదించి 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

# దాయాదుల మ్యాచ్‌లను రద్దు చేయాలని అథర్టన్ డిమాండ్



ఆర్థికావసరాల కోసమే అంటూ మండిపాటు

లండన్: చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ మధ్య ఐసీసీ ఈవెంట్లలో జరిగే మ్యాచ్‌లను ఇకపైనా రద్దుచేయాలని ఇంగ్లండ్ మాజీ సారథి మైకెల్ అథర్టన్ డిమాండ్ చేశారు. ఐసీసీ, బ్రాడ్ కాస్టర్ల ఆర్థికావసరాల కోసమే దాయాదుల మ్యాచ్‌లను నిర్వహిస్తున్నారని ఆయన 'ది టైమ్స్'కు రాసిన వ్యాసంలో మండిపడ్డారు. ఇటీవలే ముగిసిన ఆసియా కప్‌లో ఇరుజట్ల మధ్య 'నో షేక్‌హ్యాండ్', ఆటగాళ్ల విపరీత ప్రవర్తన, ట్రోఫీ వివాదం నేపథ్యంలో అథర్టన్ వ్యాసం చర్చనీయాంశమవుతున్నది. '2013 నుంచి భారత్, పాకిస్తాన్ ఐసీసీ నిర్వహిస్తున్న ప్రతి ఈవెంట్‌లో గ్రూప్ దశలో తలపడుతున్నాయి. అంటే మూడు వన్డే ప్రపంచకప్‌లు, ఐదు టీ20, మూడు చాంపియన్స్ ట్రోఫీలలో ఈ జట్లు ఆడాయి. ఇరుజట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు కొరత ఉన్నప్పటికీ ఐసీసీ ఈవెంట్లలో ఈ జట్లు పదేపదే తలపడటం వెనుక ఉన్న ప్రధాన కారణం ఆర్థికావసరాలే. ప్రసారహక్కుల విలువ అధికంగా ఉండటమూ దీనికి ఒక కారణం. ఒకప్పుడు క్రికెట్ దౌత్యానికి వారధిగా ఉండే ఇప్పుడు అది విస్తృత ఉద్రిక్తతలకు దారితీసే వనరుగా మారింది. గతంలో ఒకరి భూభాగంలో ఒకరు క్రికెట్ ఆడటం అనేది రెండు దేశాలు మాట్లాడుకునే మార్గం. కానీ ఇప్పుడు ఆ స్థానంలో నిశ్శబ్దం అలుముకుంది. తదుపరి ప్రసారహక్కుల చక్రంలో అయినా ఐసీసీ ఈవెంట్లకు ముందు ఫిక్చర్ డ్రా పారదర్శకంగా ఉండాలి. ఉద్దేశపూర్వకంగా ఏర్పాటుచేస్తున్న ఈ ఫిక్చర్లను నిలిపేయాలి' అని రాసుకొచ్చారు. రాజకీయ, సరిహద్దు ఉద్రిక్తతలను ఆసరాగా చేసుకుని వ్యూయర్‌షిప్ పెంచుకునే ఈ సంస్కృతికి ఇప్పటికైనా అడ్డుకట్ట వేయాలని అథర్టన్ డిమాండ్ చేశారు.

# వైజాగ్‌లో పరుగుల వరదే




మహిళల వరల్డ్‌కప్‌లోని గత రెండు మ్యాచ్‌ల్లో భారత జట్టు బ్యాటింగ్‌లో తడబడింది. ఈ నేపథ్యంలో విశాఖలో బలమైన దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాతో హర్మన్‌ప్రీత్ సేన తలపడనుంది. అయితే, కీలక మ్యాచ్‌లకు ఎలాంటి పిచ్‌ను తయారు చేస్తారోనన్న చర్చ జోరుగా సాగుతోంది. కానీ, విశాఖలో ఫ్లాట్ పిచ్‌ను తయారు చేశారన్న వార్త భారత బ్యాటర్లకు ఊరటనిచ్చేదే. శ్రీలంక, పాకిస్తాన్‌పై జరిగిన మ్యాచ్‌ల్లో భారత్ గెలిచింది. కానీ, అరుదైన బౌలర్ల ప్రతిభతోనేనే చెప్పుకోవాలి. బ్యాటర్లు విఫలమైనా.. బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థులను కట్టడి చేశారు. కానీ, బిగ్ మ్యాచ్‌లు కావడంతో హర్మన్, స్మృతి ఫామ్‌లోకి రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. 'పిచ్ బ్యాటర్లకు అనుకూలం. గత కొన్ని మ్యాచ్‌లను పరిశీలిస్తే.. మంచు ప్రభావం లేకపోతే స్పిన్నర్లకు కొంత సహకారం లభించవచ్చు' అని ఆంధ్ర క్రికెట్ చేశారు. కానీ, బిగ్ మ్యాచ్‌లు కావడంతో సంఘం తెలిపింది. వైజాగ్‌లో 11 ఏళ్ల తర్వాత మహిళల వన్డే మ్యాచ్ జరుగుతోంది. 2014, జనవరి 23న ఇదే వేదికపై శ్రీలంకతో భారత్ తలపడింది.విశాఖ చేరుకున్న దక్షిణాఫ్రికా క్రికెటర్లుమహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా గురువారం భారత జట్టుతో తలపడనున్న దక్షిణాఫ్రికా క్రికెటర్లు మంగళవారం విశాఖపట్నం చేరుకున్నారు. సోమవారం ఇండోర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాసాధించిన సంగతి తెలిసిందే.

# వచ్చే ఏడాది జీతాల్లో 9% పెరుగుదల : సర్వే



ప్రపంచ ఆర్థిక వృద్ధి మందగించినప్పటికీ.. వినియోగం, పెట్టుబడులు, విధానపరమైన మద్దతు కారణంగా వచ్చే ఏడాది భారత్ లో ఉద్యోగుల జీతాలు 9 శాతం పెరిగే అవకాశం ఉంది. యాన్యువల్ శాలరీ ఇంక్రీజ్ అండ్ టర్నోవర్ సర్వే2024-25 ద్వారా ఈ విషయం వెల్లడైంది. 2025లో నమోదైన 8.9 శాతం జీతాల వృద్ధి కంటే.. వచ్చే ఏడాది జీతాలు సుమారు 9 శాతం పెరుగుతాయని సర్వే అంచనా వేసింది.భారత్‌లోని దాదాపు 1,060 సంస్థల నుంచి అభిప్రాయాలను సేకరించింది. ఇందులో 2026లో రియల్ ఎస్టేట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీలు 10.9 శాతం, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు 10 శాతం చొప్పున జీతాలు పెంచే అవకాశం ఉన్నట్లు తేలింది. అయితే టెక్నాలజీ కన్సల్టింగ్ రంగంలో జీతాల వృద్ధి గతేడాదితో పోలిస్తే కొంత తగ్గడం కనిపిస్తోంది. ఎగుమతులు తగ్గడం, ఏఐ (కృత్రిమ మేధస్సు) ప్రభావం కారణంగా టెక్నాలజీ కన్సల్టింగ్ రంగాలు మాత్రం జీతాల పెంపు 6.5 శాతానికే పరిమితం చేయనున్నాయి. 2025 ఐటీ కంపెనీలు 7 శాతం జీతాల పెరుగుదలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక ఆటోమోటివ్, వాహన తయారీలో జీతాల పెంపు 9.6 శాతంగా అంచనాలు ఉన్నాయి. ఇంజనీరింగ్ డిజైన్ సేవల్లో (9.7 శాతం), రిటైల్ (9.6 శాతం), లైఫ్ సైన్సెస్ (9.6 శాతం) జీతాల పెరుగుదల ఉండే ఉందని సదరు సర్వే వెల్లడించింది.

# 82 వేలు దాటిన సెన్సెక్స్




వరుసగా ఐదో రోజు కూడా దేశీయ సూచీలు లాభాల బాటలో సాగుతున్నాయి. మెటల్, ఫైనాన్షియల్ రంగాల్లో కొనుగోళ్లు సూచీలను ముందుకు నడిపిస్తున్నాయి. దీంతో సెన్సెక్స్ మళ్లీ 82 వేల మార్క్ దాటేసింది. విదేశీ మదుపర్లు అమ్మకాలు కొనసాగుతున్నప్పటికీ నిఫ్టీ 25 వేల మైలురాయిని చేరుకోవడం విశేషం. దీంతో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతున్నాయి.మంగళవారం ముగింపు (81, 926)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 30 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత లాభాల్లోకి వచ్చింది. ఒక దశలో 250 పాయింట్లకు పైగా లాభపడింది. ప్రస్తుతం ఉదయం 10:15 గంటల సమయంలో సెన్సెక్స్ 129 పాయింట్ల లాభంతో 82, 055 వద్ద కొనసాగుతోంది. మళ్లీ 82 వేల మార్క్‌ను చేరుకుంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతం 29 పాయింట్ల లాభంతో 25, 137 వద్ద కొనసాగుతోంది.సెన్సెక్స్‌లో టైటాన్ కంపెనీ, ఎస్బీఐ కార్డ్, హిటాచీ ఎనర్జీ, నాల్కో, టీసీఎస్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి . కేన్స్ టెక్నాలజీస్, ఏబీ క్యాపిటల్, కెనరా బ్యాంక్, నైకా, గ్రోన్‌మార్క్ మొదలైన షేర్లు నష్టాల బాటలో కొనసాగు తున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 207 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 180 పాయింట్ల నష్టంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 88.77గా ఉంది.

# రిటైర్‌మెంట్ నాటికి కోటి రూపాయలు జమ చేయాలంటే ప్లానింగ్ ఇలా ఉండాలి



రిటైర్ మెంట్ తర్వాత జీవితం సాఫీగా సాగాలంటే దానికై ముందు నుంచే ప్రణళిక వేసుకోవాలి. ఆ వయసులో ఉండే అవసరాల దృష్ట్యా సరిపడా ఆదాయాన్ని సమకూర్చుకునేలా ప్లాన్ చేసుకోవాలి. రిటైర్ మెంట్ తర్వాత ఉండే అవసరాల కోసం రిటైర్ మెంట్ ఫండ్ ను రెడీ చేసుకోవాలి. అయితే నిపుణుల ప్రకారం ఈ ఫండ్ రూ. కోటి ఉంటే బాగుంటుంది. కోటి రూపాయలు అంటే ఇప్పుడు ఎక్కువగా కనిపించొచ్చు. కానీ, ముప్పై ఏళ్ల తర్వాత అది కాస్త తక్కువ మొత్తంగా అనిపించొచ్చు. అందుకే రిటైర్ మెంట్ నాటికి కనీసం కోటి రూపాయల ఫండ్ సమకూర్చుకుంటే మిగిలిన జీవితాన్ని హాయిగా జీవించొచ్చు అంటున్నారు నిపుణులు. ఈ కోటి రూపాయల కోసం ఎలా ప్లాన్ చెయ్యాలంటే... కాలంతోపాటే డబ్బు విలువ తగ్గిపోతుంటుంది. దీన్నే ద్రవ్యోల్బణం అంటారు. అంటే ఈ రోజు వంద రూపాయలకు వచ్చిన వస్తువు పదేళ్ల తర్వాత అదే రేటుకి రాదు. కాబట్టి ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని పొదుపు చేసుకోవాలి. ద్రవ్యోల్బణం అనేది ఏడాదికి 2 నుంచి 3 శాతం పెరుగుతుంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పొదుపు చేయాలి. అందుకే రిటైర్ మెంట్ ఫండ్ విషయంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లతోపాటు ఈక్విటీ మార్కెట్ ను కూడా ఎంచుకోవాలి. నెలకు రూ.15 వేలు చొప్పున 20ఏళ్ల పాటు సిప్ చేస్తే.. సంవత్సరానికి 12 శాతం సగటు రిటర్న్ తో.. 20 ఏళ్లకు రూ.1 కోటి నిధిని సమకూర్చుకోవచ్చు.విత్ డ్రా ఇలా.మరొక విషయం ఏంటంటే. రూ. కోటి నిధిని సమకూర్చుకున్నాక దాన్ని ఎలా విత్ డ్రా చేసుకోవాలి అన్నది కూడా తెలిసి ఉండాలి. లేకపోతే కోటి రూపాయలకు కూడా కొన్నేళ్లలోనే ఖర్చయ్యే అవకాశం ఉంది. ముందుగా కోటి రూపాయలను 40 శాతం ఈక్విటీ మార్కెట్స్ లో 60 శాతం ఫిక్స్ డ్ డిపాజిట్లలో పెట్టాలి. ఇప్పుడు వీటిలో నుంచి ప్రతి ఏడాది 3 శాతం ఈక్విటీ నుంచి 8 శాతం ఫిక్స్ డ్ డిపాజిట్ల నుంచి విత్ డ్రా చేసుకోవాలి. ఇలా చేస్తూ పోతే మీ రూ.కోటి ఖర్చవ్వకుండా ఇంకా పెరుగుతూ పోతాయి. ఎందుకంటే ఈక్విటీ మార్కెట్ నుంచి తక్కువ తీసుకుంటున్నాం కాబట్టి. ఇలా ప్లాన్ చేసుకుంటే రిటైర్ మెంట్ లైఫ్ ఫైనాన్షియల్ ప్రాబ్లమ్స్ లేకుండా సాగిపోతుంది.పెన్షన్ స్కీమ్‌ఇకపోతే నేషనల్ పెన్షన్ స్కీం(ఎన్‌పీఎస్) ద్వారా కూడా మీరు రిటైర్ మెంట్ లైఫ్ ను ప్లాన్ చేసుకోవచ్చు. 18 నుంచి 70 ఏళ్ల మధ్య వయసు గలవాళ్లు ఎన్‌పీఎస్‌లో చేరొచ్చు. ఇందులో మీరు చేసే డిపాజిట్ ను బట్టి పెన్షన్ మారుతుంటుంది. అయితే ఇందులో రిటర్న్స్ తక్కువ కాబట్టి కాస్త ఎక్కువ ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. మీరు చేసినదాన్ని నెలవారీ ఆదాయం లభిస్తుంది.

# రికార్డులే రికార్డులు రూ.లక్షా 23 వేల మార్క్ దాటిన బంగారం ధర



బంగారం కొనాలనుకునే వారికి షాక్. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడి దారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపు తుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది. దీంతో బంగారం ధర దూసు కెళ్తోంది. సామాన్యులకు అందనంత ఎత్తుకు బంగారం చేరుతోంది. తులం బంగారం లక్షన్నర వైపు పరుగులు తీస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.. అదే విధంగా వెండి ధరలు సైతం లక్ష 70 మార్క్ కు చేరుకున్నాయి.. చరిత్రలో ఎన్నడూ లేనంతగా బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయికి చేరాయి.. మంగళవారం పది గ్రాముల బంగారంపై రూ.1250 వరకు ధర పెరగగా.. బుధవారం కూడా బంగారం అదే జోరుతో ట్రేడయింది. తాజాగా.. బంగారం 10 గ్రాముల పై రూ.1,150 పెరిగా.. లక్ష 23వేల 170కి చేరుకుని.. సరికొత్త రికార్డును తిరగరాసింది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర లక్ష 23 వేల 170రూపాయల కు చేరింది. 22 క్యారెట్ల ధర రూ.1,12,900 రూపాయలుగా ఉంది.విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ పది గ్రాముల ధర.. రూ.1,23,170 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.రూ.1,12,900 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,67000 లుగా ఉంది.కాగా.. బంగారం ధరలు అన్ని నగరాల్లో ఒకే విధంగా ఉండవు. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం మారుతుంటాయి.పసిడి పరుగులకు అంతర్జాతీయంగా పలు పరిణామాలు ఊతమిస్తున్నాయని.. ఈ ధరలు మరింత పెరిగే అవకాశముందని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ నెలలో మళ్లీ వడ్డీరేట్లు తగ్గించవచ్చనే ఫ్రాన్స్‌లో రాజకీయ అనిశ్చితి, అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్.. జపాన్‌లో బాండ్ ఈల్డ్‌తో బంగారం ధరలు పెరుగుతున్నాయి. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలుసుకోవాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.

# మళ్లీ అవకాశాలు పట్టుకుంటున్న పూజా



ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న మోస్ట్ టాలెంటెడ్ భామల్లో టాప్‌లో ఉంటుంది పూజాహెగ్డే. తమిళం, హిందీ, తెలుగు భాషల్లో టాప్ స్టార్లతో కలిసి నటించి వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. ఈ పొడుగు కాళ్ల సుందరికి తెలుగులో హిట్ పడక చాలా కాలమే అవుతుంది. తెలుగులో కూడా బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంటున్న మాలీవుడ్ స్టార్ యాక్టర్ దుల్కర్ సల్మాన్. ఈ లీడింగ్ హీరో రవి నెలకుడిటి దర్శకత్వంలో ఓ తెలుగు సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో జెట్ స్పీడ్‌లో షూటింగ్ కొనసాగుతోంది. ఈ సినిమాతో లాంగ్ గ్యాప్ తర్వాత పూజా హెగ్డే మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. తాజా కథనాల ప్రకారం ఈ సినిమా కోసం పూజా హెగ్డే ఏకంగా రూ.3 కోట్లు పారితోషికం తీసుకుంటుందని టాక్. అయితే రెమ్యునరేషన్ భారీగా డిమాండ్ చేస్తున్న కారణంగా పూజాహెగ్డే తెలుగు సినిమాలకు దూరమైందని కొన్ని రోజుల క్రితం వార్తలు చక్కర్లు కొట్టాయి. కానీ దుల్కర్ సల్మాన్ టీంకు ఈ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో పూజా హెగ్డేను తమ టీంలోకి తీసుకుందట. ఇక ఈ పుకార్లకు ఫుల్ స్టాప్ పెడుతూ తెలుగులో దుల్కర్ సల్మాన్ సినిమాతో మళ్లీ ఫాంలోకి రావాలని చూస్తున్నట్టు అర్థమవుతుంది. ఇటీవలే రజినీకాంత్ నటించిన కూలీ సినిమాలో మోనికా సాంగ్‌లో మెరిసింది పూజా హెగ్డే. ఈ పాటలో అందాలు ఆరబోస్తూ కుర్రకారుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కూలీ సాంగ్ భారీ హిట్ అయింది. ఇక దుల్కర్ సల్మాన్ సినిమా బ్లాక్ బస్టర్ అయితే పూజాహెగ్డేకు తెలుగులో మళ్లీ మంచి రోజులు వచ్చినట్టేనని చెప్పొచ్చు.

# మాస్ జాతర నుంచి మరో పాట

## ఓలేటోలే పాటపై విమర్శలను తిప్పికొట్టిన రవితేజ




రవితేజ హీరోగా శ్రీలీల హీరోయిన్‌గా కొత్త దర్శకుడు భాను భోగవరపు తెరకెక్కించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మాస్ జాతర'. అక్టోబర్ 31న రిలీజ్ కానుంది. ఈనేపథ్యంలో 'హుడియో హుడియో' పాటను విడుదల చేయనున్నారు. చిట్టి చిలకా.. చిన్న మొలకా..అంటూ సాగే లిరిక్స్‌ను దేవ్ రాయగా అబ్దుల్ వహాబ్, భీమ్స్ సిసిరోలియో ఆలపించారు. ఇటీవల ఇందులోని 'ఓలే ఓలే' లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ పాట లిరిక్స్‌లో అసభ్య పదాలు ఉన్నాయిని విమర్శలు వచ్చాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రవితేజ, దర్శకుడు ఈ విమర్శలపై స్పందించారు. కొన్నిటిపై బోల్డ్ మూవీలు అనే ముద్ర వేస్తారు. అలాంటి వాటితో ఎవరికీ ఇబ్బంది రాదు. కానీ, వారికి నా సినిమాతో మాత్రమే సమస్య వచ్చింది. మా గ్రామాల్లో స్థానికంగా జరిగే ఉత్సవాల్లో కొంతమంది చిన్న చిన్న కథలను పాటలుగా చెబుతుంటారు. వాళ్లు తిట్టుకున్నట్లు అనిపిస్తుంది కానీ, వాస్తవానికి వాళ్లు చాలా ప్రేమగా మాట్లాడుకుంటారని దర్శకుడు భాను అన్నారు. విమర్శలు చేసేవారు కేవలం పాటలోని కొన్ని పదాలను మాత్రమే చూస్తున్నారు. తర్వాత వచ్చే సరదా సంభాషణలను చూడడం లేదు. సినిమా చూశాక ఈ పాట వెనక ఉన్న అసలు కథ మీకు అర్థమవుతుంది. ప్రేక్షకులకు అందరికీ ఈ పాట నచ్చుతుంది. అయినా ఇప్పుడు ఇంగ్లిష్‌లో కొన్ని పదాలు సాధారణం అయిపోయాయి. వాటిని తెలుగులో చెప్పినప్పుడే కొందరికి సమస్య వస్తుందని రవితేజ చెప్పారు. ఇక ఈ పాట సినిమాలో సన్నివేశానికి సరిగ్గా సరిపోతుందని శ్రీలీల అన్నారు.

# ఓటిటిలోకి వార్-2 ఎంటర్

బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్, టాలీవుడ్ స్టార్ నటుడు ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం వార్. కియారా అద్వానీ ఈ సినిమాలో కథానాయికగా నటించగా.. అనిల్ కపూర్, అశుతోష్ రాణా, అలియాభట్, బాబీ దేవోల్, శర్వారీ వాఘ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించగా.. యష్‌రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మించాడు. ఈ చిత్రం ఇండెపెండెన్స్ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం అక్టోబర్ 9 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇండియన్ రా ఏజెన్సీలో ప్రముఖుడైన ఏజెంట్ కబీర్(హృతిక్) కిరాయి హంతకుడిగా మారి హత్యలు చేస్తుంటాడు. ఇదిలావుంటే.. చైనా, రష్యా, శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్ దేశాలన్నీ ఒక కోటరీగా మారి, 'కలి' పేరుతో ఇండియా పతానానికి ఎ÷–లాన్ చేస్తాయి. ఈ మిషన్‌ని కబీర్‌కు అప్పజెబుతాయి. కబీర్‌ను అడ్డుకునేందుకు విక్రమ్ చలపతి (జూనియర్ ఎన్టీఆర్) రంగంలోకి దిగుతాడు. అసలు కబీర్‌కీ, విక్రమ్‌కు మధ్య ఉన్న బంధం ఏంటి? 'కలి' వల్ల భారత ప్రధానికి పొంచివున్న ముప్పును వీరిద్దరూ ఎలా ఆపారు? ఈ మిషన్‌లో వింగ్ కమాండర్ కావ్య లూత్ర(కియారా అద్వానీ) పాత్ర ఏంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.




# 70లోనూ అదే స్టైల్!






వయసు కేవలం ఒక అంకె మాత్రమేనని మెగాస్టార్ చిరంజీవి మరోసారి నిరూపించారు. 70 ఏళ్ల వయసులోనూ ఆయన తన స్టైల్, ఎనర్జీతో అభిమానులను ఫిదా చేస్తున్నారు. ఇటీవల రవి స్టూడియోస్ నిర్వహించిన ఒక ప్రత్యేక ఫొటోషూట్‌లో చిరంజీవి పాల్గొన్నారు. తన నివాసంలో జరిగిన ఈ షూట్‌లో ఆయన ఐదారు రకాల కాస్ట్యూమ్స్ మార్చి ఫొటోలకు ఫోజులిచ్చారు. ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఈ ఫొటోలలో చిరంజీవి లుక్స్ చూసిన నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. "70 ఏళ్లలో కూడా 40 ఏళ్ల కుర్రాడిలా అదరగొడుతున్నారు" అంటూ ప్రశంసలతో కామెంట్లు పెడుతున్నారు. ఆయన ఫిట్‌నెస్, గ్రేస్ చూసి ముగ్ధులవుతున్నారు. ఇటీవల 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాలోని ఓ పాటలో చిరంజీవి స్టైలింగ్‌పై కొన్ని విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ఈ కొత్త ఫొటోషూట్‌తో ఆ విమర్శలన్నింటికీ ఆయన స్టైలిష్‌గా సమాధానం ఇచ్చారని అభిమానులు భావిస్తున్నారు.సినిమాల విషయానికొస్తే, 'భోళా శంకర్' తర్వాత కొంత విరామం తీసుకున్న చిరంజీవి, 2025లో మాత్రం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉండనున్నారు. ఆయన నటిస్తున్న 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరిలో విడుదల కానుండగా, భారీ అంచనాలతో రూపొందుతున్న 'విశ్వంభర' వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.వీటితో పాటు దర్శకుడు బాబీతో ఒక పవర్‌ఫుల్ యాక్షన్ సినిమా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మరో వయలెంట్ డ్రామా చేయనున్నారు. శ్రీకాంత్ ఓదెల సినిమాలో చిరంజీవి సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారని సమాచారం.

# ఇన్‌స్టాగ్రామ్ మెసేజ్‌తో మా ప్రేమ మొదలైంది

## : శోభిత గురించి చైతూ కామెంట్స్



నటుడు అక్కినేని నాగ చైతన్య, నటి శోభితా ధూళిపాళ వైవాహిక జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నారు. తాజాగా వారి ప్రేమ ప్రయాణం గురించి చైతన్య ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. దాదాపు రెండేళ్ల పాటు ప్రేమలో ఉన్న ఈ జంట ఇటీవల వివాహ బంధంతో ఒక్కటైన సంగతి తెలిసిందే. తాజాగా ప్రముఖ నటుడు జగపతిబాబు హోస్ట్ చేస్తున్న 'జయమ్ము నిశ్చయమ్మురా' అనే టాక్ షోలో పాల్గొన్న చైతన్య, తన భార్య శోభితతో పరిచయం ఎలా జరిగిందో సరదాగా వివరించారు.తమ ప్రేమకథకు సోషల్ మీడియానే వేదికైందని చైతన్య తెలిపారు. "నా భార్యను మొదటిసారి ఇన్‌స్టాగ్రామ్‌లో కలుస్తానని అస్సలు ఊహించలేదు. ఆమె వర్క్ నాకు బాగా తెలుసు. ఒకసారి నేను నా క్లౌడ్ కిచెన్ గురించి పోస్ట్ పెట్టినప్పుడు, ఆమె ఒక ఎమోజీతో కామెంట్ చేసింది. అక్కడి నుంచే మా మధ్య చాటింగ్ మొదలైంది. ఆ తర్వాత మేమిద్దరం కలుసుకున్నాం" అంటూ నవ్వుతూ గుర్తుచేసుకున్నారు.తన జీవితంలో శోభిత ప్రాధాన్యతను వివరిస్తూ, "శోభిత నా భార్య... ఆమె నా అతిపెద్ద బలం, మద్దతు. ఆమె లేకుండా నేను ఉండలేను" అని చైతన్య చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వ్యక్తిగత జీవితంలో సంతోషంగా ఉన్న ఆయన, వృత్తిపరంగా కూడా కొత్త ప్రయోగాలు చేస్తున్నారు.

Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com